fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 6 | విజయవాడ, శనివారం 6 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



## పాక్‌కు భద్రతా సాయం బంద్

- అమెరికా తాజా ప్రకటన
- సాయమందకపోయినా బతకగలం : పాక్

**వాషింగ్టన్/ఇస్లామాబాద్ :** ఆఫ్ఘన్ తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌ల వంటి ఉగ్రవాద గ్రూపులపై నిర్ణయాత్మక చర్య తీసుకునేంత వరకూ తాము పాకిస్తాన్‌కు అందచేస్తున్న అన్ని రకాల భద్రతా పరమైన సాయాన్ని నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఉగ్రవాద ముఠాలకు పాక్ ఆశ్రయం ఇస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 1న చేసిన వ్యాఖ్యలను పాక్ అధికారికంగా ఖండించిన కొద్దిసేపటికే అమెరికా విదేశాంగ, రక్షణశాఖలు ఈ ప్రకటన జారీ చేయటం విశేషం. అయితే పాక్ తన వైఖరిని మార్చుకుంటే సాయాన్ని పునరుద్ధరించే వీలుందని సంబంధిత అధికా రులు తెలిపారు. ఈ సాయం మొత్తం ఎంతన్నది అధికారికంగా ప్రకటించనప్పటికీ మొత్తం వందల కోట్ల డాలర్లలోనే వుండవచ్చని తెలు స్తోంది. అయితే గతంలో ప్రకటించిన సాయానికి సంబంధించిన చెల్లింపులు ఇప్పటికీ కొన్ని పెండింగ్‌లో వుండటంతో అమెరికా తాజా నిర్ణయం అమలులో కొంత జాప్యం చోటు చేసుకునే అవకాశం వుందని అధికారులు చెప్పారు.

**పౌర సహాయ కార్యక్రమాల కొనసాగింపు**

ప్రజలకు సంబంధించిన పథకాలకు తాము అందచేస్తున్న పౌర సాయాన్ని మాత్రం కొనసాగించనున్నట్లు అమెరికా తెలిపింది. తాజా సస్పెన్షన్ నుండి పౌర సాయాన్ని మినహాయిస్తున్నామని పేర్కొంది. అయితే జాతీయ భద్రతా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పథకాలకు అందించే సాయంపై కూడా నిర్ణయం తీసుకుంటామని మిగతా 9లో



# తేలని 'తలాక్'

## ముగిసిన శీతాకాల పార్లమెంట్

- ఉభయ సభల్లో 13 బిల్లులు ఆమోదం
- జనవరి 29 నుంచి బడ్జెట్ సమావేశాలు
- ఫిబ్రవరి 1న బడ్జెట్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లుపై ఎటువంటి చర్చ జరగకుండానే పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిశాయి. వాడి వేడిగా సాగిన పార్లమెంట్ ఉభయసభలూ శుక్రవారం నిరవధిక వాయిదా పడ్డాయి. దీంతో తలాక్ బిల్లు ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. చివరి రోజు రాజ్యసభలో తలాక్ బిల్లుకు ఆమోదం పొందేందుకు అధికార పక్షం ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. దీంతో తలాక్ బిల్లుపై ఎటువంటి చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది.

ట్రిపుల్ తలాక్ బిల్లులో కొన్ని లోపభూయిష్టమైన అంశాలున్నాయని, కనుక బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని రాజ్యసభలో ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌కు బిజెపి సమ్మతించకపోవడంతో ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశాలు ముగిశాయి. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ప్రస్తుత శీతాకాల సమావేశాలు డిసెంబర్ 15 నుంచి జనవరి 5 వరకు జరిగాయి. ఉభయ సభలు మొత్తం 22 రోజుల పాటు, 13 సిట్టింగ్స్ జరిపాయి. అందులో లోక్‌సభలో 91.58శాతం సభా కార్యకాలాపాలు జరగగా, రాజ్యసభలో 56.29శాతం జరిగాయి. లోక్‌సభ 61 గంటల, 48 నిమిషాలు పాటు జరిగింది. ఆరు గంటల సేపు డిమాండ్ ఫర్ గ్రాంట్స్ రెండో, మూడో బ్యాచ్-2017-18పై చర్చ జరిగింది. 280 స్వల్ప కాలిక ప్రశ్నలు లిస్టులో ఉన్నాయి. 48 ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. సరాసరి రోజుకు 3.46 ప్రశ్నలకు సమాధాలు మంత్రులు ఇచ్చారు. మిగతా ప్రశ్నలకు రాత పూర్వక సమాధానాలిచ్చారు. మరో 3, 220 ఇతర ప్రశ్నలు సభలో ప్రస్తావించారు. ప్రజా అవసరాలకు సంబంధించిన 198 అంశాలను ఎంపిలు లేవనెత్తారు. 377 రూల్ ప్రకారం 226 అంశాలను ఎంపిలు సభలో ప్రస్తావించారు. 53 స్టాండింగ్ కమిటీ రిపోర్టులను ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టారు. వివిధ అంశాలపై మంత్రుల మిగతా 9లో



## చాక్లెట్ బ్రౌన్ కలర్‌లో కొత్త రూ.10 నోటు

రిజర్వు బ్యాంకు త్వరలో కొత్త రూ.10 నోటును విడుదల చేయనుంది. మహాత్మా గాంధీ సిరీస్‌లోనే ఈ నోటు కూడా విడుదల కానుంది.

## కనీస నిల్వ తగ్గించనున్న ఎస్‌బిఐ

**న్యూఢిల్లీ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) సేవింగ్ ఖాతాల్లో కనీస నగదు నిల్వలపై పునరాలోచనలో పడిందని తెలుస్తోంది. ప్రస్తుతం మెట్రో నగరాల్లో ఈ నెలవారీ కనీస నగదు నిల్వ రూ.3000గా ఉంది. దీన్ని రూ.1000కి తగ్గించాలని భావిస్తోన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఎస్‌బిఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. తొలుత మెట్రో నగరాల్లో రూ.5000 కనీస నిల్వలు ఉండాలని నిర్ణయించినప్పటికీ, దీనిపై ఖాతాదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రూ.3000కు కుదించింది. చిన్న పట్టణ ప్రాంతాల్లో రూ.2000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 చొప్పున నెలవారీ నగదు నిల్వలు ఉండాలని నిర్ణయించింది. ఈ నిల్వ స్థాయిలకు తగ్గితే జరిమాన విధించనున్నట్లు హెచ్చరించింది. ఆ విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది మాసాల్లో రూ.1,771.67 కోట్ల జరిమాన వసూలు చేసింది. ఎస్‌బిఐలో మొత్తం 40.5 కోట్ల పొదుపు ఖాతాలున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ఎస్‌బిఐ రూ.1,581 కోట్ల లాభాలు సాధించింది. వీటితో పోల్చితే జరిమాన విధించే మొత్తమే ఎక్కువగా ఉండటం గమనార్హం. పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు విధించే పెనాల్టీ కంటే ఎస్‌బిఐ విధిస్తున్న పరిమితులే ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా మిగతా 9లో

## ట్రాన్స్‌ట్రాయ్ వాహనాల సీజ్‌కు యత్నం

### ఆర్‌డిఒ సూచనతో వెనుదిరిగిన దేనాబ్యాంకు అధికారులు

**ప్రజాశక్తి-పోలవరం**

పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ దేనా బ్యాంకు నుంచి తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో ఆ సంస్థ వాహనాలను సీజ్ చేసేందుకు శుక్రవారం దేనా బ్యాంకు అధికారులు ప్రయత్నం చేశారు. తొలుత డయాఫ్రమ్ వాల్ ప్రాంతంలో రెండు భారీ ఎక్సవేటర్ యంత్రాలను సీజ్ చేశారు. అనంతరం ప్రాజెక్టు దిగువన మరో యంత్రాన్ని సీజ్ చేస్తుండగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ మోహన్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ శ్రీహరిరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సుధాకర్ అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీనిపై దేనా బ్యాంక్ డిప్యూటీ జోనల్ మేనేజర్ ప్రకాశరావు మాట్లాడుతూ ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీకి రూ.87 కోట్లు రుణం ఇచ్చామని, వడ్డీతో కలుపుకుని అది రూ.120 కోట్లకు మిగతా 9లో

## బిల్లులకు బ్రేక్..!

- రూ. వెయ్యి కోట్లు పెండింగ్
- మూడు నెలలుగా చెల్లింపుల జాప్యం
- నిధుల్లేని దుస్థితే కారణం



**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

నిధుల లేమి సెగ... బిల్లులకూ సోకింది. పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో పడుతున్నాయి. గత మూడు నెలలుగా ఈ దుస్థితి మరింతగా పెరుగుతోంది. ఇంతవరకు దాదాపు రూ. వెయ్యి కోట్ల విలువైన బిల్లుల చెల్లింపు నిలిచిపోయిందని అంచనా. ఇందులో గడచిన నవంబర్‌కు సంబంధించిన బిల్లులు తక్కువగా ఉండగా, అక్టోబర్, డిసెంబర్ నెలల బిల్లులు ఎక్కువగా ఉన్నాయి. నిధులు ఆశించిన స్థాయిలో లేకపోవడమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. కొన్ని బిల్లులు అక్టోబర్ నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయి. వీటికి అదనంగా ప్రాజెక్టుల బిల్లులూ పెద్ద మొత్తంలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచీ ఖజానా ఒడిదొడుకులకు లోనవుతూనే ఉంది. జీతాల చెల్లింపులకు తప్ప మిగతా వాటికి నిధులు సమకూర్చలేని పరిస్థితి తలెత్తింది. దీని ప్రభావం వివిధ కీలక శాఖల్లోని బిల్లులపైనా పడుతోంది. అక్టోబర్‌కు సంబంధించి రూ. 553 కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో విద్యుత్ శాఖకు చెందినవే రూ. 55 కోట్లకు ఉన్నాయి. పాఠశాల విద్యకు మరో రూ. 3 కోట్లు చెల్లించాల్సిన బిల్లులున్నాయి. నవంబర్‌లో పెండింగ్ కొంత తగ్గు ముఖం పట్టి రూ. 54 కోట్లకే పరిమితమైంది. ఇందులో టెక్స్‌టైల్స్ శాఖలోనే రూ. 32 కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డిసెంబర్‌కు వచ్చేసరికి పెండింగ్ బిల్లుల భారం గణనీయంగా పెరిగిపోయింది. ఆ నెలాఖరుకు రూ. 380 కోట్లకు పెండింగ్ బిల్లులున్నట్లు గుర్తించారు. ఇందులో విద్యుత్ శాఖకు చెందిన బిల్లులే మళ్లీ రూ. 275 కోట్లుగా కనిపిస్తున్నాయి. మిగిలిన బిల్లుల్లో విద్య, టెక్స్‌టైల్స్, మహిళా శిశు సంక్షేమం, సమాచార శాఖలకు చెందినవి పెద్ద మొత్తాల్లో ఉన్నాయి. మూడు నెలలుగా పెరిగిపోయిన బిల్లులను వచ్చే నెలల్లో చెల్లించాలంటే కొత్త బిల్లులకు ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరాంతానికి ఆదాయ వ్యయాల మధ్య భారీ తేడాగా ఈపరిస్థితి మారే ప్రమాదం ఉంటుందంటున్నారు. బిల్లులు చెల్లించకపోయినా, ఖర్చులో చూపించడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం, సమస్యలు ఇటు అధికారులను అటు గుత్తేదార్లను కూడా వేధిస్తున్నాయి. వెయ్యి కోట్ల రూపాయల విలువైన బిల్లుల పెండింగ్ కేవలం అధికారిక అంశాలకు సంబంధించినవే కాగా, నీటిపారుదల, రోడ్లు తదితర రంగాల బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలిసింది. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు బిల్లులు సహా వివిధ రోడ్ల నిర్మాణాలకు కూడా ఇంకా బిల్లులు చెల్లించాల్సి ఉందని గుర్తు చేస్తున్నారు. ఇవికాక వివిధ ఉత్సవాలకు చేసిన ఖర్చులకూ ఇంకా బిల్లులు చెల్లించలేదని, ఈ బిల్లుల భారమూ ఎక్కువగానే ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

## డిజిటల్ ప్రకటనల హోరు

- రూ.7500 కోట్ల విలువ
- 2015తో పోల్చితే 40 శాతం వృద్ధి

6

# పిల్లలను కనండి



విశాఖ జిల్లా ధర్మసాగరం సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- 2019 నాటికి నూరు శాతం అక్షరాస్యత
- త్వరలో సిలబస్ మార్పు
- బొబ్బిలి, ధర్మసాగరం జన్మభూమి సభల్లో చంద్రబాబు

**ప్రజాశక్తి- విజయనగరం/ విశాఖపట్నం ప్రతినిధులు**

'రాష్ట్రంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో ఫ్యామిలీ ప్లానింగ్‌ను పక్కనబెట్టి పిల్లల్ని కనాలి. రాష్ట్రంలో ఫ్యామిలీ ప్లానింగ్‌ను ఒక్కప్పుడు నేనే ప్రమోట్ చేశాను. ఇతర దేశాలతో పోల్చుకుంటే ప్రస్తుతం మన దేశంలో చిన్నపిల్లల సంఖ్య తగ్గింది. దీనివల్ల భవిష్యత్తులో మానవ వనరుల అభివృద్ధికి ఆటకం ఏర్పడే అవకాశం ఉంది. ఈ దృష్ట్యా ఫ్యామిలీ ప్లానింగ్‌ను పక్కనబెట్టి పిల్లలను ఎక్కువగా కనండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలి, విశాఖ జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని ధర్మసాగరం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జరిగిన జన్మభూమి సభల్లో ఆయన మిగతా 9లో

## దళితులపై టిడిపి కార్యకర్తల దాడి

**ప్రజాశక్తి- డెంకాడ, బొబ్బిలి (విజయనగరం జిల్లా)**

విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసలో జన్మభూమి సభకు వెళ్లొందంటూ దళితులపై టిడిపి కార్యకర్తలు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన వారిని చూసేందుకు వెళ్తున్న దళితుల కుటుంబ సభ్యులపైనా దాడికి పాల్పడ్డారు. ఈ రెండు దాడుల్లో మొత్తం పది మంది దళితులు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మోదవలస పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే జన్మభూమి సభలో ఇచ్చేందుకు కొంతమంది దళితులు ఒక దగ్గర కూర్చొని వినతులు రాసుకుంటున్నారు. అదే సమయంలో మిగతా 9లో



## హెచ్చరికలు బేఖాతరు

- కోడి పందేలకు ఏర్పాట్లు
- బరికి రూ.1.50 కోట్లు
- అడ్డుకుంటామంటున్న అధికారులు

2



## గజల్ శ్రీనివాస్ బెయిల్‌కు నిరాకరణ

## తాంత్రిక పూజలపై విచారణ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/విజయవాడ సిటీ ప్రతినిధి**

కనకదుర్గ ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయా లేదా అనే అంశంపై ప్రభుత్వం నియమించిన నిజనిర్ధారణ కమిటీ శుక్రవారం వన్‌టౌన్ జమ్మిదొడ్డిలో విచారణ చేపట్టింది. ఉదయం నుండి సాయంత్రం వరకు పలు విభాగాలకు చెందిన 40 మంది ఉద్యోగులను విచారించినట్లు విచారణాధికారి రఘునాథ్ తెలిపారు. ఆయన సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ విచారణలోని వివరాలను కమిషనర్‌కు అందజేస్తామన్నారు. అంతరాలయాన్ని పరిశీలించాలని, ఛైర్మన్, పాలకమండలి సభ్యుల వివరణ తీసుకుని నివేదిక సమర్పిస్తామని తెలిపారు. సిసి టివి ఫుటేజీలో గుమ్మడి కాయలు ఏమీ లేవన్నారు. ఫుటేజీలో కొబ్బరికాయలున్నామని, అవి కూడా ఆలయం మూసివేసిన తరువాత కొడతారని విచారణలో తేలిందన్నాని అన్నారు. ఇప్పటి వరకు రెండు గంటలు సిసి టివి ఫుటేజీలు చూశామని, మరో రెండు గంటల నిడివిని చూడాల్సి ఉందని తెలిపారు. ఆలయాన్ని ఎప్పుడైనే శుద్ధి చేసుకోవచ్చని ఆగమ మిగతా 9లో

### శ్రీకాళహస్తిలోనూ ..

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

విజయవాడ దుర్గగుడిలో తాంత్రిక పూజలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన నేపథ్యంలో శ్రీకాళహస్తిలోనూ ఇటువంటి సంఘటనలే వెలుగులోకి వచ్చాయి. కాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా ఉన్న భైరవను ఆలయంలో ఇటీవలే ఈ పూజలు జరిగాయి. భైరవ ఆలయంలో తాంత్రిక పూజలు జరిగిన విషయం ఆలయం ఈఓ ధృవీకరించారు. ఈ విషయం వెలుగులోకి రాగానే వాటిని సాత్విక పూజలుగా కొందరు అధికారులు బుకాయించే ప్రయత్నం చేశారు. అయితే కీలక సాక్ష్యాధారాలు లభించడంతో భైరవ ఆలయంలో తాంత్రిక పూజలు స్పష్టమైంది. శ్రీకాళహస్తీశ్వరాలయ సూపరింటెండెంట్ ధనపాల్ ఈ తాంత్రిక పూజలకు సారథ్యం మిగతా 9లో

## గజల్ శ్రీనివాస్ బెయిల్‌కు నిరాకరణ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**
లైంగిక వేధింపుల కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న గాయకుడు గజల్ శ్రీనివాస్ బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరుపు లాయర్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసింది. కేసు విచారణ సమయంలో బెయిల్ ఇస్తే ఏర్పడే దుష్పరిణామాల గురించి పోలీసుల తరుపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఏ2 నిందితురాలు పరారీలోనే ఉందన్నారు. ఆమె వాంగ్మూలమే కీలకమని చెప్పారు. గజల్ శ్రీనివాస్ బయటకు వస్తే ఆమెను ప్రభావితం చేస్తారని, బెయిల్ పిటిషన్ తిరస్కరించాలని వాదనలు వినిపించారు. గజల్ శ్రీనివాస్‌కు సాక్ష్యాలు తారుమారు చేసే శక్తి,యుక్తులు ఉన్నాయని పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌పై వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి పోలీసుల వాదనతో ఏకీభవించి గజల్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించారు. శ్రీనివాస్‌ను కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల పిటిషన్‌ను కూడా బుధవారం న్యాయస్థానం తిరస్కరించిన విషయం తెలిసిందే.



**విజేతలు** సెక్రటేరియట్ స్పోర్ట్స్- విజేతలతో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర

## సచివాలయ ఉద్యోగుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
వెలగపూడి తాత్కాలిక సచివాయంలో తొలిసారిగా నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ విజేతలకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ 3వ బ్లాక్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులను అభినందించారు. టూరిజం శాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనాతో కలిసి క్రికెట్, రన్నింగ్, షటిల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉప్పుటూరి మురళీకృష్ణ మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ఉద్యోగులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని అభినందించారు. ఉద్యోగుల సంఘం క్రీడల విభాగం సంయుక్త కార్యదర్శి ఎన్‌ఎస్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి నాలుగు రోజులు నాగార్జున యూనివర్సిటీతో పాటు విజయవాడలోని ఐజిఎం స్టేడియంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని సుమారు 700 మంది ఉద్యోగులు ఈ మీట్‌లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.



## 24 గంటల్లో అల్పపీడనం

**ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి**
ఆగ్నేయ బంగాళాఖాతానికి సమీపంలో దక్షిణ అండమాన్‌లో నెలకొన్న అల్పపీడన ద్రోణి 24 గంటల్లో అల్పపీడనంగా మారుతుందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరానికి ఆనుకుని మరో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపింది. వీటి ప్రభావంతో ఉత్తర, ఈశాన్య దిశ నుంచి రాష్ట్రంపైకి చలిగాలులు బలంగా వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేసింది. రాగల నాలుగు రోజులు కోస్తా, సీమలో పొడి వాతావరణమే కొనసాగుతుందని తెలిపింది.

## 7న బాల కృష్ణమ్మ వర్ధంతి సభ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
ఉపాధ్యాయ ఉద్యమ నేత మార్పు బాల కృష్ణమ్మ 5వ వర్ధంతి సభ జనవరి 7న అనంతపురంలో జరుగుతుందని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, కె వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలకృష్ణమ్మ 60ఏళ్లకు పైగా విద్యారంగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటం చేశారని తెలిపారు. అఖిల భారత విద్యాహక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కె చక్రధరరావు పాల్గొని నేటి విద్యారంగం-సమస్యలు అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

# హెచ్చరికలు బేఖాతరు

- కోడి పందేలకు ఏర్పాట్లు
- బరికి రూ.1.50 కోట్లు
- అడ్డుకుంటామంటున్న అధికారులు



పోటీలకు పుంజులను సన్నద్ధం చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

**ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి**
కోడి పందేలను ఆపకపోతే చర్యలు తప్పవని డిజిపి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను హైకోర్టు గట్టిగా హెచ్చరించినా, తూర్పుగోదావరి జిల్లా కోనసీమలో పందెం రాయుళ్లు పట్టించుకోవట్లేదు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్, ఎస్‌పిలు హెచ్చరికలు చేస్తున్నా పందేలకు చురుగ్గా ఏర్పాట్లు చేసుకుపోతున్నారు. ఇప్పటికే ముమ్మిడివరం నియోజకవర్గంలో రెండు బరుల ఏర్పాటుకు వేలం పూర్తయినట్లు సమాచారం. స్థానిక ప్రజాప్రతినిధి బంధువు సమక్షంలో ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో డిసెంబరు 31 రాత్రి కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహించినట్టు తెలిసింది.

**ఒక్కో బరికి రూ. కోటిన్నర**

ముమ్మిడివరం నియోజకవర్గం కేశనకుర్రుపాలెం, కొత్తలంకలో రెండు బరులు ఏర్పాటు చేసినట్టు సమాచారం. ముమ్మిడివరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తలంకలో బరిని ఇప్పటికే సిద్ధం చేశారు. గుర్తుతెలియని వారు ఆ ప్రాంతానికి రాకుండా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఒడిశాకు చెందిన వారి ఎస్టేట్‌లో ఏర్పాటుచేసిన ఈ బరి వద్ద పేకాట, గుండాట వంటి జూదాలు, బెల్ట్‌షాపులు నిర్వహించుకునేందుకు రూ.కోటిన్నర వేలం ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లోనూ పందేల నిర్వహణకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఐ.పోలవరం మండలం మురమళ్లలో ప్రజాప్రతినిధి ఇంటి ఎదురుగా ఇప్పటికే బరిని సిద్ధం చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని తిల్లకుప్ప, పల్లిపాలెం, కొత్తలంక, రాజుపాలెం, చెయ్యేరు, వేట్లపాలెంలో కోడి పందేలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాచుర్యం పొందిన మురమళ్లలో పందేలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ఇక్కడకు వస్తున్న నేపథ్యంలో భారీగా నిర్వహించాలని నిర్వాహకులు యోచిస్తున్నారు. ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పోలీసు హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి హడావుడి లేకుండానే నిర్వాహకులు ఏర్పాట్లు చేసేస్తున్నారు.


**ప్రారంభమైన పందేలు**

ముమ్మిడివరం నియోజకవర్గంలో చేపల చెరువుల సమీపంలోని రెండు బరుల వద్ద రెండు వారాలుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి వేళల్లో ఈ పందేలు జరుగుతున్నాయి. ఇతర జిల్లాల నుంచి సైతం జూదరులు వాహనాల్లో ఈ పందేలకు హాజరవుతున్నట్టు సమాచారం. ఈ బరిలో పందెం జరిగే 20 శాతం యజమానికి కేటాయిస్తున్నారు. ఆ కమీషన్‌లో కొంతమొత్తం పోలీసులు, ఇతర అధికారులకు ముడుపులు ఇస్తుండటంతో పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## జన్మభూమిలో ప్రధాని ఫోటో అవసరం లేదు : పరకాల

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
జన్మభూమి రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమైనందున ప్రధాని ఫోటో ఉంచాల్సిన అవసరం లేదని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ తెలిపారు. విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని ఫోటో గురించి బిజెపి నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వివరణ ఇచ్చారు. వ్యాఖ్యానించారు. జన్మభూమి కార్యక్రమంలో మూడో రోజు వినతులు, ప్రజల హాజరు తగ్గినట్లు చెప్పారు. ఇందుకు కారణం పట్టణ, నగర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాలకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తారని, గ్రామాల్లో జరిగితే ప్రజల హాజరు తక్కువగా ఉంటుందని తెలిపారు. 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 1,55,009 వినతులు స్వీకరించామని, 7,54,412 మంది ప్రజలు హాజరైనట్లు చెప్పారు. రేషన్ కార్డులు 25,262, పింఛన్లు 13,262, ఇళ్ల స్థలాలు 4,769, టూల్ కిట్స్ 24,842 పంపిణీ చేసినట్లు చెప్పారు. 2,527 వైద్య శిబిరాలు నిర్వహించగా 1,55,026 మంది పరీక్షల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని, 7,108 మందికి కళ్ళజోళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. 5వ తేదీ సాయంత్రం వరకూ అందిన సమాచారం ప్రకారం 64,855 వినతులు స్వీకరించామని, 3,65,868 మంది పాల్గొన్నారని తెలిపారు. 11,049 రేషన్ కార్డులు, 8,894 పింఛన్లు, 3,170 ఇళ్ల స్థలాలు, 2,677 టూల్ కిట్స్ పంపిణీ చేసినట్లు చెప్పారు.

## తాంత్రిక పూజలపై హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలి : రఘువీరా



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
దుర్గ గుడిలో తాంత్రిక పూజలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరా రెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో యువజన కాంగ్రెస్ సభ్యత నమోదు ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమ్మవారి ఆలయంలో తాంత్రిక పూజలు చేశారని వస్తున్న ఆరోపణలపై అధికారులు, మంత్రులు పొంతనలేని సమాధానలు చెప్తున్నారన్నారు. ప్రభుత్వ విచారణలపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. తాంత్రిక పూజలు ఎవరికోసం నిర్వహించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. దోషులెవరైనా కఠినంగా శిక్షించాలన్నారు. గత నాలుగు విడతలుగా నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజలిచ్చిన అర్జీలకు దిక్కులేదన్నారు. ఐదో విడత జన్మభూమి పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. జన్మభూమి, టిడిపి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉపయోగించడం సబబుకాదన్నారు. పులివెందుల జన్మభూమిలో స్థానిక ఎంపి అవినాష్ రెడ్డికి మాట్లాడే అవకాశం ఇవ్వక పోవడం దారుణమన్నారు. పోలీసుల పహారాలో కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటన్నారు.

## ఎలక్ట్రానిక్స్ కేంద్రంగా సీమ

**12న 12 కంపెనీలు ప్రారంభం : మంత్రి లోకేశ్**



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
ఎలక్ట్రానిక్ కంపెనీల కేంద్రంగా రాయలసీమను, ఐటి కంపెనీల నిలయంగా అమరావతిని తీర్చిదిద్దనున్నట్లు ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయ్ సంస్థ నిర్వహించిన ప్రాపర్టీ షోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో కట్టిన ఇళ్లు నిండాలంటే రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, వారికి ఉద్యోగాలు ఇవ్వాలంటే ఐటి కంపెనీలకు స్పేస్ ఇవ్వాలని అన్నారు. పాలన పారదర్శకంగా చేయడంతో పాటు వికేంద్రీకరణ జరగాలని సిఎం కోరుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్రను ఫార్మా మెడికల్ డివైసెస్‌కు కేంద్రంగా చేయబోతున్నామన్నారు. ఈనెల 12న రాయలసీమలో 12 ఐటి కంపెనీలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే శ్రీసిటీలో మొబైల్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో మొబైల్ తయారీ యూనిట్లు ఒక్కటి కూడా లేవని, ఈ మూడున్నర ఏళ్ళల్లో 2 మొబైల్ యూనిట్లు నెలకొల్పామని తెలిపారు. చిన్న సంస్థలు వచ్చేందుకు వీలుగా ఐటి స్పేస్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ఐటీ కంపెనీల ఏర్పాటుకు 60 లక్షల చదరపు అడుగుల స్పేస్ అవసరమన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రెంటల్ గ్యారంటీ విధానం (డిటిపి) తీసుకువచ్చామని, దీనివల్ల ఐటి సంస్థలు ఏర్పాటు చేసేవారికి అద్దెలో కొంత భాగం లేక మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించే అవకాశం ఏర్పడిందన్నారు. జిఎస్టీ, రెరా చట్టం ఇబ్బందులపై దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, క్రిడా కమీషనర్ చెరుకూరి శ్రీధర్, క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.శివారెడ్డి, విజయవాడ చాప్టర్ అధ్యక్షులు వై.వి.రమణరావు, నగర మేయర్ కోనేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నక్కల దిన్నె గ్రామాన్ని సందర్శించండి

**సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
కర్నూలు జిల్లాలో దళితుల్ని సాంఘికంగా వెలివేసిన నక్కలదిన్నె గ్రామాన్ని జన్మభూమి సందర్భంగా సందర్శించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. గ్రామంలోని దళితులపట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతోందని, దళితులెవ్వరినీ వ్యవసాయ కూలిపనులకు గ్రామంలోని రైతులు పిలవడం లేదని తెలిపారు. అగ్ర కులాలకు వెట్టి పనులు చేయడానికి దళితులు నిరాకరించడంతో వారికి కరెంటు, మంచినీటి సౌకర్యం లేకుండా చేశారని పేర్కొన్నారు. గ్రామంలోని అంగళ్ళలో సరుకులు అమ్మడం లేదని, రెవిన్యూ, పోలీసు అధికారులు గ్రామంలో పర్యటించిన తరువాత కరెంట్, మంచినీటి సౌకర్యం పునరుద్ధరించారన్నారు. ఇప్పటికీ దళితులను బెదిరిస్తూనే ఉన్నారని తెలిపారు. ఇంత జరిగినా నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి అఖిలప్రియ గ్రామాన్ని సందర్శించి దళితులకు భరోసా ఇవ్వలేదన్నారు. నక్కలదిన్నె గ్రామాన్ని సందర్శించి దళితులకు భరోసా ఇచ్చి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## 11 కల్లా వినతులన్నీ పరిష్కరించాలి

**పరిష్కారంపై 49 శాతమే సంతృప్తి : చంద్రబాబు**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**
ప్రజల నుంచి స్వీకరించిన వినతులన్నింటి పరిష్కారంపై దృష్టి సారించాలి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ ఏడాది జనవరి వరకూ 7,78,422 వినతులు అందాయని చెప్పారు. ఈ విడత జన్మభూమిలో 4వ తేదీ వరకూ మరో 3,77,863 వినతులు వచ్చాయన్నారు. జన్మభూమిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం ఉదయం సిఎం విశాఖ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 11వ తేదీ నాటికి అన్ని వినతులను రియల్‌టైమ్‌లో పరిష్కరించాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నారా అన్న ప్రశ్నకు 49 శాతం అవునని, 51 శాతం లేదని సర్వేలో ప్రజలు సమాధానం ఇచ్చారని దీన్ని బట్టి వినతుల పరిష్కారం మరింత వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాబోయే 15 ఏళ్లపాటు 15 శాతం వృద్ధిరేటు కొనసాగించాలన్నారు. ప్రతి శాఖ పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. జన్మభూమిపై సర్వేలో భాగంగా మూడవ రోజు జన్మభూమిలో అధికారులు పాల్గొన్నారా అన్న ప్రశ్నకు 93 శాతం అవునని, 7 శాతం లేదని, సమస్యలపై అధికారులు స్పందన బాగుందా అనే ప్రశ్నకు 75 శాతం అవునని, 25 శాతం లేదని ప్రజలు సమాధానం ఇచ్చినట్లు చెప్పారు. జన్మభూమి ఉపయోగకరంగా ఉందా అన్న ప్రశ్నకు 87 శాతం అవునని, 13 శాతం లేదని, పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అన్న ప్రశ్నకు 68 శాతం అవునని, 32 శాతం లేదని, రేషన్ కార్డులు వచ్చాయా అన్న ప్రశ్నకు 66 శాతం అవునని, 34 శాతం లేదని సమాధానాలు వచ్చినట్లు చెప్పారు. 4వ తేదీన జన్మభూమిలో విశాఖ అర్బన్, చెరుకుపల్లి, విస్సన్నపేట, పెద్దాపురం, కడియం, యలమంచిలి, మొవ్వ, పెందుర్తి మండలాలు, కాకుమాను, పాలకొల్లు, పొన్నూరు, మేడికొండూరు, రాజాం, ఉంగుటూరు, పెడన, కసింకోట, పామిడి గ్రామాలు టాప్ టెన్ జాబితాలో చోటు సంపాదించాయన్నారు.

ప్రత్యేకం

# ఎల్లో 'బ్లూబుక్'

- అభ్యర్థుల ఎంపికకు గైడ్
- తయారీ పనిలో కోర్ కమిటీ
- చంద్రబాబు రహస్య మంత్రాంగం
- వచ్చే ఎన్నికల్లో టిడిపి టిక్కెట్లకు అదే ప్రామాణికం



**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి**
వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థుల ఎంపికకు అధికార తెలుగుదేశం పార్టీ 'బ్లూబుక్'ను రూపొందించే పనిలో పడింది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పర్యవేక్షిస్తున్న కోర్ కమిటీకి బ్లూబుక్ తయారీ బాధ్యతను అప్పగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని కొన్ని శాఖలు పలు సందర్భాల్లో తప్పనిసరిగా ఏ పనులు చేయాలి వేటిని చేయకూడదు (డూస్, డూనాట్స్) అని స్పష్టమైన విధి విధానాలు నిర్ణయిస్తాయి. అలాంటి నిబంధనలతో రూపొందించే పుస్తకాన్నే 'బ్లూబుక్' అంటారు. ఆయా పనులను సమర్ధవంతంగా పూర్తి చేసేందుకు, విజయవంతం చేసేందుకు ఆ పుస్తకం మార్గదర్శకత్వం వహిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే గైడ్‌గా ఉపయోగపడుతుంది. ప్రకృతి విపత్తులు, ఎన్నికల నిర్వహణ వంటి అత్యవసర పనుల కోసం బ్లూబుక్స్ తయారవుతాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఇత్యాది వివిఐపిల పర్యటనల సమయాల్లో భద్రతా వ్యవస్థ 'బ్లూబుక్' తీసుకొస్తుంది. నిమిష నిమిషానికి (మినిట్ టు మినిట్ ప్రోగ్రాం) ఏం చేయాలో ఆ బుక్‌లో ముందుగానే టైం టేబుల్ ఖరారు చేస్తారు. ఈ తరహాలోనే అభ్యర్థుల ఎంపికకు చంద్రబాబు అత్యంత రహస్యంగా తన ఆంతరంగికుల సలహాలు తీసుకొని పకడ్బందీగా బ్లూబుక్‌కు సాన పెడుతున్నట్లు సమాచారం.

**నంద్యాల 'రోల్ మోడల్'**

ఇటీవల జరిగిన నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలను అందులో 'రోల్ మోడల్'గా తీసుకున్నారు. బ్రహ్మానందరెడ్డి సరైన అభ్యర్థి కాదని తేల్చారు. ప్రభుత్వం, పార్టీ యావత్తూ అక్కడ మోహరించి పని చేస్తేనే నంద్యాలలో అతికష్టం మీద విజయం సాధ్యమైందని నిర్ధారించారు. మొత్తం వ్యవహారాన్ని అభ్యర్థికి విడిచి పెట్టినట్లయితే ప్రతికూల ఫలితం వచ్చేదని, పార్టీ ఓటమి చెందేదని తీర్మానించారు. అందుకే నంద్యాల ఎన్నికల తర్వాత అభ్యర్థుల ఎంపికకు చంద్రబాబు 'బ్లూబుక్' రూపకల్పనకు దిగారని తెలిసింది.

**డబ్బుంటేనే టిక్కెట్**

ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టుకోగలినవారికే టిక్కెట్ ఇవ్వాలనిప్రధానంగా నిర్ణయించారు. పార్టీలో ఎంత పెద్ద నాయకులైనా సరే వారి సిఫారసు ఆధారంగా ఎవ్వరికీ టిక్కెట్లు ఇవ్వకూడదన్న కఠిన నియమాన్ని పెట్టుకున్నారు. అభ్యర్థి ముఖాముఖి ఇంటర్వ్యూ తప్పనిసరి. కేవలం అందం ఆకారాలకే అభ్యర్థిత్వాన్ని ఓకే చేయకూడదు. సమర్ధవంతంగా ఎన్నికలను ఎదుర్కొంటారా లేక డమ్మీగా ఉంటారా అనే విషయాన్ని పరిశీలిస్తారు. వ్యక్తిగతంగా ప్రత్యర్థులను ఢీ కోనే సామర్థ్యం ఉందా లేదా అని చూస్తారు.

నియోజకవర్గంలో పార్టీ యంత్రాంగాన్ని కమాండ్ చేసే సామర్థ్యంపైనా అంచనా వేస్తారు. మాట తీరు బాగుందా లేదా అని పరీక్షలు పెడతారు. చివరికి నడత నడకపైనా తాము అనుకున్న రీతిలో ఉన్నారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. అభ్యర్థి నడిచి వస్తుంటే హుందాగా ఉంటుందా, ప్రజలను ఆకర్షించగలుగుతారా అని కూడా చూస్తారు. బ్లూబుక్‌లో ఇలాంటి ఎన్నో నిబంధనలు చేర్చినట్లు టిడిపి వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పలు సర్వే సంస్థలు, ప్రభుత్వ నిఘా వర్గాలు, రాజకీయ మేధావులు, పేరు మోసిన వ్యక్తిత్వ వికాస నిపుణులు, సినీరంగ ప్రముఖులు, కొన్ని మీడియా సంస్థలు అందించిన నివేదికలు, సలహాలను రంగరించి బ్లూబుక్‌ను సిద్ధం చేస్తున్నారు.

## ఏప్రిల్ 8న ఆదర్శ పాఠశాలల ఎంట్రన్స్ పరీక్ష

**అమరావతి బ్యూరో :** ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలయింది. ఆరోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 8న జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నోటిఫికేషన్‌లో తెలిపారు. ఫిబ్రవరి 16లోపు పరీక్ష ఫీజును చెల్లించాలని వెల్లడించారు. ఈ నెల 10 నుంచి దరఖాస్తును ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

## బస్సు బోల్తా.. ఇద్దరు మృతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రొయ్యల పరిశ్రమకు చెందిన మినీబస్సు బోల్తాపడి ఆ పరిశ్రమలో పనిచేస్తున్న ఇద్దరు ఒడిశా యువతులు మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో 15 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక యనమదుర్రు రోడ్డులోని అశ్విని రొయ్యల పరిశ్రమలో ఒడిశా, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతులు పని చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకుని హాస్టళ్లకు కంపెనీకి చెందిన మినీబస్సులో బయల్దేరారు. బస్సు కెజిఆర్ఎల్ కళాశాల వద్దకు వచ్చేసరికి అతివేగం కారణంగా అదుపుతప్పి పక్కనే ఉన్న బోదెలో బోల్తాపడింది. రోడ్డుపై వెళ్లే వారు బస్సులోని వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే ఒడిశాలోని బరంపురం జిల్లాకు చెందిన లైలా (23), సుందరి (18) మృతి చెందారు. మరో 15 మందికి గాయాలయ్యాయి. వీరిలో బరినామయక్, సీమనాయక్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మిగిలినవారు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను సిఐటియు నాయకులు బివి వర్మ తదితరులు, డిఎస్‌పి టి.ప్రభాకర్‌బాబు, సిఐ దేశింశెట్టి వెంకటేశ్వరరావు పరామర్శించారు.



సిఎస్ఐ జాతీయ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న స్టీల్ సిఎమ్‌డి మధుసూదనరావు

## దేశ ఆర్థిక వ్యవస్థలో ఐటి కీలక పాత్ర

### సిఎస్ఐ జాతీయ కాన్ఫరెన్స్‌లో స్టీల్ సిఎమ్‌డి మధుసూదనరావు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

దేశ ఆర్థిక వ్యవస్థలో ఐటి పాత్ర అత్యంత కీలకంగా ఉందని, ఏటా దేశీయ జిడిపికి 8 శాతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నుంచే వెళ్తుందని ఆర్ఐఎన్ఎల్ సిఎండి పి.మధుసూదనరావు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నగరంలోని గేట్ వే హోటల్‌లో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ)-ఆర్ఐఎన్ఎల్ సంయుక్త నిర్వహణలో ఇంపాక్ట్ -2018 రెండు రోజుల జాతీయ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ స్మార్ట్‌సిటీగా, ఐటి హబ్‌గా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), మెషిన్ లెర్నింగ్, రోబో టెక్నాలజీ వంటి నూతన ప్రపంచ సాంకేతికతను అర్థం చేసుకుని అమలు చేయగలిగితే సవాళ్లను అధిగమించగల్గుతామన్నారు. ఈ రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్సులో పాల్గొనేందుకు దేశంలోని వివిధ రంగాల్లో ప్రతిభావంతులు వచ్చారని, గత 30ఏళ్లుగా ప్రపంచానికే వెన్నెముకగా ఉంటూ వస్తోన్న టెక్నాలజీపై వారి ప్రజెంటేషన్ విశాఖ ఇండస్ట్రీకి లాభదాయకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐటి డైరెక్టర్ (డిపార్టుమెంట్ ఆఫ్ ఐటి) డాక్టర్ బికె.మూర్తి, సిఎస్ఐ వైజాగ్ చాప్టర్ చైర్మన్ రాయ్‌చౌదరి, ఐఒటికి చెందిన మేనేజింగ్ వైస్ ప్రెసిడెంట్ రామ్మూర్తి తదితరులు వేదికపై ఆశీనులు కాగా, దేశం నలుమూలల నుంచీ హాజరైన ప్రతినిధులు సభలో పాల్గొన్నారు.

# ఆరు నెలల్లో వెలుగొండ పూర్తి ఎలా?

- 22 ఏళ్ల క్రితం చంద్రబాబు శంకుస్థాపన
- 9 ఏళ్ల హయాంలో పనులు మొదలు కాని వైనం
- పదేళ్లలో 14.93 కి.మీ. సొరంగం పనులు
- ఇంకా ఆరు నెలల్లో తవ్వాల్సింది 3.88 కి.మీ.
- ఎన్నికల కోసం ఆఖరులో చంద్రబాబు హడావుడి

ప్రజాశక్తి - ఒంగోలు ప్రతినిధి

ఇది తాజా హామీ ఏమీ కాదు. ఇటువంటి హామీలు మూడున్నరేళ్లుగా ఇస్తూనే ఉన్నారు. 22 ఏళ్ల క్రితం వెలుగొండకు ఆయనే శంకుస్థాపన చేసినా ఇంతవరకు తొలి దశ కూడా పూర్తి కాలేదు. ఆయన అధికారంలో ఉన్న 9 ఏళ్లలోనూ దీనిపై పూర్తి నిర్లక్ష్యం వహించారు. ఇప్పుడూ అదే పద్ధతిలో హామీలతో కాలం వెలిబుచ్చుతుండటంతో రైతుల్లోనూ నమ్మకం సడలుతోంది. పదేళ్లలో మొదటి సొరంగం పనులు 14.93 కిలోమీటర్లు మాత్రమే జరిగింది. సిఎం తాజాగా ఇచ్చిన హామీ ప్రకారం ఆరు నెలల్లో 3.88 కిలోమీటర్లు పూర్తి కావడం నమ్మశక్యం కానిదే. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో అధికారంలోకి వచ్చాకే వెలుగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. టిడిపి అధికారంలోకొచ్చాక ఈ మూడున్నరేళ్లపాటు పనులు ముందుకు సాగలేదు. సిఎం దీన్ని పూర్తి చేస్తామని చెప్పి మూడుసార్లు వాయిదా వేశారు. ఈ ఆఖరు గడువులోగా పూర్తి చేయకపోతే రైతులు పూర్తిగా నమ్మలేని పరిస్థితి.

**గడువు మీద గడువు.. అమలే శూన్యం**

వెలుగొండ ప్రాజెక్టును చంద్రబాబు రెండుసార్లు పరిశీలించారు. 2104లో ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. తర్వాత పనులు ముందుకు సాగలేదు.

రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. 2105లో మళ్లీ రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఆ సమయంలో ఆయన్ను జిల్లా ప్రజా ప్రతినిధులు కలిశారు. పనులపై ఆందోళన వ్యక్తం చేశారు. పనుల్లో పురోగతి లేదు. 2016లో ఆయన మళ్లీ ప్రాజెక్టును సందర్శించారు. అపుడు 2018 సెప్టెంబరు నాటికి మొదటి దశ పూర్తి చేస్తామని ఘంటాపథంగా చెప్పారు. ఇపుడు దర్శి జన్మభూమి పర్యటనలో జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఆరు నెలల్లో దీన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఇదే చంద్రబాబుకు పెద్ద టాస్క్‌గా ఉంది.



> ఆరు నెలల్లో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండ్రోజుల క్రితం ప్రకాశం జిల్లాకొచ్చిన సందర్భంగా మళ్లీ హామీ ఇచ్చారు.
>
> - సిఎం చంద్రబాబు చెప్పిన మాటలివీ.

### కాంట్రాక్టర్లను మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం

మిగిలిన సొరంగాల పనులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తవ్వకం చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్లను మార్చేస్తోంది. ఇప్పటివరకూ సొరంగం ఎక్కడ వరకు పనిచేశారో అదే ప్రాంతంలో పై భాగాన రంధ్రం వేసి అక్కడ నుంచి దిగువకు బావిలాగా తవ్వుతారు. రెండు సొరంగాల మధ్యలో రంధ్రం వేస్తారు. అక్కడ నుంచి చిన్నచిన్న యంత్రాలను వినియోగించి తవ్వకాన్ని పూర్తి చేయాలనే యోచనలో ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు తయారు చేసింది. ఇందుకోసం మొదటి సొరంగానికి రూ.180 కోట్లు, రెండో సొరంగానికి రూ.575 కోట్లు వెరసి రూ.755 కోట్లు అదనంగా వ్యయం అంచనా వేసింది. పాత కాంట్రాక్టర్ల నుంచి పనులు తప్పించి టెంటర్ల ద్వారా వేరే కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారు. రెండు రోజుల్లో పనులు అప్పగిస్తామని సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. కొత్త క్రాంటాక్టర్లు వచ్చి పనులు మొదలు పెట్టేదెపుడు? ఆరు నెలల్లో పనులు పూర్తిచేసేది సాధ్యమేనా? అనే ప్రశ్నలు ముందుకు వచ్చాయి. లోపల యంత్రాలున్నాయి. ఆఖరులో ఎన్నికల కోసం హడావిడి తప్ప ఏమీలేదు.

### ఇప్పటికే భారీగా ఖర్చు

ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీగా వ్యయం చేశారు. 1996లో ప్రాజెక్టు వ్యయం రూ.900 కోట్లు అంచనా వేయగా తర్వాత రూ.1800 కోట్లకు పెరిగింది. ఏడాది క్రితం వరకూ రూ.5,150 కోట్లు తేల్చారు. ఇప్పటివరకూ రూ.4,440 కోట్లు వెచ్చించారు. ప్రస్తుతం సొరంగాల తవ్వకాలను వేరే మార్గాల్లో చేపట్టటానికి అదనంగా రూ.755 కోట్లతో అంచనాలు వేశారు. ఇది అదనపు వ్యయమే. అంటే పూర్తయ్యేలోపు రూ.6వేల కోట్లకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

### పదేళ్లలో 14.93 కి.మీ తవ్వకం.. ఆరునెలల్లో 3.88 కి.మీ తవ్వకం సాధ్యమా?

కృష్ణానది నుంచి నీటిని వెలుగొండకు నింపే రెండు సొరంగాలే ఈ ప్రాజెక్టులో కీలకం. నల్లమల అడవుల అంతర్భాగం గుండా 18.82 కిలోమీటర్ల పొడవున ఈ రెండు సొరంగాలు తవ్వకం జరగాలి. ఇటీవల దేశంలో నిర్మిస్తున్న ఏ ప్రాజెక్టుకూ ఇంత పొడవున సొరంగాలు లేవు. మూడు జిల్లాల రైతుల ప్రయోజనాల కోసం దీన్ని రూపకల్పన చేశారు. గడిచిన పదేళ్లలో మొదటి సొరంగం 14.93 కిలోమీటర్ల పొడవున తవ్వకం పనులు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో 12 కిలోమీటర్ల పొడవున తవ్వకాలు సాగాయి. ఈ మూడున్నరేళ్లలో 3 కిలోమీటర్లు తవ్వకం చేశారు. ఇంకా 3.88 కిలోమీటర్లు తవ్వకం చేయాల్సి ఉంది. అంటే రోజుకు 15 మీటర్లు తవ్వకం జరగాలి. ప్రస్తుతం పనులు ఆగిపోయాయి. 14.93 కిలోమీటర్ల వద్ద లోపల బలమైన రాళ్లు పడ్డాయి. యంత్రాలకు ఆటంకాలు వచ్చాయి. దీంతోపాటు కాంట్రాక్టర్లకు పెద్ద ఎత్తున బిల్లులు ఆగిపోయాయి. రూ.50 కోట్లకుపైనే బిల్లులు ఇవ్వనందున పనులు వేగంగా చేయడం లేదు.

## ఖాతాలకు చేరని పథకాల లబ్ధి

- ఎంపికైనా అందని సొమ్ము
- జీరో బ్యాలెన్స్ ఖాతాలతో ఇక్కట్లు
- బ్యాంకుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

జీరో బ్యాలెన్స్ అకౌంట్లతో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాలలో ఎంపికైనవారికి లబ్ధి చేకూరడం లేదు. నోట్ల రద్దు పుణ్యమా అంటూ ప్రభుత్వం విధించిన నిబంధనలు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రూ.50 వేలకు మించి ఒక్క రూపాయి ఎక్కువ లబ్ధి ఉంటే ఖాతాలకు చేరడంలేదు. తెలిసో తెలియకో వివిధ పథకాలకు జమ చేసిన అకౌంట్లు పనిచేయడం లేదు. లబ్ధిదారులు తమకు రావాల్సిన సొమ్ము ఖాతాలకు చేరలేదని ఆందోళన చెందుతూ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ప్రభుత్వం ఆర్థిక లబ్ధిని చేకూర్చే వివిధ పథకాలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా సబ్సిడీ రుణాలను పలు విభాగాల్లో ప్రవేశపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్లతో పాటు పలు శాఖలు సబ్సిడీతో కూడిన పథకాలను అమలు చేస్తున్నాయి. సబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా ధరఖాస్తు నమోదు నుంచి ఇంటర్వ్యూలను నిర్వహించి వివిధ దశల అనంతరం లబ్ధిదారులుగా ఎంపిక చేస్తుంది. బ్యాంకులో లబ్ధిదారునికున్న ఖాతా వివరాలను ఆయా శాఖాధికారులకు పంపుతారు. అంతవరకూ బాగానే ఉన్నా జీరో ఖాతాల వద్దే అసలు సమస్య మొదలవుతోంది.

**జీరో బ్యాలెన్స్ ఖాతాలతో ఇక్కట్లు**

గత ప్రభుత్వం జీరో బ్యాలెన్సు అకౌంట్లను తెరిచి వారికి రుణాలు మంజూరు చేసేది. ప్రధానమంత్రి జన్‌ధన్ పేరుతో జీరో బ్యాలెన్స్ అకౌంట్లను ఉచితంగా తెరిచారు. ప్రస్తుతం లబ్ధిదారుల వద్ద ఉన్న ఈ ఖాతాలనే రుణాల కోసం అధికారులకు సమర్పిస్తున్నారు. గతంలో పెద్దనోట్ల రద్దును అమలు చేసే క్రమంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలను విధించింది. జీరో బ్యాలెన్స్ అకౌంట్లలో కేవలం రూ.50 వేల వరకే పొదుపు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఈ నిబంధనే లబ్ధిదారులకు సమస్యను తెచ్చిపెడుతోంది. జీరో బ్యాలెన్స్ అకౌంట్లకు సొమ్ము వేయడానికి బ్యాంకులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. లబ్ధిదారుగా ఎంపికైనా ఫలితం లేకుండా పోతోంది. కడప జిల్లా దువ్వూరు మండలానికి చెందిన హనుమంతు నాయక్ 2017-18 సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ రుణానికి దరఖాస్తు చేసుకున్నాడు, గొర్రెల పెంపకం కోసం రూ.లక్ష రుణం పొందడానికి ధరఖాస్తు చేసుకున్నాడు. లబ్ధిదారునిగా ఎంపికయ్యాడు. జీరో బ్యాలెన్స్ అకౌంట్ సమర్పించాడన్న కారణంగా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు వెనక్కు పంపారు. బ్యాంకు నుంచి అకౌంటు మార్పిడి చేసి సమర్పించాలని కోరారు.

## పోలవరంపై అనుమానాలను నివత్తి చేయాలి

### మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పోలవరం ప్రాజెక్టు విషయంలో అనుమానాలను ప్రభుత్వం నివత్తి చేయాలని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిధుల విషయంలో కేంద్రం, రాష్ట్రం చెబుతున్న లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయన్నారు. 2014 నాటికి పోలవరానికి సంబంధించి రూ.5,135 కోట్లు ఖర్చు చేశారని, ఈ మూడున్నరేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం రూ.3,007 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం లెక్కలు తేల్చిందని చెప్పారు. కేంద్రం నుంచి 2017 మార్చి 31 నాటికి రూ.3,364 కోట్లు, తర్వాత రూ.975 కోట్లు విడుదలయ్యాయని, మరో రూ.318 కోట్లు మంజూరు చేసినట్టు కేంద్రం లెక్కలు చెబుతుందని తెలిపారు. ఈ లెక్కలను రాజ్యసభలో కేంద్ర మంత్రి స్వయంగా ప్రకటించారన్నారు. రాష్ట్రప్రభుత్వం వీటన్నింటిపైనా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2019కి ప్రాజెక్ట్ పూర్తికాదని డిసెంబర్ 28న వచ్చిన కేంద్ర పరిశీలనా బందం స్పష్టం చేసిందన్నారు. అయినా గ్రావిటీపై నీరు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో పొడిపిరెడ్డి అచ్యుతదేశాయ్, అల్లు బాబి, చెరుకూరి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జెవివి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

### ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు శనివారం నుంచి మూడ్రోజుల పాటు కర్నూలులో జరగనున్నాయి. ఈ సంబరాలు మాంటిస్సోరి ఎ.క్యాంపు పాఠశాలలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి విద్యార్థులు, జెవివి నాయకులు హాజరు కానున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణతోపాటు జెవివి రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు. శుక్రవారం మాంటిస్సోరి పాఠశాలలో గోడపత్రికను జెవివి నాయకులు విడుదల చేశారు. అనంతరం ఆహ్వాన సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజశేఖర్, సత్యనారాయణ, గౌరవ సలహాదారులు డాక్టర్ విజయశంకర్‌లు మాట్లాడారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## 620 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - చీరాల రూరల్ (ప్రకాశం) : చీరాల మండలంలోని ఈపురుపాలెంలో విజిలెన్స్ అధికారులు 620 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ డిఎస్‌పి సుప్రజ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ దాడులు నిర్వహించారు. శ్రీలక్ష్మీరైస్ మిల్లులో అనధికారికం ఈ బియ్యం గుర్తించారు. వీటిలో రేషన్ బియ్యం 260 బస్తాలు, సాధారణ బియ్యం 360 బస్తాలు రికార్డుల్లో లేనివి ఉన్నట్లుగా చూపించారని డిఎస్‌పి సుప్రజ తెలిపారు. విజిలెన్స్ ఎఎస్‌పి శంకరరెడ్డి ఆదేశాల మేరకు తాము ఈ దాడులు నిర్వహించామని తెలిపారు.

## విశాఖ ఉక్కు అమ్మకాల్లో వృద్ధి

### కేంద్రం నిర్ణయించిందని స్టీల్ సిఎండి వెల్లడి

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

గడిచిన త్రైమాసికంలో స్టీల్ మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నా స్టీల్ అమ్మకాల్లో గణనీయంగా వృద్ధి నమోదు చేసుకుందని ఆర్ఐఎన్ఎల్ సిఎమ్‌డి పి.మధుసూదనరావు వెల్లడించారు. శుక్రవారం నగరంలోని గేట్ వే హోటల్‌లో జరిగిన 'కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ముడి ఖనిజాల ధరలు బాగా పెరిగాయని, దీనికి అనుగుణంగా స్టీల్ ధరలు పెరుగుతున్నాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 10శాతం పెట్టుబడులను ఉపసంహరించాలన్న కేంద్ర నిర్ణయంపై ఆయన వ్యాఖ్యానిస్తూ మార్కెట్ విశ్లేషణ, ప్లాంట్‌లో ఇంటర్నల్ వ్యవహారాలు, స్టాక్ మార్కెట్‌పై ప్రభావం వంటి అన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం 10 శాతం ఉపసంహరణ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

సంపాదకీయం

# గోప్యతకు గండి

కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల్లోని ప్రాసెసర్లలో వినియోగించే మైక్రో చిప్‌లలో సమాచారాన్నీ కొల్లగొట్టే బగ్స్ ఉన్నాయనే కథనాలు కొత్త సంవత్సర ఆరంభంలోనే ప్రపంచ వ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. కంప్యూటర్లకు వైరస్ రావడం కొత్త విషయమేమీ కాకపోయినా, ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన మెల్ట్‌డౌన్, స్పెక్టర్ బగ్స్ భద్రతపరంగా అత్యంత ప్రమాదకరమైనవని ఐటి నిపుణులే ఆందోళన వ్యక్తం చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. సమాచార నిల్వ కోసం ప్రస్తుతం విరివిగా వినియోగిస్తున్న గూగుల్ క్లౌడ్ వంటి క్లౌడ్ కంప్యూటింగ్ వ్యవస్థలు కూడా ఈ బగ్స్‌కు మినహాయింపేమీ కాదనే సమాచారం నిజంగా ఒళ్లు గగుర్పాటుకు గురి చేసేదే. విపులంగా చెప్పాలంటే ఇంటెల్ (ఐఎన్‌టిసి), ఎఎండి, ఎఆర్ఎం సంస్థలు తయారు చేసిన ప్రాసెసింగ్ చిప్పులను వినియోగిస్తున్న డెస్క్ టాప్ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, అలాగే యాపిల్, గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ సంస్థల ద్వారా క్లౌడ్ సర్వీసెస్ వినియోగిస్తున్న సమాచార వ్యవస్థలన్నింటిపైనా ఈ బగ్స్ ప్రభావం పడుతుందన్నమాట.

అత్యంత గోప్యతా ప్రమాణాలతో రూపొందించుకున్న పాస్‌వర్డ్‌లతో సహా వ్యక్తిగత చిత్రాలు, వ్యక్తిగత ఇ-మెయిళ్లు ఒక్కటేమిటి నిల్వ చేసుకున్న మొత్తం సమాచారాన్ని మెల్ట్‌డౌన్, స్పెక్టర్ బగ్స్ హ్యాకర్లుకు చేరవేస్తాయని నిపుణులంటున్నారు. బ్యాంకు ఖాతాలు, ఎటిఎం, క్రెడిట్ కార్డుల వివరాలు యావత్ సమాచారాన్ని వెబ్‌సైట్ బ్రౌజ్ చేసినంత సులువుగా హ్యాకర్లు తస్కరించేందుకు ఈ బగ్స్ దోహదం చేస్తాయంటున్నారు. అదే జరిగితే ఆర్థిక లావాదేవీల అల్లకల్లోలానికి బాధ్యత ఎవరు వహిస్తారనేది సమాధానం లేని ప్రశ్న. భద్రత పరమైన ఈ లోపాలు రెండు దశాబ్దాల కిందట నుంచే ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే కార్పొరేట్ కంపెనీలు ఈ విషయం వెలుగులోకి రానివ్వకుండా ఇన్నాళ్లూ తొక్కిపెట్టాయి. పెట్టుబడి తన లాభం కోసం ఎంతకైనా తెగిస్తుందన్న కార్ల్ మార్క్స్ మాటలకు ఈ ఉదంతం మంచి ఉదాహరణ.

సమాచార భద్రత పరిశోధకులు గతేడాదే ఈ బగ్స్‌ను గుర్తించి ప్రధాన చిప్‌ల తయారీ కంపెనీలైన ఇంటెల్, ఎఆర్ఎం, ఎఎండి తదితర సంస్థలకు తెలియజేసినా ఆ లోపాలను గుట్టుచప్పుడు కానివ్వకుండా వాటిని సరిదిద్దేందుకు సదరు కంపెనీలు యత్నించినట్లు కథనాలొస్తున్నాయంటే.. దానర్థమేంటి వినియోగదారులేమైనా పర్వాలేదు.. కానీ వారి లాభాలకు మాత్రం గండి పడకూడదు అనే కదా. ఈ విషయాన్ని 'ద రిజిస్టర్' అనే వెబ్‌సైట్‌కు చెందిన పాత్రికేయులు రట్టు చేయడంతో బట్టబయలైంది. ఆ తర్వాత గూగుల్ సంస్థ ఇంటెల్ చిప్‌ల్లోని బగ్స్ బండారాన్ని బయటపెట్టడంతో పాటు ప్రమాద తీవ్రతను కూడా తెలియజేసింది. ఈ కథనాలతో ఇంటెల్ షేర్లు అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో నేల చూపులు చూసినా ఆ కంపెనీ సిఇఓ బ్రేయాన్ క్రజనిచ్ ముందుగానే ఇల్లు సర్దేసుకున్నారు. బగ్స్ బండారం వెలుగురాక ముందుగానే సంస్థలో తనకున్న 39 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను వదిలించుకొని ఒడ్డున పడటం కార్పొరేట్ ప్రపంచ నయవంచనకు నిదర్శనం. ఇంత జరిగాక కూడా తమ చిప్ డిజైన్లలో లోపాలు లేవంటూ ఇంటెల్, ఎఆర్ఎం, మైక్రోసాఫ్ట్ కంపెనీలు ఒకవైపు బుకాయిస్తూనే మరో వైపు ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్ చేసుకోవాలని ధర్మోపదేశం చేయడం గమనార్హం. ప్రస్తుతానికి ఆయా కంపెనీల ఆదేశాలు పాటించి తక్షణమే ఆపరేటింగ్ సాఫ్ట్‌వేర్‌ను, బ్రౌజర్లను, యాంటి వైరస్ సిస్టమ్స్ అప్‌గ్రేడ్ చేసుకోవడం మినహా వినియోగదారులకు మరో గత్యంతరం లేదు.

స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంపై దృష్టి సారించకుండా ఆసాంతం మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి బహుళ జాతి కంపెనీలపైనే ఆధారపడిన భారత్ లాంటి దేశాల్లోని ప్రభుత్వ వ్యవస్థలపైన ఈ బగ్స్ ప్రభావం ఇంకెంతటి భయానకంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వంద కోట్ల భారతీయుల వ్యక్తిగత సమాచారాన్ని 'ఆధార్'లలో నిక్షిప్తం చేసి అంగట్లో రూ.500 విక్రయించే పాలకుల ఏలుబడిలో ఐటి భద్రత పట్టించుకునే దిక్కేముంటుంది. మైక్రోసాఫ్ట్ కంటే అత్యంత చౌకగా లైనెక్స్ వంటి ఆపరేటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసారాన్ని 'స్వేచ్ఛ' వంటి ఐటి రంగ స్వచ్ఛంద సంస్థలు పదేపదే ప్రభుత్వానికి సూచిస్తున్నా పాలకులు పెడచెవిన పెడుతూ వచ్చారే మినహా పట్టించుకున్న పాపాన పోలేదు. అటు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలకు పూర్తిగా దాసోహం అయిపోయినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర అధికార యంత్రాంగంలోని ఉన్నతాధికారులకే వినియోగించే తీరు తెలియకపోయినా 'కైజలా' వంటి మైక్రోసాఫ్ట్ ప్రాజెక్టులను ప్రజలపై బలవంతంగా రుద్దుతూ బహుళ జాతి కంపెనీల సేవలో పాలకులు తరించడం సిగ్గుచేటు. పాలకులు ఇప్పటికైనా బహుళ జాతి ఐటి కంపెనీలపై ఆధారపడకుండా స్వీయ నియంత్రణలోని ప్రత్యామ్నాయ సాంకేతిక వ్యవస్థలపై దృష్టి సారించాల్సిన అవసరముంది. చైనా తరహాలో సొంత సాంకేతికతను, ఆపరేటింగ్ వ్యవస్థలను అభివృద్ధి పర్చుకోవడం ద్వారా సమాచార భద్రతకు పెద్దపీట వేయాల్సిన బృహత్ బాధ్యత కూడా ప్రభుత్వాలదే. వ్యక్తిగత సమాచార భద్రత కోరుకునే ప్రతి ఒక్కరూ ఆ దిశగా పాలకులపై ఒత్తిడి తేవాల్సిన అవసరముంది.

ఇదీ విషయం




అప్పలతో అమరావతి
పప్పు కూడు తింటున్నది...
రేపటి దుస్థితి సంగతి
దేవుడి కొదిలేస్తున్నది!

మాటలు ఆకాశంలో
పాతాళంలో చేతలు..
జనం నయనాలకేమో
ఊగుతున్న రెండు వేళ్లు!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

# సంక్షోభంలో సామాన్యులు లాభాల్లో కార్పొరేట్లు



సారంపల్లి మల్లారెడ్డి

**2017** నుండి 2018లోకి భవిష్యత్తుపై ఆశతో అడుగుపెట్టాం. కానీ ఇప్పటికీ 2017 చేదు జ్ఞాపకాలు మన సమాజాన్ని వదిలిపెట్టడంలేదు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగాలను పరిశీలిస్తే తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. భారత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 2.5 శాతం (రు.52 వేల కోట్లు) మాత్రమే బడ్జెట్ కేటాయింపు చేసింది. ఇందులో 50 శాతం పంటల బీమా, వడ్డీ మాఫీకి కేటాయించారు. అమెరికా తన బడ్జెట్‌లో 4 శాతం నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించింది. అమెరికా సాగు విస్తీర్ణం, దిగుబడి మనకన్నా తక్కువ. అయినప్పటికీ 8 రకాల సబ్సిడీలు ఇచ్చి రైతులకు అన్ని విధాలా రక్షణ కల్పించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, త్రిపుర, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో గిట్టుబాటు ధరలు కావాలని, రుణ మాఫీ కోసం 2017లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. 2017 నవంబర్ 20, 21 తేదీలలో లక్ష మందితో పార్లమెంటు ముందు ఆందోళన నిర్వహించారు. గత నవంబర్ 24న దేశవ్యాపితంగా నాలుగు కిసాన్ జాతాలు నిర్వహించారు. మహారాష్ట్ర, రాజస్థాన్ పోరాటాలు గణనీయమైన ఫలితాలు సాధించాయి. 'జన ఏక్తా అధికార్ ఆందోళన్' పేర 120 కిసాన్ సంఘాలు 18 సెప్టెంబర్ 2017న రైతుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాయి. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. ఫలితంగా గత సంవత్సరం ఆహార ధాన్యాల ఉత్పత్తి 27.34 కోట్ల టన్నులకు మించలేదు. జనాభా ఏటా 1.9 శాతం పెరుగుతుండగా అందుకు తగిన విధంగా వ్యవసాయోత్పత్తులు పెరగలేదు. ఒకవైపున సాగుభూమి విస్తీర్ణం తగ్గుతున్నది. అలాంటి పరిస్థితుల్లో ఉత్పాదకతను పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కానీ అందుకు తగిన పరిశోధనలు జరగడంలేదు. రైతుల రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు వెనకడుగు వేశాయి. దేశంలోని బ్యాంకులలో 96 లక్షల కోట్లు డిపాజిట్లు ఉండగా అందులో 18 శాతం, అనగా 16 లక్షల కోట్లు పంట రుణాలు ఇవ్వాలి. కానీ 8.5 లక్షల కోట్లు మాత్రమే రుణాలివ్వడం జరిగింది. రిలయన్స్, ఎల్ అండ్ టి, టాటా, బిర్లా లాంటి సంస్థలు మైక్రో ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తున్నారు. బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి కనీస మద్దతు ధర చెల్లిస్తానని ప్రకటించింది. ఈ చర్యను అమలు జరపాల్సిందిగా సుప్రీంకోర్టు కోరడంతో, తాను ఈ హామీని అమలు జరపలేనని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంది. ఎన్నికల హామీ బూటకమని తేలింది. కనీస మద్దతు ధర లేకపోవడంతో 2017లో 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సంఖ్యను తగ్గించి చూపడానికి జాతీయ నేరాల గణాంక సంస్థ

## 2017 అవలోకనం




**పేద, మధ్య తరగతి ప్రజలు ఈరోజుకీ సంక్షోభం నుండి బయటపడలేదు. పశు వ్యాపార నిషేధ చట్టం, కార్పొరేట్లకు ఉపయోగపడే మార్కెట్ చట్టం, ఫ్యాక్టరీల సవరణ చట్టం తేవడం ద్వారా భూస్వాములకు, కార్పొరేట్లకు లాభం చేకూర్చారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన కార్పొరేట్ల నుండి అప్పులు రాబట్టడానికి బదులు, కేంద్రం తిరిగి 2.11 లక్షల కోట్లు బ్యాంకులకు నిధులు సమకూర్చింది.**

ఆత్మహత్యలలో 25 శాతం మందిని వ్యవసాయ కూలీలుగా గ్రేడింగ్ చేసింది. మోన్‌శాంటో మరియు మహికో కంపెనీలు అనుమతి లేకుండానే 1.3 మిలియన్ హెక్టార్లలో బిటి-3 పేరుతో పత్తిపంట వేసి తీవ్ర నష్టం కలిగించారు. ఎకరాకు కనీస దిగుబడి కూడా రాలేదు. ఇ-నామ్ పేరుతో మార్కెట్ చట్టాలను మార్చి యంత్రాంగం లేకుండానే కార్పొరేట్ సంస్థలకు లాభాలు కట్టబెట్టారు.

ప్రకృతి వైపరీత్యాల వల్ల ఒరిస్సా, ఉత్తరాఖండ్ బాగా దెబ్బతిన్నాయి. కేంద్రం ఇంతవరకూ ఎలాంటి పరిహారం చెల్లించలేదు. సహజంగానే రాష్ట్రాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయినప్పుడు కేంద్రం తన బృందాలను పంపి నివేదిక తెప్పించుకుని, జరిగిన నష్టంలో కనీసం 60 శాతం ఇవ్వాలని అనేక కమిషన్లు చెప్పాయి. చివరికి 14వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన నిధులు కూడా రాష్ట్రాలకు సకాలంలో ఇవ్వడంలేదు.

మరోవైపున పారిశ్రామిక రంగం దినదినం కునారిల్లుతున్నది. గత రెండు సంవత్సరాలలో 61,333 పరిశ్రమలను మూతవేసినట్లు మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్స్ ప్రకటించింది. లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తీసివేసింది. పారిశ్రామిక సరుకుల దిగుమతి బాగా పెరిగింది. వంటనూనెలు, పప్పులు, పంచదార తదితర ఆహార సరుకులు మరియు దూది, ఎరువులు, రసాయనాలు, మెడికల్, ఫార్మా, వజ్రాలు, నాన్ ఫెర్రస్ మెటల్ దిగుమతులు బాగా పెరిగాయి. 2016-17లో రూ. 25,77,422 కోట్ల సరుకులు దిగుమతి చేసుకోగా రూ. 18,52,340 కోట్లు ఎగుమతుల చేశాము. అనగా రూ. 7,25,082 కోట్లు లోటు ఏర్పడింది. దేశాన్ని స్వయం సమృద్ధి చేస్తానన్న మోడీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దాని ఫలితంగా ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో హైదరాబాద్‌లో 2017 జులై 23 నుండి 29 వరకు 'రీజినల్ కాంప్రెహెన్సివ్ ఎకనమిక్ పార్టనర్‌షిప్' పేర సమావేశాలు జరిపారు. ఇందులో 16 ఎగుమతి దేశాలు పాల్గొన్నాయి. అంతకు ముందే నాలుగు విడతలుగా 2009, 2011లో ప్రాంతీయ ఒప్పందాల ద్వారా 82 దేశాలతో పరస్పర ఒప్పందాలు చేసుకోవడం జరిగింది. దీనికి విస్తరణగా మరో 72 దేశాలతో చర్చలు జరిపారు. డబ్లుటిఓలో ఉన్న సుంకాలు విధించే నిబంధనలకు విరుద్ధంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో దిగుమతి సుంకాలను రద్దు చేశారు. ఫలితంగా భారతదేశ ఉత్పత్తులు తగ్గుతాయి. ఉపాధి దెబ్బతింటుంది. ఇప్పటికే ఎగుమతి, దిగుమతుల వ్యత్యాసంలో రూ. 7 లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. దేశాన్ని 'మేకిన్ ఇండియా' పేరుతో ఎగుమతుల దేశంగా చేస్తానన్న మోడీ దిగుమతులపై ఆధారపడే పరిస్థితి కల్పించారు. దీనికితోడు వివిధ దేశాల పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి దేశంలోకి పెట్టుబడులు రావడానికి 8వ గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్ నవంబర్ నెలలో హైదరాబాద్‌లో నాలుగు రోజుల సదస్సు నిర్వహించారు. ఆశించిన ఫలితం రాలేదు.

సాంఘికంగా 2017 బలహీన వర్గాలపై దాడులతో ముగిసింది. ముఖ్యంగా అభివృద్ధికాముక రచయితలను హత్య చేయడం ద్వారా ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠకు మచ్చ తగిలింది. నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, ఎం.ఎం.కల్బుర్గి, గౌరీ లంకేష్ లాంటి వాళ్ళను హత్య చేయడంతో పాటు గోరక్షణ పేరుతో అనేకమంది ముస్లింలు, దళితులపై దాడులు చేశారు. ఉమర్ మహ్మద్ ఖాన్, పెహ్లూఖాన్‌లను హత్య చేయడమే కాక గుజరాత్‌లోని ఉనాలో, యుపిలోని షహరన్‌పూర్‌లో దళితులపై దాడులు సాగాయి. నిరుద్యోగుల ప్రదర్శనపై కూడా దాడులు చేశారు. మధ్యప్రదేశ్‌లోని మంథసోర్‌లో కాల్పులు జరిపి ఆరుగురు రైతుల ప్రాణాలు బలిగొన్నారు. జార్ఖండ్‌లో ఏడుగురు, అస్సాంలో ఇద్దరు, పశ్చిమ బెంగాల్‌లో ఇద్దరు కాల్పుల్లో మరణించారు. కేరళలో సిపిఐ(యం) కార్యకర్తలపై హత్యాకాండ కొనసాగించారు. శాంతిభద్రతలను కాపాడుతున్న ప్రభుత్వంపై తిరిగి వారే ఆరోపణలు చేశారు. వామపక్ష ప్రభుత్వాలను బలహీనపర్చడానికి కేరళ, త్రిపుర రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపడమే కాక ఈ రెండు రాష్ట్రాలలో బిజెపి అన్ని విచ్ఛిన్నకర శక్తులతో కలిసి శాంతిభద్రతలకు ప్రమాదం కల్పిస్తున్నది. కొద్ది రోజుల్లో జరగనున్న త్రిపుర ఎన్నికల్లో గెలుపు కోసం విచ్ఛిన్నకారులతో కలిసి కుట్రలు సాగిస్తున్నది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి (ఒకే పన్ను విధానం) చర్యలు చేపట్టడం ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి రేటు గణనీయంగా తగ్గింది. అనేక మంది నిరుద్యోగులయ్యారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఈరోజుకీ సంక్షోభం నుండి బయటపడలేదు. పశువ్యాపార నిషేధ చట్టం, కార్పొరేట్లకు ఉపయోగపడే మార్కెట్ చట్టం, ఫ్యాక్టరీల సవరణ చట్టం తేవడం ద్వారా భూస్వాములకు, కార్పొరేట్లకు లాభం చేకూర్చారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన కార్పొరేట్ల నుండి అప్పులు రాబట్టడానికి బదులు, కేంద్రం తిరిగి 2.11 లక్షల కోట్లు బ్యాంకులకు నిధులు సమకూర్చింది. అంతేకాక, మరో 6 బ్యాంకులకు నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తోంది. గత సంవత్సర బడ్జెట్‌లో 5 లక్షల కోట్లు కార్పొరేట్ సంస్థలకు లాభం కలిగే విధానాన్ని అనుసరించింది. 50 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను వాటాల ఉపసంహరణ పేర అమ్మింది.

విద్య, వైద్య రంగంలో మార్పులు చేసే ప్రయత్నం జరిగింది. ప్రజల నుంచి నిరసన వెల్లువెత్తడంతో తాత్కాలికంగా వాయిదా వేసినప్పటికీ కార్పొరేట్ సంస్థలకు ఈ రెండు రంగాలలో లాభాలను సాధించి పెట్టడానికి చట్టాన్ని మార్పు చేయడానికి ఇప్పటికీ కృషి చేస్తూనే ఉంది. వైద్య రంగం బిల్లు పార్లమెంటు సెలెక్టు కమిటీకి పంపినప్పటికీ ఎలాగైనా రాజ్యసభలో గెలిపించుకోవాలని ప్రయత్నిస్తున్నది.

2018లోనైనా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పథంలో నడపడానికి కేంద్ర ప్రభుత్వం తన గత విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. దేశంలోని సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా విత్తన చట్టం, గిట్టుబాటు ధరల చట్టం చేయాల్సిన అవసరం ఉంది. రైతుల రుణాల రద్దు, ఉత్పత్తిదారుల కంపెనీలను ఏర్పాటు చేసే విధానాన్ని రద్దు చేసుకోవాలి. సహకార సంఘాలను పటిష్టవంతం చేయాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాల దిగుమతులపై ఆంక్షలు విధించి దేశాన్ని స్వయంసమృద్ధి చేసుకోవడానికి పథకాన్ని రూపొందించాలి. బడ్జెట్‌లో కనీసం 5 శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలి. విత్తన రుణ మరియు మార్కెట్ అంశాల నుండి కార్పొరేట్ సంస్థలను తొలగించాలి. కార్మిక రంగంలో తెచ్చిన మార్పులను సవరించాలి. కార్మిక రంగానికి కనీస వేతనాల అమలు, సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధానాన్ని అమలు చేయాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి జరిగితేనే దేశ అభివృద్ధి జరుగుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తించి 2018లో ప్రభుత్వం తన కార్పొరేట్ అనుకూల విధానాలను మార్చుకుంటుందని ఆశిద్దాం.

( రచయిత అఖిల భారత కిసాన్ సంఘం ఉపాధ్యక్షులు )

చర్చ

## వాస్తవం-అవాస్తవం



వాస్తవం-అవాస్తవం మధ్య వున్నది చిన్న గీతలాగే కనబడుతుంది. కానీ వాటి మధ్య వున్న అగాధంలో ఎందరో కూరుకుపోతున్నారు. దశాబ్దాలు, శతాబ్దాలు కాలగర్భంలో కలుస్తున్నా ఈ లోతులు పూడటం లేదు. అజ్ఞానంలో కూరుకుపోయిన కాలంలో అనుసరించిన ఆచార, వ్యవహారాలను నేటికీ అవలంబించడం దౌర్భాగ్యం. సాంఘిక దురాచారాలుగా వేళ్లూనికొని వున్న ఈ ఆచార వ్యవహారాలు మానవాళి వినాశకరాలేనని ఒప్పుకోక తప్పదు. ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతుండటం చూస్తూనే వున్నాం. ఈ ఆచారాల మీద ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎందరో మేధావులు శ్రమించారు. అయినా నేటికీ అనేక ప్రాంతాల్లో ఎన్నో ఆచార వ్యవహారాలను మూఢంగా అనుసరిస్తున్నారు. వాటిల్లో శకునాలు ముఖ్యమైనవి. పిల్లి, వితంతు స్త్రీ, పిల్లలు లేని మహిళలు దుశ్శకునాలుగా నేటికీ పరిగణించేవారెందరో! మనిషి అలికిడికే భీతిల్లే ఒక జంతువు, భర్తను కోల్పోయి నిస్సహాయ స్థితిలో వున్న స్త్రీ, మాతృత్వం అందని మహిళలు దుశ్శకునాలు! వీరు ఎదురు వస్తే కీడు జరుగుతోందా? సంప్రదాయం పేరుతో చేసే క్రతువులలో వీరికి స్థానం కల్పించక అవమానిస్తారు. అసలీ క్రతువులు ఎందుకు? ఎవరిని ఉద్ధరించడానికి? ఈ క్రతువులు ప్రాంతానికో ఆచారాన్ని కలిగివుంటాయి. వలసల వల్ల ఈ క్రతువులు అన్ని ప్రాంతాలకు వ్యాపించాయి. ఆచారం వ్యక్తిగతం నుండి సమాజంలోకి ప్రవేశించింది. ఇంకేముంది! చిన్న పెద్ద అందరూ తప్పక పాటించాల్సిందేనన్న షరతుల వరకూ ఈ క్రతువులు వెళ్లాయి. నోములు, వ్రతాల వంటివి ఈ కోవలోనివే.

ఒకప్పుడు జాతర, ఊరేగింపులు, ఉత్సవాలు వంటివి ఊరూ, వాడా కలసి జరుపుకునే పండుగలు. నాలుకమీద శూలాలు పొడిపించు కోవడం, ఒళ్లంతా గాయాలు పెట్టుకోవడం, అగ్ని గుండాల మీద నడవడం, స్వాములతో కొట్టించుకోవడం వంటివి ఎన్నో పూర్వం మాత్రమే కనిపించేవంటే నమ్మలేం, ఇప్పటికీ కొన్ని చోట్ల జరుగుతూనే వున్నాయి. వీటన్నింటిలో మనకు కనిపించేదేంటి? మనల్ని మనం హింసించుకోవడం. అంటే హింస జరిగితేనే దేవుడు కరుణిస్తాడా? ఉద్యోగం, పిల్లలు, పెళ్లి, గృహం వంటివన్నీ దేవుడే కల్పించాడా? ఉన్నత చదువు చదివితే మంచి ఉద్యోగం వస్తుంది. స్త్రీ, పురుషుల కలయిక వల్ల పిల్లలు పుడతారు. వ్యక్తుల అంగీకారంతో పెళ్లి జరుగుతుంది. ఇక గృహం నిర్మించుకోవాలంటే ఎన్ని సాధక బాధలుంటాయో చెప్పనవసరం లేదు. ఇవన్నీ వాస్తవాలు. మరి వాటిని నమ్మని వారెవరు అంటే, అందరూ నమ్ముతారు. కాని ఆచార, వ్యవహారాలు మాత్రం మానరు. నిరక్షరాస్యులే కాదు, అక్షర జ్ఞానమున్న విద్యావంతులు కూడా వీటిని పాటిస్తారు. అదే సమాజానికి పట్టిన అధోగతి. విజ్ఞాన ప్రయోగాల్లో అంతరిక్షంలోకి నివాసాలు ఏర్పరచుకుంటున్న ఈ ఆధునిక కాలంలో కూడా దేవుడు, దెయ్యం, అంటూ పట్టుకు వేళ్లాడే వాళ్లు ఉన్నంతవరకూ మనం బాగుపడం.

సమాజాన్ని ఎప్పుడూ నిద్రాణంలో వుంచితేనే తాము అనుకున్న పనులు జరుగుతాయని భావించే మన పాలకులు దగ్గరుండీ మరీ వీటిని ఆచరిస్తారు. రాకెట్ ప్రయోగించాలంటే తిరుపతి వెంకన్న దర్శించుకునే శాస్త్రవేత్తలు ఒక పక్క, బులెట్ ట్రెయిన్ ప్రతిపాదన తెచ్చిన వారు గంగాహారతి క్రతువులు జరుపుతూ మరో పక్క, ఇలా కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరుంటే సామాన్యులు ఎవరిని అనుసరిస్తారు? అయితే ఈ గుడ్డి నమ్మకాలనూ, జుగుప్స కలిగించే ఆచారాలనూ పారదోలేలా ఆధునిక యువత నడుం బిగించాలి. ఈ ఉచ్చులో పడి పిట్టల్లా రాలిపోక ముందే వాస్తవం-అవాస్తవం మధ్య వున్న అగాధాన్ని పూడ్చాలి.

-అభినవ్

జన వాక్యం

## మాధ్యమాల భాష

తెలుగు చదువులు, ఇంగ్లీషు చదువులపై కొంతకాలంగా చర్చలు నడుస్తున్నాయి. ఇంగ్లీషు చదువులు లేకుంటే కొలువులు దొరకవని, విదేశాలకు వెళ్ళలేమని పలువురు అభిప్రాయపడు తున్నారు. తెలుగు చదువులు కావాలనేది తెలుగు భాష బతకడం కోసమే కాదు. తెలుగులో చదవడమంటే ఇంగ్లీషును వదల మని కాదు. ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించాలనేది ప్రపంచ మేధావులు చెబుతున్న మాట. మాతృభాష బోధన వల్ల పిల్లల మానసిక వికాసం పెరుగుతుం దని, మేధోశక్తి వృద్ధి చెందుతుందని 'యునెస్కో' వంటి అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయి. అభివృద్ధిలో ముందుకు దూసుకు పోతున్న దేశాలన్నింటిలో మాతృభాషలోనే విద్యా బోధన జరుగుతోంది. ఈ వాస్తవాలను తెలుగు చదువులు పనికిరావనే వారు చూడలేరు. పరభాషా చదువులతో ముందుకు పోతున్న దేశమేదైనా ఉందా? ఇప్పటికే ఇంగ్లీషు చదువుల భ్రమల్లో పేదలు నలిగిపోతున్నారు. తెచ్చు కుంటున్న కూలిడబ్బులు, చిన్నా చితకా జీతాలు, చదువులకే పోతుంటే, తినేదేమిటి! జాతిని ఎటు తీసుకుపోతు న్నారు? కార్పొరేట్లకు దన్నునివ్వడానికేనా ఏలికలు న్నది. అందుకే ప్రభుత్వ, ప్రయివేటు అన్ని బడుల్లో మాతృభాషలోనే ప్రాథమిక విద్య బోధించాలి. ఇంగ్లీషును ఒక అంశంగా ఒకటవ తరగతి నుంచి బోధిస్తే చాలు. అప్పుడే జాతి బతుకు తుంది. భాష కూడా బతుకుతుంది.

**యర్ర నాయుడు,** ఇమెయిల్ ద్వారా.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

వ్యవసాయ రంగం

# మన గురువు గిరీశమా!?



ప్రొ॥ ఎన్ వేణుగోపాలరావు

పెద్ద పెద్ద మాటలు, చిల్లర చేష్టలకు ప్రతీకగా నిలిచిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఉన్నత స్థాయి మంత్రి మండలి సమావేశాలు మరోసారి బ్యూనస్ ఎయిర్స్ (అర్జంటీనా)లో జరిగాయి. అత్యధిక దేశాలను ముగ్గులోకి దింపి, ఆర్థిక సంస్కరణ వలయంలోకి ఈడ్చి తమ పబ్బం గడుపుకోవాలన్న పెద్ద కంపెనీలతో నడపబడే దేశాల కుట్రలో భాగమే డబ్ల్యుటిఒ. 21 వ శతాబ్ద వ్యవసాయ వాణిజ్యాన్ని, కంపెనీల పెట్టుబడుల్ని బడుగు దేశ వనరులను హస్తగతం చేసుకొనే ప్రయత్నంలో అమెరికా, ఐరోపాలు, డబ్ల్యుటిఒ ద్వారా 'దోహ' సంప్రదింపుల నుండి తెరలేపాయి. భారత్, చైనా, దక్షిణ అమెరికాలు బడుగు దేశాల తరపున దానికి అడ్డు చెప్పాయి. అయినా వరవడి మారలేదు. దాన్ని గుర్తించిన స్వామినాథన్ నాయకత్వ జాతీయ రైతు కమిషన్... ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి ఎదురయ్యే ప్రతికూలతలను తగ్గించగల 'జాతీయ వాణిజ్య సంస్థ (ఐటిఒ)ను రూపొందించి చిన్న, సన్నకారు రైతుల్ని రక్షించుకోవచ్చని సూచించింది. ఆ క్రమంలో అధికారం కోసం ఎగబాకే ప్రతి రాజకీయ పార్టీ ఆ నివేదికను సమర్థించింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని (ఎన్‌డిఎ కూటమి) నడిపే నాయకులందరూ ఆ కమిషన్ సిఫార్సుల విలువను గుర్తించినట్లు వాటిని అమలు పరచి వ్యవసాయరంగాన్ని ఉద్ధరిస్తామని ఊరూ వాడా తిరిగి ప్రచారం చేశారు. అయితే స్వతంత్ర పార్టీ వారసులకు, బహుళజాతి కంపెనీల ముద్దు బిడ్డలకు మాత్రం ఈ నివేదిక నచ్చలేదు. కారణం స్వామినాథన్ ఎంత సేపటికీ చిన్న రైతుల, వ్యవసాయ అనుబంధ వృత్తిదారుల, భూ సంబంధాల సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ, దేశ స్వావలంబన, ఆహార భద్రత గురించే ఆలోచించారు. కాని పెద్ద భూస్వాములు వ్యవసాయదార్లకు తగిన సూచనలు చేయలేదు.

ప్రొ.ఎంఎస్ స్వామినాథన్‌కు 11-12-17న చెన్నైలో తమిళనాడులోని వివిధ వ్యవసాయ సంబంధ సంస్థలు రూపొందించిన మొదటి అవార్డు 'యేరా రిగ్నార్' ( వ్యవసాయ పరిశోధన నమూనా), జీవిత సాఫల్య బహుమతిని దేశ ఉపాధ్యక్షుడి ద్వారా ప్రదానం చేశారు. ఆ సందర్భంగా ఆ 'విశిష్ట అతిథి' మాట్లాడుతూ 'స్వామినాథన్ మన కాలపు మహా శాస్త్రవేత్త! జీవన సాఫల్యానికి నిలువుటద్దం! పంటల పరిశోధనతో ప్రజల ఆకలిని తరిమి కొట్టాడు. దేశ ఆహార రంగ స్వావలంబనకు దారులు వేశాడు. అటువంటి



**దాదాపు ఇటువంటి ధోరణే తెలుగు రాష్ట్రాల పాలకుల్లో (మాటకు చేతకు పొంతనలేని తనం) చూస్తున్నాం.'వ్యవసాయాన్ని పండగ చేసేందుకే వస్తున్నా మీ కోసం యాత్రలు. నన్నే ఎన్నుకోమ'ని ఎపీ నేత కోరారానాడు. కానీ నేటికీ రుణమాఫీ ప్రహసనాన్ని నడుపుతూనే ఉన్నారు.**

మానవతా మూర్తిని సత్కరించుకోవడం మన ధర్మం' అన్నారు. భారత దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం వాటా తరిగిపోతుండడం బాధాకరమని, ఈ వరవడిని సరిచెయ్యాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాథన్ నేతృత్వ జాతీయ రైతు కమిషన్ సిఫార్సులను అమలు పరచడమే మార్గమన్నారు దేశ ఉపాధ్యక్షుడు. ఆయన సమయస్ఫూర్తికి ముగ్ధులయ్యారందరు. అవార్డు దాతలకు, ప్రదాతకు స్వామినాథన్ కృతజ్ఞతలు చెబుతూ దేశంలో అత్యధికంగా గల చిన్న సన్నకారు రైతుల్ని గమనంలో ఉంచుకొనే తాము కమిషన్ నివేదికను రూపొందించి దశాబ్ద కాలం ముందే ప్రభుత్వాలకు సమర్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ విధానాలు, నిపుణుల సూచనల మధ్య సమన్వయం వున్నప్పుడే దేశం ఆహార రంగంలో ముందుకెళ్తుందని నొక్కి చెప్పారు.

దాదాపు ఇటువంటి ధోరణే తెలుగు రాష్ట్రాల పాలకుల్లో (మాటకు చేతకు పొంతనలేని తనం) చూస్తున్నాం. షేడ్‌నెట్ పంటల సాగు ద్వారా లక్షల్లో ఆదాయం వస్తుందని... ఒకసారి ప్రతి రైతుకూ ఎరువులకు, విత్తనాలకు డబ్బిచ్చి, రుణమాఫీ చేస్తే వ్యవసాయం ఉద్ధరించబడుతుందని మరోసారి ప్రవచించారో తెలంగాణ నేత. దున్నేవాడికి భూమిని పంచి మావోయిస్టుల ఎజెండాను తామే అమలు చేస్తున్నామన్నారొకసారి. ఉన్న భూమిని ఊడబెరికి ప్రాజెక్టులు, భవనాలు కడతామన్నారొకసారి. కంపెనీల కల్తీ, నాశనకర విత్తనాలు స్వైర విహారం చేస్తున్నా, విత్తన హబ్ డ్రామాను నడుపుతూనే వుంటారు తెలంగాణలో. 'వ్యవసాయాన్ని పండగ చేసేందుకే వస్తున్నా మీ కోసం యాత్రలు. నన్నే ఎన్నుకోమ'ని ఎపీ నేత కోరారానాడు. కానీ నేటికీ రుణమాఫీ ప్రహసనాన్ని నడుపుతూనే ఉన్నారు. రైతుల్ని ఉద్ధరించే పాలేకర్ ప్రకృతి వ్యవసాయానికి, కోట్లు ఖర్చు బెట్టబోతున్నామన్నారొకసారి.

'అగ్రి హైటెక్' పేరుతో బిల్‌గేట్స్ బిజినెస్ వ్యవసాయానికి పెద్దపీట వేశారు మరోసారి. నకిలీ విత్తనాలు, కల్తీ మందుల్ని అదుపు చేయలేకపోయారు. కానీ 'అమెరికా ఐరోపా దన్నుతో ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా తంగడంచలో విత్తనాల వృద్ధి సంస్థ రూపొందబోతోంది. ఇక రైతులకు దిగులే లేదు. పంట దిగుబళ్లకు అంతే లేదు'. అని హెలికాప్టర్ ద్వారా కూడా ప్రచారం చేశారు. కావాలంటే డ్రోన్‌లతో మందులు చల్లిస్తాం. రెయిన్ గన్‌తో పంటల్ని రక్షిస్తామని కూడా ఊదరకొట్టారు పదే పదే! వాస్తవ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చూస్తూనే ఉన్నాం. రాయలసీమ వేరుశనగ రైతు, కోస్తా జిల్లాల మిర్చి రైతు నిరుడు వీధిన పడడం, ఆత్మహత్యలు చేసుకోవడం చూశాం. పత్తి రైతు పూర్తిగా పతనమై మళ్లీ తమల్ని కాపాడేదెవరని అడగటాన్ని చూస్తూనే వున్నాం. కానీ తాము 'నిప్పు'లాంటి వాళ్లమని తప్పు చేసిన వాణ్ణి శిక్షించక వదలనని ప్రగల్భాలు పలుకుతూనే వున్నారు పాలకులు. ప్రతిపక్ష నాయకులు, నిర్వీర్యస్థితిలో అసలు వ్యవసాయాన్ని ఏం చేస్తే బాగవుతుందో తెలియని అయోమయంలో, మళ్లీ 'నీళ్లిస్తాం, కరెంటిస్తాం! రుణమాఫీ చేస్తాం! ఊరికే అన్నీ ఇస్తాం మేమొస్తే' అని యాత్రలు మొదలెట్టారు.

తెలుగు సాహిత్య వైతాళికుడు, గురజాడ తన 'కన్యాశుల్కం' ద్వారా 'గిరీశం' పాత్రను వందేళ్ల క్రితమే పరిచయం చేశాడు. ఆ గిరీశం షేక్స్పియర్ కవితాఝరి విన్పించే ఒక సందర్భంలో అప్రయత్నంగా 'చేతలకు నోచుకోని మాటలు చెప్పడమే గొప్ప పొలిటీషియన్ లక్షణమ'ంటాడు. గిరీశం దాన్నే తన జీవితంలో అవపోశన పట్టాడు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడెంతమంది గిరీశంలో?! పాపం గురజాడ ఊహించి వుండరు తన గిరీశం ఇంతమంది తెలుగువారికి ఆదర్శమౌతాడని!

Dwaraka

JEEVANA

ప్రజాశక్తి

జీవన the family

jeevanapageps@gmail.com

5 విజయవాడ
శనివారం 6-1-2018



వాళ్లిద్దరూ మేనత్త మేనమామ పిల్లలే.. ఒక ఏడాది కాదు.. రెండేళ్లు కాదు.. ఏకంగా ఇరవై ఏళ్లు ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామనుకుంటే.. ఆమె వైపు తల్లిదండ్రులు అభ్యంతరం పెడుతూ వచ్చారు. ఎట్టకేలకు వారిద్దరూ ఎవరి అభ్యంతరం పెట్టినా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. చివరకు ఆమె తల్లిదండ్రుల్ని ఒత్తిడి చేసి, పెళ్లి చేసుకుంది. భర్త ముందే మామగారు అనకూడని మాటలంటే ఆమె ఏం చేయాలి? భర్త స్పందించకపోతే ఆమె పరిస్థితి ఎలా ఉంటుంది? ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి? ఈ పరిస్థితుల్లో ఆమె 'ఐద్వా అదాలత్'కు వచ్చింది. వారి జీవన సమస్యే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ'.

# ప్రేమంటే ఇదేనా?

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఐద్వా అదాలత్

ఆమె పేరు వనిత. అతని పేరు వరుణ్. వనితకు అక్క, తమ్ముడు ఉన్నారు. వనిత ఎంఎస్‌సి నర్సింగ్ చదివింది. మంచి పేరున్న హాస్పటల్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తుంది. తండ్రి పెళ్లి సంబంధాలు తీసుకొచ్చినప్పుడల్లా ఆ ఇంట్లో పెద్ద రాద్ధాంతమే. కారణం వనిత, వరుణ్ మేనత్త, మేనమామ పిల్లలు. చిన్నప్పటి నుంచి ఇద్దరూ ఒకర్నొకరు ఇష్టపడ్డారు. ఒకరంటే ఒకరికి ఎంతో ప్రేమ. అతను డిగ్రీ వరకూ చదువుకున్నాడు. మంచి చిత్రకారుడు కూడా. అభ్యంతరం ఏమంటే వనిత తండ్రి పదే పదే చెప్పేది ఒక్కటే.. "మీ మేనమామ సంగతి నీకన్నా నాకే బాగా తెలుసు. ఆ కుటుంబమే వేరు. మన పద్ధతులు వేరు. వాళ్ల నోరు అదుపులో పెట్టుకోరు.. నోటికి ఎంత మాటవస్తే అంతమాట అనేస్తుంటారు. నువ్వు అవన్నీ తట్టుకోలేవు. వాడిని మరిచిపో. నిన్ను మంచిగా చదివించా. నీకు తగ్గ సంబంధం వస్తుంది. హాయిగా బతకొచ్చు. తొందరపడి వాడిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయం తీసుకోకు. అలా చేసుకున్నావో నీ గొయ్యి నువ్వు తీసుకున్నట్లే!" అనేదే సారాంశం.

అయినా వనిత అతన్నే చేసుకోవాలని పట్టుపట్టింది. అలా ఏళ్లకు ఏళ్లు గడిచిపోయాయి. ఇద్దరికీ నలభైలు దాటిపోయాయి. ఇక వారిని అలా చూసి "ఏం చస్తావో చావు.. మాకైతే ఆ కుటుంబంతో సంబంధం ఇష్టం లేదు" అని వనిత తల్లిదండ్రులిద్దరూ నచ్చజెప్పారు. ఆఖరుకు ఇద్దరికీ పెళ్లి చేశారు.. "చేశారు అనేకన్నా చేసుకున్నారు అనడమే కరెక్టు" అంటారు వనిత తండ్రి.

పెళ్లయిన కొత్తల్లో వనిత, వరుణ్ బాగానే ఉన్నారు. వనిత పెళ్లయ్యి వెళ్లేనాటికి అత్తగారు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెను వనితే తల్లిలా చూసుకుంది. అత్తగారికి వనిత పట్ల అమితమైన ప్రేమ ఏర్పడింది. ఒకరోజు "ఏమే పిచ్చితల్లీ! నీ భర్తను గుడ్డిగా నమ్మకు. వాడికి వాళ్ల వదిన తన చెల్లిల్ని ఇచ్చి పెళ్లి చేయాలని చూసింది. ఆ అమ్మాయి కూడా వీడికిమల్లే బొమ్మలు వేస్తుంది. కానీ వీడు నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పి, చేసుకోలేదు. కానీ ఆ అమ్మాయి వీడితో సన్నిహితంగా మెలగడం నేను చూశాను. నువ్వు వాడిని ఓ కంట కనిపెట్టు" అని చెప్పింది. "వరుణ్ అలాంటివాడు కాదు. అలాంటి ఉద్దేశ్యం ఉంటే, నన్నెందుకు చేసుకుంటాడు. మేమిద్దరం ఒకరికోసం ఒకరం ఇన్నేళ్లు ఆగామంటేనే నీకు అర్థంకావడం లేదా మా ప్రేమ ఎంత గొప్పదో?" అంది వనిత. "నీకు వాడిపై అంత నమ్మకం ఉంటే మంచిదే. కానీ ఆడవాళ్లం పిచ్చిగా మగవాళ్లను నమ్మేస్తాం. వాళ్లు నమ్మించి గొంతులు కోస్తారు. జాగ్రత్త అని చెప్తుంది.. ఎందుకో విను. నీ గురించి నా బెంగ!" అంది అత్తగారు. అత్తగారు కొడుకు తనవాడైనా, కోడల్ని నన్నే మెచ్చుకుంటుందని మురిసిపోయింది. ఆమె మరణించేవరకూ ఎంతో బాగా చూసుకుంది వనిత. అత్త మరణించాక ఇంట్లో పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి.

వనిత మామగారు నోటికి ఏ మాట పడితే ఆ మాట. ఆ మాట అనేదేనా? కాదా అనే ఆలోచన లేకుండా ఎలా పడితే అలా వరుణ్ సమక్షంలోనే మాట్లాడుతున్నారు. ఆ మాటలకు వింటుంటే వనితకు ఒళ్లు మండిపోతుంది. అయినా వరుణ్ కూడా అక్కడే ఉన్నాడుగా మాట్లాడతాడులే అని తమాయించుకుంటోంది. కానీ వరుణ్ కూడా మౌనంగా ఉండటంతో ఆమెకు ఆశ్చర్యం, దుఃఖం రెండూ వచ్చాయి. పదే పదే అలాగే జరుగుతుంటే ఒకరోజు వరుణ్‌ను నిలదీసింది. "మా నాన్నకు నేను చిన్నప్పటి నుంచి ఎదురు చెప్పలేదు. మా అమ్మ, మేమూ అందరం పడ్డాం.. పడుతున్నాం. నువ్వు కూడా పడు. లేకపోతే నేను చేయగలిగింది ఏమీ లేదు" అన్నాడు. దాంతో "నన్ను పెళ్లి చేసుకుంది ఇందుకేనా? ఈ ఇంట్లో నేను ఉండను. వేరు కాపురం పెడదాం. నాకేమీ అత్తమామల్ని చూడకూడదనేది లేదు. అత్తయ్యను చూడలేదా? నీ కోసం, నీ కుటుంబం కోసం నా ఉద్యోగం కూడా వదులుకున్నాను." అంది వనిత. అతను ఏమీ సమాధానం చెప్పలేదు. అతను వెళ్లగానే మళ్లీ మామా కోడళ్లు గొడవపడ్డారు. కొత్తల్లో బాగున్న ఆడపడుచులూ తండ్రితో ఏకమై ఆమెను కొట్టేందుకు వచ్చారు. దాంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఈ పరిస్థితుల్లో ఆమె 'ఐద్వా అదాలత్'కు వచ్చింది.

**వనిత:** మేము ఇన్నేళ్లు ప్రేమించుకున్నాం. వాళ్ల నాన్న అలా అంటుంటే, అతను ఎందుకు మాట్లాడడు? నాకు అతను కావాలి. కానీ వాళ్లింట్లో మాత్రం నేను ఉండను. వాళ్ల కోసం నా ఉద్యోగం కూడా వదులుకున్నా.

బాధ్యులు అతని లేఖ పంపారు. కానీ అతనివైపు స్పందనలేదు. ఫోన్ చేశారు.

**వరుణ్:** నేను పరువుకు ప్రాధాన్యం ఇచ్చేవాడిని. మా ఇంటి పరిస్థితులు కొత్తగా ఆమెకు తెలియడం కాదు. మొదటి నుంచి తెలుసు. మా నాన్న బాగా పెద్దవాడైపోయారు. మా అన్నయ్య, వదిన వాళ్లు చూడరు. వాళ్లు వేరే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ఆయన్ను వదిలేసి, నేను బయటికి ఎలా వస్తాను? ఆయన అనే మాటలు పట్టించుకోవద్దంటే, ఆమె తగ్గదు. ఇద్దరూ ఎవరిష్టానుసారం వాళ్లు అనుకుంటుంటే ఎవరు మాత్రం ఏం చేయగలరు? పైగా నన్ను అనుమానిస్తుంది.. పుట్టింటికి వెళ్లి సంవత్సరం దాటిపోయింది. నేనూ ఏం చేయలేను.

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220



**బాధ్యులు ఏమన్నారంటే?**

"చూడు వనిత! మీ అత్తగారి కుటుంబం గురించి అవగాహన ఉండబట్టే మీ తల్లిదండ్రులు మీ పెళ్లికి అభ్యంతరం చెప్పారు. అయినవాళ్లల్లో, అన్ని తెలిసిన వాళ్లల్లో అనుభవం, అవగాహనతోనే మీ నాన్నగారు అభ్యంతరం చెప్పారు. నువ్వు వినలేదు. అది నీ మొదటి తప్పు. అదీ ఎటూ కాని వయసులో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. పోనీ మీ ఇద్దరి మధ్య సఖ్యత ఉందా? అంటే... అదీ లేదు. మీ మామగారి విషయంలోనే మీ ఇద్దరి మధ్య తగువైనా, అతను వాళ్ల నాన్న ముందు మాట్లాడలేని నిస్సహాయుడు. ఆ పరిస్థితి నువ్వే అర్థంచేసుకోవాలి. నీ ఉద్యోగం మానుకోవడం నీవు చేసిన రెండో తప్పు. ఇప్పుడు అతను రాలేడని తెలిసి, పుట్టింటికి వచ్చేశావు అది మూడో తప్పు. అతని వైపు నుంచి ఆలోచిస్తే.. నువ్వా, తండ్రా అన్న విషయమొస్తే, తండ్రికే ప్రాధాన్యత ఇస్తాడు. అది అతని బాధ్యత. అయితే ఈ సమస్య పరిష్కారం లేదా అంటే? ఉంది. అయితే, అతను కూడా వాళ్లనాన్నను తిట్టమనో, కొట్టమనో కాదు. మెల్లగా నువ్వు ఎలా బాధపడుతున్నావో చెప్పాలి. నువ్వు కూడా మీ మామగారి స్థాయిలో వెంటనే రియాక్టు కావొద్దు. దానివల్ల సమస్య పరిష్కారం కాకపోగా పెద్దదవుతుంది. ఈ పరిస్థితుల్లో అతనేం జోక్యం చేసుకుంటాడు? దీనికి తోడు నీకు ఎలాంటి అనుమానం కలగని, మీ అత్తగారి మాట పట్టుకుని, అతన్ని అనుమానించి, పుట్టింటికి వచ్చేయడం వల్ల మీ మధ్య దూరం పెరుగుతుంది. నీవూ అతనూ ఒకటిగా ఉంటే, ఎవరూ ఏం చేయలేరు. నీలో మార్పు రావాలి. వరుణ్! నీవు కూడా నీ భార్య బాధను అర్థంచేసుకోవాలి. ఆమె వెంటనే రియాక్టు కాకుండా ఆపి, మీ నాన్నగారు పదే పదే ఆమెను దూషించకుండా నచ్చజెప్పాలి. మీరు ఎవరికీ చెప్పకుండా తప్పించుకోవడం మీ బాధ్యతలేని తనమే. ఆయనకు మొదటి నుంచి అలా అడ్డుకునేవారు లేకపోవడం కూడా అలా మాట్లాడేలా చేస్తుంది. మీరూ, మీ కుటుంబసభ్యులంతా కూర్చొని ఒక మాట మీద ఉండాలి. ఆయన అలా మాట్లాడితే కలిగే, కలిగిన పర్యవసానాలు ఆయనకు అర్థమయ్యేలా చెప్పాలి. ఆయన మీ మాట వినరనుకుంటే వినేవారితో చెప్పించాలి. నిన్ను మీ భార్య అనుమానించడం కాదు. అది మీ అమ్మగారే ఆమెకు చెప్పిన విషయం. ఇవన్నీ నిరూపించుకోవాల్సింది, ఆమెకు నమ్మకం కలిగించాల్సింది మీరు. అన్నేళ్ల మీ ప్రేమ మీ మధ్య దూరం పెంచడానికి కాదు, మరింత దగ్గర చేయాలి. అంతేగానీ, బాధ్యతలేనితనంగా మీ ప్రవర్తన ఉండకూడదు. ఇప్పటికైనా ఆమెకు నచ్చజెప్పి, ఇంటికి తీసికెళ్లండి. ఆమెను అర్జంటుగా ఉద్యోగంలో చేరనివ్వండి. తను డ్యూటీలో ఉంటే, మామ,కోడళ్లు ఎదురుపడే సమయం అట్టే ఉండదు.

**ఆమెకు నమ్మకం కలిగించాల్సింది మీరు. అన్నేళ్ల మీ ప్రేమ మీ మధ్య దూరం పెంచడానికి కాదు, మరింత దగ్గర చేయాలి. అంతేగానీ, బాధ్యతలేనితనంగా మీ ప్రవర్తన ఉండకూడదు.**

వనిత తన పొరపాట్లు తెలుసుకుంది. బాధ్యులు చెప్పినట్లు మెలుగుతానంది. వరుణ్ కూడా బాధ్యులు చెప్పిన దానికి అంగీకరించాడు. ప్రస్తుతం తండ్రి ఆరోగ్యం బాగోవడం లేదని, ఒకరోజు వీలుచూసుకుని ఇద్దరూ కలిసి వస్తామని వరుణ్ భాధ్యులకు ఫోన్‌లో చెప్పాడు.

- శాంతిశ్రీ

**మీ కోసం**

**చపాతిపిండి పీటకు అతుక్కొని రాకపోతే రెండు నిమిషాలపాటు ఆ పీటని ఫ్రిజ్‌లో పెడితే సులభంగా వస్తుంది.**



**జీవన సౌరభం**

**ఓటమి ఎరుగని వ్యక్తి కన్నా విలువలతో జీవించే వ్యక్తి గొప్పవాడు.**

**సైకాలజీ**

**మా అన్నకోసం పెళ్ళి సంబంధాలు చూసేటపుడు ఒక సంబంధం వచ్చింది. అమ్మాయి చాలా లావుగా ఉందని అన్న ససేమిరా నాకు ఆ సంబంధం వద్దని మొండికేశాడు. ఆమె లావుగా ఉన్న కారణంగా చాలా సంబంధాలు చెడిపోయాయని నాకు తెలిసింది. లావుగా ఉండటం తన తప్పుకాదుగా అని నేనే ఆమెను పెళ్లి చేసుకున్నా. పెళ్లైన రోజు నుంచి నాకు నరకం చూపిస్తుంది. నన్ను మీ కుటుంబం ముందు వద్దనుకున్నారుగా! అంటూ చాలా దెప్పిపొడుస్తుంది. ఒక్కొక్కసారి ఆ రోజు అనవసరంగా ఆమెపై జాలిపడి తప్పు చేశానేమోననిపిస్తుంది. ఆమెను ఎలా మార్చాలో అర్థం కావడం లేదు సలహా ఇవ్వగలరా?**

## అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి



మీరు ఆమె పరంగా ఆలోచించి, ఆమె భావాలను అర్థం చేసుకుని మీ అంతట మీరుగా ఆమెను వివాహం చేసుకున్నట్లు మీ ఉత్తరం తెలియజేస్తుంది. అయితే అనేకసార్లు ఇతరుల నుంచి ఆమె తిరస్కృతిని ఎదుర్కొంది. ఆమెను తిరస్కరించిన వారిలో మీ కుటుంబం కూడా ఉన్నది. కాబట్టి ఆమె పెంచుకున్న వ్యతిరేక భావం ఎదురుగా కనిపించే మీ కుటుంబంపై ప్రదర్శిస్తూ ఉండవచ్చు. ఏ అవగాహనతోనైతే మీరు ఆమెను పెళ్లి చేసుకున్నారో ప్రస్తుతం ఆమెలోనున్న ఉద్వేగస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి. తనని మీరు అర్థం చేసుకున్నారని, తనని సంపూర్ణంగా అంగీకరించి పెళ్లి చేసుకున్నారని తనకు అర్థమయ్యేలా చెప్పండి. గతాన్ని మరిచిపోయి వర్తమానం గురించి ఆలోచించేలా చేయండి. మీకు ఇప్పుడు ఒక కుటుంబం ఏర్పడిందని మీ ఇద్దరికీ సంబంధించిన భవిష్యత్తు గురించి ఆలోచిస్తే ఇద్దరం సంతోషంగా ఉంటామనే భావాన్ని ఆమెలో పెంపొందించే ప్రయత్నం చేయండి. ఆమె ఎంత ప్రతికూలంగా వ్యవహరించినా.. కొంతకాలంపాటు మీరు సానుకూలంగా మాట్లాడి ఆమెలో మార్పు వస్తుందేమో ఎదురుచూడండి. అలా మార్పు రాకపోతే తప్పనిసరిగా ఇద్దరూ కలిసి మానసికనిపుణుల సహాయం తీసుకొని, ఇద్దరి మధ్యా అవగాహనను పటిష్టం చేసుకొనే ప్రయత్నం చేయండి.




డా. పద్మజ, సైకాలజిస్టు

## రమణుల రంగవల్లి



పి.పల్లవి
కత్తెరవీధి, శ్రీకాకుళం




21 చుక్కలు
11వచ్చేవరకు
మధ్యచుక్క



కె.కవిత
యం.జి.నగర్
హైదరాబాద్




39 చుక్కలు
13 సార్లుపెట్టి
13 వచ్చేవరకు






వినీల
లింగాలగ్రామం
కర్నూలు

24 చుక్కలు
8 వరుసలు
8 వచ్చేవరకు
సరిచుక్క







పి. స్వప్న
హిందూపురం
అనంతపురం జిల్లా

బహుమతి పొందిన ముగ్గు

17 చుక్కలు
17 వరుసలు



మా చిరునామా:
జీవన,'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

సెన్సెక్స్ ⬆ 184
34,153

నిఫ్టీ ⬆ 54
10,558

రూపాయి ⬆ 04 పై.
అమెరికా డాలరుకు రూ.
63.37



ఇఇఎస్‌ఐఎల్‌కు అవార్డు..

ఎనర్జీ ఎఫిసియేన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్‌ఎల్)కు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సిబిఐపి)-2018 అవార్డు లభించింది. ఇంధన సామర్థ్యంలో వరుసగా రెండో సారి తమకు ఈ ప్రశంస దక్కిందని ఇఇఎస్‌ఐఎల్ తెలిపింది. ఈ అవార్డును విద్యుత్ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా ఆ కంపెనీ సిజిఎం భవన్‌జీత్ సింగ్‌కు అందజేశారు.

## వృద్ధి రేటు 6.5 శాతమే..!

### సిఎస్‌ఒఅంచనాఅప్రభుత్వానికి తలనొప్పే

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కానుందని స్వయంగా కేంద్ర గణంకాల శాఖ (సిఎస్‌ఒ) అంచనా వేసింది. 2013-14లో 6.4 శాతంగా చోటు చేసుకున్న వృద్ధి రేటు తర్వాత ఇదే అత్యల్పం. 2016-17లో వృద్ధి రేటు 7.1 శాతంగా నమోదయ్యింది. వస్తు సేవల పన్ను అమల్లో నెలకొన్న సంక్లిష్టత వల్ల 2017-18లో భారత వృద్ధి రేటు 6.2 శాతం-6.5 శాతంగా చోటు చేసుకోనుందని ఇప్పటికే ప్రయివేటు ఆర్థికవేత్తలు పలు సార్లు అంచనా వేశారు. ఇదే తరహాలో శుక్రవారం సిఎస్‌ఒ అంచనాలు వెల్లడి కావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ ఇతర సేవలు 9.4 శాతం వృద్ధిని కనబర్చనున్నాయని సిఎస్‌ఒ అంచనా. వాణిజ్యం, హోటళ్లు, ట్రాన్స్‌పోర్టు, కమ్యూనికేషన్ సంబంధిత సేవలు 8.7 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చు. కాగా వ్యవసాయ రంగం 2.1 శాతం వృద్ధితో సరిపెట్టుకోనుంది. తయారీ రంగం 4.6 శాతానికి పరిమితం కానుందని సిఎస్‌ఒ అంచనా వేసింది. 2018-19 కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. తమ హయంలో దేశ వృద్ధి పరుగులు పెడుతుందన్న బిజెపి పాలకుల వరుస ప్రకటనలకు సిఎస్‌ఒ నివేదిక ప్రతికూలంగా రావడం విశేషం. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్టానికి పడిపోయే అవకాశాలు ఉన్నాయని రిపోర్టులు మోడీ ప్రభుత్వానికి తలనొప్పులు తీసుకురానుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## ఐఒబి 'రుణ రికవరీ' ధర్నా

**ప్రజాశక్తి - బిజినెస్‌బ్యూరో**

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు (ఐఒబి) నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించని రుణ గ్రహీతల ఆస్తుల ముందు ఆ బ్యాంకు అధికారులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రుణ ఎగవేతదారు టిసిఐ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ కార్యాలయం ముందు 'నేమ్ అండ్ షేర్' పేరుతో ఈ ఆందోళన చేశారు. టిసిఐ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ ముప్పనేని వెంకటేశ్ తమ బ్యాంకుకు రూ.26.45 కోట్లు చెల్లించాల్సి ఉందని ఐఒబి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఒబి చీఫ్ రీజినల్ మేనేజర్ శివ కుమార్ చతుర్వేది, అసిస్టెంట్ జిఎం ఇ లచ్చయ్య, ఆదర్శ్ నగర్ బ్రాంచీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి రామమూర్తి, బషీర్‌బాగ్ శాఖ చీఫ్ మేనేజర్ యం వహీదుల్లా, ఇతర అధికారులు కలిసి ఈ ధర్నా చేశారు.

## జట్టు కట్టిన ఎయిర్‌టెల్, ఐటెల్



**న్యూఢిల్లీ:** అ జియో రాకతో టెలికం కంపెనీలు చౌక మొబైల్స్‌పై దృష్టి పెట్టాయి. ఇదే క్రమంలో శుక్రవారం ఎయిర్‌టెల్-ఐటెల్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఐటెల్ ఎ40, ఐటెల్ ఎ41 స్మార్ట్‌ఫోన్లపై ఎయిర్‌టెల్ మూడేండ్ల కాలానికి రూ.1,500 క్యాష్ బ్యాక్‌ను అందించనుంది. ఈ రెండు ఫోన్లకు రూ.169తో నెలవారి రీఛార్జ్ ప్యాక్ చేయించుకోవాల్సి ఉంటుందని ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐటెల్ ఏ40 ధర రూ.4,599, ఎ41 ధర రూ.4,699గా ఉంది. అయితే రూ.169తో ప్రతి నెలా రీచార్జ్ చేసుకుంటే 36 నెలల తర్వాత రూ.1,500 క్యాష్‌బ్యాక్ లభించనుంది.

## రూ.135 పెరిగిన బంగారం

**న్యూఢిల్లీఆ** ఇంతక్రితం సెషన్‌లో స్వల్పంగా తగ్గిన బంగారం ధర శుక్రవారం తిరిగి పుంజుకుంది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు స్థానిక వర్తకుల నుంచి పసిడికి డిమండ్ నెలకొనడంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాములు బంగారంపై రూ.135 పెరిగి వరుసగా రూ.30,500, రూ.30,350గా పలికింది. కాగా కిలో వెండిపై రూ.360 తగ్గి రూ.40వేలుగా నమోదయ్యింది.

# డిజిటల్ ప్రకటనల హోరు

- రూ.7500 కోట్ల విలువ
- 2015తో పోల్చితే 40 శాతం వృద్ధి
- మొబైల్ నెట్ వాడకంతో దూకుడు
- పలు రిపోర్టుల వెల్లడి

**ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్**

దేశంలో ఇంటర్నెట్ వినియోగం విరివిగా పెరిగిపోవడంతో డిజిటల్ ప్రకటనలు కూడా దూసుకు వస్తున్నాయి. గతేడాది ఈ ప్రకటనల విలువ భారీ స్థాయిలో పెరిగింది. 2017 దీపావళి పండుగ సమయం కంటే ముందు నుంచి ఆన్‌లైన్ ప్రకటనలు అనుహ్యంగా పెరిగాయని పలు రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫాంలపై ప్రకటనలు 36 శాతం మేర పెరిగాయని ఆడ్‌బై వెంచర్స్ సహ వ్యవస్థాపకులు సౌరవ్ పట్నాయక్ తెలిపారు.

ప్రస్తుత ఏడాదిలో వీటి విలువ రూ.7,500 కోట్లకు చేరనుందని డిజిటల్ ఇన్‌ఫ్యూజన్ డైరెక్టర్ నితిన్ చౌదరీ అంచనా వేశారు. దేశంలోని మొత్తం ప్రకటనల్లో 14 శాతం డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ రంగం ఆక్రమించి ఉంది. కొత్త వినియోగదారులను ఆకర్షించడంలో ఇది కీలకంగా మారింది. గతేడాది ఈ పరిశ్రమ వంద కోట్ల డాలర్ల మైలురాయిని దాటిందని ఐఎంఆర్‌బి కంటర్, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచాన వేసింది. భవిష్యత్తులో ఈ ప్రకటనలు మరింత జోరును ప్రదర్శించనున్నాయని బిజినెస్ లైన్ ఒక కథనం ప్రచురించింది. భారత్‌లో దాదాపుగా 53 కోట్ల మంది ఇంటర్నెట్‌ను కలిగి ఉన్నారని అంచనా. ఇందులో 46 శాతం మంది ఇంగ్లీష్‌ను, 54 శాతం మంది స్థానిక భాషలను ఉపయోగిస్తున్నారు.



**అత్యధిక వ్యయం..**

2016 ముగింపు నాటికి డిజిటల్ ప్రకటనల విలువ రూ.7300 కోట్లకు చేరింది. 2015 నాటి వ్యయంతో పోల్చితే 40 శాతం వృద్ధి చోటు చేసుకుంది. 2017 డిసెంబర్ నెలలో అత్యధికంగా గూగుల్, మారుతి సుజుకి, అమెజాన్ ప్రైమ్ సంస్థలు డిజిటల్ ప్రకటనలకు అత్యధికంగా ఖర్చు చేశాయని పట్నాయక్ తెలిపారు. ప్రకటనలు, పబ్లిషర్స్, ఏజెన్సీలకు సంబంధించిన డేటా రిపోర్టులను యాడ్‌బై సమీకరిస్తుంది. ఈ సంస్థ బయోసైన్సెస్, ఇజ్రాయిల్ టెక్నలాజీ కంపెనీ టెక్నలాజీని ఉపయోగించుకుంటుంది. డెస్క్‌టాప్, మొబైల్, వీడియోస్ వేదకల్లోని ప్రకటనలను విశ్లేషిస్తుంది. గత నెలలో గూగుల్ అత్యపెద్ద డిజిటల్ ప్రకటనదారుగా నిలిచింది. ఈ కంపెనీ క్లౌడ్ సేవలకు సంబంధించిన జి సూట్‌ను ప్రచారం చేసింది. అదే విధంగా గూగుల్ రూపొందించిన ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ పిక్సల్2ను ప్రమోట్ చేసింది. కాగా అమెజాన్ అత్యధికంగా ప్రైమ్ వీడియోస్‌కు వ్యయం చేసిందని యాడ్‌బై డాటా తెలిపింది. మారుతి సుజుకి తన డిజైర్, సెలెరియో ఎక్స్ సెడన్ కార్ల ప్రచారాన్ని ఎక్కువగా నిర్వహించింది.

### మొబైల్ వేదిక..

ప్రకటనలకు మొబైల్ రంగం భిన్నమైన వేదికగా అవతరించింది. ఈ సెగ్మెంట్ డిజిటల్ ప్రకటనల్లో ఆస్ట్రేలియా టూరిజం అగ్రస్థానంలో నిలిచిందని యాడ్‌బై పేర్కొంది. అదే విధంగా అమెజాన్ రెండో స్థానంలో ఉంది. మూడు స్థానంలో అత్యధికంగా డ్రీమ్11, ఫాంటసీ క్రికెట్ గేమ్స్ ప్రకటనలు ఎక్కువగా వచ్చాయి. ఇతర దేశాల డిజిటల్ ప్రకటనలతో పోల్చితే అమెరికా తర్వాత భారత్ నిలిచింది. ఇమార్కెటర్స్ రిపోర్టు ప్రకారం 2018లో అమెరికాలో డిజిటల్ డిస్‌ప్లే యాడ్స్ విలువ 48 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. భారత్‌లో 2017 తొలి త్రైమాసికం వీడియో ప్రకటనల్లో 60 శాతం పెరుగుదల ఉందని ఇన్‌మొబి రిపోర్టు పేర్కొంది. డిజిటల్ ప్రకటనల కోసం ప్రతీ రోజు 2.5 క్వింటాలియన్ బైట్ల డేటా ఖర్చు అవుతుందని అంచనా. ఈమెయిల్స్, వీడియోస్, ఇమేజెస్, ట్వీట్స్, కాంటెంట్, డిజిటల్ అడ్వర్టయిజింగ్ కోసం ఈ మొత్తం డేటాను వాడేస్తున్నారు. ఈ వాడకం భవిష్యత్తులో కొత్త శిఖరాలకు చేరనుంది. సిఐఐ, కెపిఎంజి రిపోర్టు ప్రకారం 2020 నాటికి భారత డిజిటల్ ప్రకటనల విలువ రూ.25వేల కోట్ల (4బిలియన్ డాలర్ల)కు చేరనుంది. డిజిటల్ ప్రకటనల్లో ఇంటర్నెట్, సోషల్ మీడియా, ప్రొగ్రమెటిక్ అడ్వర్టయిజింగ్ కీలక పాత్రను పోశించనున్నాయని విశ్లేషించింది.

## ఐరన్ మౌంటెన్ చేతికి ఒఇసి రికార్డ్స్

**హైదరాబాద్ :** రికార్డుల నిర్వహణ, ఇమేజింగ్ సేవలు, మీడియాకు చెందిన ఆఫ్‌సైట్ స్టోరేజీని అందించే ఒఇసి రికార్డు మేనేజ్‌మెంట్‌ను నిల్వ, సమాచార నిర్వహణ సేవల సంస్థ ఐరన్ మౌంటెన్ సొంతం చేసుకున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో భారత్‌లో తమ ఉనికిని విస్తరించుకున్నట్లయ్యిందని ఐరన్ మౌంటెన్ ఇండియా ఎండి హితేష్ గుప్తా పేర్కొన్నారు. దీంతో భారత్‌లో 15 ప్రాంతాల్లో 73 సదుపాయాలతో కూడిన నెట్‌వర్క్‌కు చేరినట్లయ్యిందన్నారు. 2600 మందికి పైగా వినియోగదారులకు చెందిన రికార్డులను డెలివరీ చేయడంతో పాటుగా సమాచార నిర్వహణ, డేటా మేనేజ్‌మెంట్ అందించనున్నామన్నారు. ఈ మొత్తం విలువ 18 మిలియన్ డాలర్లుగా ఉంటుందన్నారు.

## కొత్త రికార్డులకు మార్కెట్లు

**ముంబయి :** అంతర్జాతీయ సానుకూల పరిణామాలకు తోడు ఎఫ్ఐఐలు తరలిరావడంతో వారంతంలో దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన రికార్డులకు చేరాయి. కన్సూమర్ డ్యూరెబుల్స్, టెక్, రియాల్టీ సూచీల కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 184.21 పాయింట్లు లేదా 0.54 శాతం పెరిగి 34,153.85 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 54 పాయింట్లు రాణించి 10,558.85 వద్ద నమోదయ్యింది. బిఎస్ఇలో రంగాల వారిగా కన్సూమర్ డ్యూరెబుల్స్ 1.25 శాతం, టెక్ 0.89 శాతం, రియాల్టీ 0.75 శాతం, ఎఫ్ఎంసిజి 0.74 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఆయిల్ అండ్ గ్యాస్ 0.39 శాతం, పిఎస్‌యు 0.24 శాతం చొప్పున తగ్గాయి.

టెట్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

విద్య

# వస్తూత్పత్తి విధానంలో వచ్చిన మార్పులు



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

**1. సబ్ కాంట్రాక్ట్ పద్ధతి**

1500 -1800 మధ్య వ్యాపార రంగం వృద్ధి చెందడంతో ఈ విధానం వాడుకలోకి వచ్చింది.

✧ యూరోపియన్ వర్తకులు చేతివృత్తుల వారికి చిన్న రైతులకు ముడి సరుకులిచ్చి ముందుగానే చెల్లింపులు చేసేవారు.
✧ ఉదాహరణకు ఇంగ్లాండులోని ఒక వస్త్రవ్యాపారి వస్త్రాలను సబ్‌కాంట్రాక్టింగ్ విధానంలో ఈ విధంగా తయారు చేస్తారు.
✧ ముడినూలును సరఫరాదారుని నుంచి కొనుగోలు చేసి నూలు వడికే వారి వద్దకు తీసుకెళ్లి దారంగా మార్చుతారు.
✧ తర్వాత దాన్ని నేతపనివారి వద్దకు తీసుకెళ్లి వస్త్రంగా మార్చుతారు.
✧ తర్వాత వస్త్రాన్ని శుభ్రపరిచే పుల్లర్స్ వద్దకు, చివరికి వస్త్రానికి రంగులు అద్దడంతో వస్త్రతయారీ పూర్తి చేస్తారు.
✧ ఈ దశలన్నీ దేశంలో వివిధ ప్రదేశాలలో జరుగుతాయి. అమ్మే ముందు తుదిపని లండన్‌లో జరుగుతుంది.

**2. కర్మాగారాల వద్ద ఉత్పత్తి**

తర్వాత కాలంలో సబ్‌కాంట్రాక్ట్ పద్ధతి స్థానంలో కర్మాగారాల వద్ద ఉత్పత్తి పద్ధతి వాడుకలోకి వచ్చింది. ఈ పద్ధతి ముఖ్యలక్షణాలు.

✧ వ్యాపారి చేతివృత్తుల వారి వద్దకు వెళ్లకుండా వారినే ఒక చోటుకు రప్పిస్తాడు.
✧ వస్తూత్పత్తి దశలన్నీ ఒకే చోట జరుగుతాయి.
✧ ఈ విధంగా ఏర్పాటు చేసిన పనికేంద్రాలను కర్మాగారాలు అంటారు.
✧ ఈ దశను పూర్వ పారిశ్రామికాభివృద్ధి దశ అంటారు.

**★ ఉత్పత్తిలో ఫ్యాక్టరీ విధానం**

1750-1850 మధ్య ఫ్యాక్టరీ విధానం అనే కొత్త పద్ధతి వాడుకలోకి వచ్చింది.

✧ సాధారణ పనిముట్లు మానవ శ్రామిక శక్తిస్థానంలో కొత్తయంత్రాలు, ఆవిరిశక్తి వాడకం పెరిగింది. ఉత్పత్తి జరిగే ప్రదేశం ఇండ్ల నుంచి ఫ్యాక్టరీల వద్దకు మారింది.
✧ వందల మంది శ్రామికులను ఫ్యాక్టరీల వద్దకు తరలించే యంత్రాల సాయంతో భారీ స్థాయిలో వస్తువులను ఉత్పత్తి సాధించేవారు.
✧ ఫ్యాక్టరీ ముడిపదార్థాలు తయారైన వస్తువులపై పెట్టుబడిదారులకే పూర్తి అధికారముంటుంది. వర్తక శ్రేణుల విధానంలో కాకుండా శ్రామికులు జీతం కోసం పనిచేస్తారు. ఉత్పత్తితో వారికి సంబంధం లేదు.

ఫారిన్‌లోనే ఎందుకు

✧ ఆధునిక పారిశ్రామికీకరణ చవిచూసిన మొదటి దేశం బ్రిటన్. ఉత్పత్తిలో గణనీయ మార్పులు సాధించి 'ప్రపంచ కర్మాగారం'గా పేరుగడించింది.

**★ ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం విజయవంతమవ్వడానికి కారణమైన అంశాలు**


ఎ. 17వ శతాబ్దంలో ఇంగ్లాండు, వేల్స్, స్కాట్‌లాండ్‌లు ఏకీకృతమవ్వడం.
బి. బ్రిటన్ వాతావరణం వస్త్ర పరిశ్రమకు అనుకూలం.
సి. జలశక్తి, ముడి ఇనుము, నేలబొగ్గు పుష్కలంగా లభించడం
డి. భారీ పెట్టుబడులు అందుబాటులో ఉండటం
ఇ. జలరవాణాకు అనుకూలం
ఎఫ్. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల మార్పిడి వల్ల వ్యవసాయ రంగం వృద్ధి చెందడం.
జి. కంచెలు వేసిన ఉద్యమాల ఫలితంగా వ్యవసాయ కూలీలు పరిశ్రమలలో పనిచేయడానికి వలస వెళ్లడం.

✧ ఇనుము, బొగ్గు, వస్త్ర పరిశ్రమల ఆధారంగా బ్రిటన్ రూపొందించిన నాగరికతను ఆ తరువాత ప్రపంచమంతా అనుకరించినదని 'ఫిషర్' ప్రశంసించాడు.
✧ 17వ శతాబ్దం నుంచి ఇంగ్లాండు ఇతరదేశాలతో వాణిజ్యానికి పేరుగాంచింది.
✧ లండన్ విత్త మార్కెట్, ఉమ్మడి స్టాక్ బ్యాంకులు, ఉమ్మడి స్టాక్ కార్పొరేషన్ ఏర్పడటం వల్ల ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం తేలికయ్యింది.
✧ ఉత్పత్తి యంత్రాలు కనుగొనడంలో విజయవంతమైన స్కాట్ ఇంగ్లీష్ వ్యక్తులుండటం ఇంగ్లాండు అదృష్టంగా భావించాలి.

**★ జర్మనీ, ఫ్రాన్స్‌లలో పారిశ్రామికీకరణ**

పారిశ్రామికీకరణ 18వ శతాబ్ధంలో మొదట ఇంగ్లాండులో ప్రారంభమైంది.

✧ జర్మనీ, ఫ్రాన్స్‌లలో 1850, 1870 నాటికిగాని పారిశ్రామిక ఉత్పత్తి ప్రాధాన్యత సంతరించుకోలేదు.
✧ సైలీషియా, రైన్‌లాండ్, రూర్‌లోయ బొగ్గు గనులు, బోహీమియాలోని ఇనుప నిల్వలతో ప్రష్యాలో ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందినది.



✧ 1870 నాటికి జర్మనీ ఏకీకరణ చెందకపోవడం, ఫ్రాన్స్ విప్లవాలతో అల్లకల్లోలంగా ఉండటంతో పారిశ్రామికాభివృద్ధి ఆలస్యమైంది.
✧ ఇంగ్లాండుకు వలసలుండగా, జర్మనీ ఫ్రాన్స్‌లకు వలసలు లేవు.
✧ 1810లో ఎస్సెన్‌లో ఆల్ఫ్రెడ్ క్రుప్ ప్రారంభించిన ఒక చిన్న ఇనుము బట్టీ 1870 నాటికి పెద్ద కర్మాగారంగా మారింది. వీరు రైలు పెట్టెలు, ఆయుధ తయారీ చేసేవారు.
✧ ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ కర్మాగారం క్రుప్ కుటుంబం స్థాపించింది.
✧ 1887 నాటికి నలభై ఆరు దేశాలకు ఆయుధాలు సరఫరా చేశారు.
✧ మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఫిరంగి దళానికి క్రుప్ కర్మాగారాలు ఫిరంగులు తయారు చేశాయి.
✧ 1933లో జర్మనీలో జరిగిన సాధారణ ఎన్నికలలో క్రుప్ కుటుంబం హిట్లర్‌కి మద్దతు ఇచ్చింది.
✧ జర్మనీ ఇతర దేశాలను ఆక్రమించుకోడంతో కొత్త భూములను ఆల్ఫ్రెడ్ క్రుప్ చేజిక్కించుకున్నాడు.
✧ నాజీ శిబిరాలలోని బానిసలను కార్మికులుగా పనిచేయించుకునేవారు.
✧ 1866లో వెర్నర్ సీమెన్స్ విద్యుత్ డైనమో కనుగొనడంతో జర్మనీ విద్యుత్ పరిశ్రమలలో అగ్రగామిగా నిలిచింది.
✧ 1870లో ఫ్రాన్స్ ఓడిపోయి 1871లో సమైక్య జర్మనీ ఏర్పడటంతో జర్మనీలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకుంది.
✧ ఫ్రాన్స్ నుంచి జర్మనీ స్వాధీనం చేసుకున్న లోరైన్ గనులు జర్మనీ పరిశ్రమకు లభించాయి.
✧ 20వ శతాబ్దం నాటికి జర్మనీ, ఇంగ్లాండును పారిశ్రామికంగా సవాలుచేసే స్థాయికి చేరుకుంది.
✧ కానీ ఫ్రాన్స్‌లో యాంత్రీకరణ నిదానంగా సాగింది. 1860 తర్వాత ఫ్రాన్స్‌లో రైలు, రోడ్డు మార్గాలు విస్తరణ చెందడంతో పారిశ్రామికీకరణ వేగవంతమైంది.
✧ కానీ ఫ్రాన్స్‌లో అప్పులు ఇవ్వగల పెద్ద బ్యాంకులు స్థాపించకపోవడం ఒక లోపం. ★

## తెలుసుకోండి మీ నాలెడ్జ్

**1. కనిగిరి మండలంలోని శంఖరం గ్రామం ఏ జిల్లాలో ఉంది?**
ఎ. శ్రీకాకుళం బి. ప్రకాశం
సి. నెల్లూరు డి. పశ్చిమగోదావరి

**2. ఎరుకల తెగలోని పురుషులు సాధారణంగా చేసే పని ?**
ఎ. నేతపని బి. బట్టల తయారీ
సి. కుండల తయారీ డి. ఇనుప వస్తువుల తయారీ

**3. ఎరుకల తెగల స్త్రీల వారసత్వ సాంప్రదాయ వృత్తి ?**
ఎ. బట్టలకు రంగులు వేయడం
బి. భవిష్యత్ చెప్పడం
సి. వ్యవసాయ పనులు
డి. బుట్టల తయారీ

**4. ఎరుకల మాండలిక భాషలో ఈ భాషల పదాలుంటాయి ?**
ఎ. తెలుగు, ఒడియా, బెంగాలి
బి. తెలుగు, ఉర్దూ, కన్నడ
సి. తెలుగు, హిందీ, మరాఠీ
డి. తెలుగు, తమిళ, కన్నడ

**5. ధర్మవరంలో చేనేత కార్మికులు పట్టుచీరల తయారీలో అనుసరించే ప్రత్యేక విధానం ?**
ఎ. టై అండ్ డై బి. పేకదారాల లోముడి
సి. నవ్వారీ లాక్ డి. కలంకారీ డిజైన్లు

**6. పట్టుగూళ్ల నుంచి సేకరించిన పట్టుకు గల పేరు ?**
ఎ. సప్పూరి బి. కచ్చాపట్టు
సి. జరీపట్టు డి. పాలిష్‌డ్ పట్టు

**7. ఈ కింది వానిలో సరికాని దాన్ని గుర్తించండి?**
ఎ. పేక - అడ్డుదారాలు
బి. పడుగు - నిలువుదారాలు
సి. జాకార్డ్ కార్డు - రంగులు అద్దడానికి ఉపయోగించేవి
డి. కచ్చాపట్టు - ముడి పట్టు

**8. చేనేత కార్మికులకు ఈ కాలంలో నేత నేయడం కష్టంగా ఉంటుంది ?**
ఎ. జనవరి - మార్చి బి. మార్చి - మే
సి. జూన్ - ఆగస్టు డి. నవంబర్ - ఆగస్టు

**9. చేనేత కార్మికులకు ముడి పదార్థాలు సరఫరా చేసి పట్టుచీరలను నేయించే పెట్టుబడిదారులకు ఉన్న పేరు ?**
ఎ. మాస్టర్ ట్రైనర్ బి. మాస్టర్ వీవర్
సి. మాస్టర్ వర్కర్ డి. మాస్టర్ డిజైనర్

**10. పట్టుచీరల నేతకు ప్రసిద్ధి చెందిన ధర్మవరం ఈ జిల్లాలో ఉంది ?**
ఎ. ప్రకాశం బి. గుంటూరు
సి. ధర్మవరం డి. విజయనగరం

**11. కుండలు, పాత్రలు దీనితో తయారు చేస్తారు ?**
ఎ. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బి. పింగాణీ మట్టి
సి. బంకమట్టి డి. ఇసుక, సున్నం

**12. 1775లో జేమ్స్ వాట్ సోహ్రూ ఫౌండ్రీని ఎక్కడ స్థాపించారు ?**
ఎ. లండన్ బి. లాంక్‌షైర్
సి. బర్మింగ్‌హోం డి. ఫ్రాష్‌షైర్

**13. పక్కారోడ్లు తయారుచేసే విధానిన్న రూపొందించినది?**
ఎ. జాన్ మెక్‌డం బి. జేమ్స్ బిండ్లే
సి. జేమ్స్ స్టీవెన్‌సన్ డి. జేమ్స్‌వాట్

**14. ఇంగ్లాండులో కాలువలను మొదట దీని కోసం తవ్వారు?**
ఎ. బొగ్గు రవాణా బి. నీటి సరఫరా
సి. వ్యవసాయం డి. చేపల పరిశ్రమ

**15. మొదట ఇంగీషు కాలువ వర్సీ కాలువను 1716-72లో నిర్మించింది ?**
ఎ. జాన్‌మెక్‌డం బి. జేమ్స్ బిండ్లే
సి. స్టిఫెన్సన్ డి. మూడో డర్బీ

**16. ఇనుప బట్టీ కొలిమిలో అధిక ఉష్ణోగ్రతలు సాధించడానికి దీనిని ఉపయోగిస్తారు ?**
ఎ. పీట్ బి. బట్టీ బొగ్గు
సి. కోక్ డి. గాసోలీన్

**17. కోక్‌ను ఉపయోగించే బట్టీని కనుగొన్నది ?**
ఎ. మొదటి అబ్రహాం డర్బీ బి. రెండో డర్బీ
సి. మూడో డర్బీ డి. హెన్రీ కోర్ట్

**18. ఈ కిందివానిలో ఇనుము - ఉక్కు కర్మాగారాలకు సంబంధించి సరైన జతను కనుగొనుము ?**
ఎ. కలబోత బట్టీ - కరిగిన ఇనుములోని కలుషితాలు తొలగించవచ్చు
బి. రోలింగ్ మిల్లు - ఆవిరితో నడిచే యంత్రం ద్వారా కడ్డీలుగా ఇనుమును పోతపోయవచ్చు
సి. కోక్ బట్టీ - అధిక ఉష్ణోగ్రతలు సాధించవచ్చు
డి. పైవన్నీ

**19. 19వ శతాబ్దంలో వస్త్ర తయారీలో ప్రధాన సమస్య ?**
ఎ. నేత నేయడం బి. పత్తి పండించడం
సి. నూలు వడకడం డి. విదేశాలకు ఎగుమతి చేయడం

**20. కర్మాగారాలలో ఉపయోగపడే ఆవిరి యంత్రాన్ని కనుగొన్నది ?**
ఎ. జేమ్స్‌వాట్ బి. బౌల్డన్
సి. కార్టరైట్ డి. స్టీవెన్‌సన్

**21. సోహ్రూ ఫౌండ్రీని జేమ్స్‌వాట్ వీరి భాగస్వామ్యం ద్వారా ఏర్పాటు చేశాడు?**
ఎ. బౌల్డన్ బి. కార్ట్‌రైట్
సి. క్రూప్ డి. అబ్రహాం డర్బీ-1

**22. బొగ్గు నుంచి గంధకం వంటి కలుషిత పదార్థాలు తొలగించగా ఏర్పడేది ?**
ఎ. కోక్ బి. గాసోలీన్
సి. పీట్ డి. ఆంథ్రసైట్

**సమాధానాలు :** 1.బి, 2.బి, 3.బి, 4.డి, 5.బి, 6.బి, 7.సి, 8.బి, 9.బి, 10.సి, 11.సి, 12.సి, 13.ఎ, 14.ఎ, 15.బి, 16.సి, 17.ఎ, 18.డి, 19.సి, 20.ఎ, 21.ఎ, 22.ఎ.

## ఉద్యోగాలు

### నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌లో 41 పోస్టులు

**నో**యిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్).. 41 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టు పేరు :** మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ).
**వేతనశ్రేణి :** రూ.16,400-రూ.40,500.
**విభాగాల వారీ ఖాళీలు :** కెమికల్-25, మెకానికల్-10, ఎలక్ట్రికల్-6.
**అర్హతలు :** కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కుల (ఎస్సీ/ ఎస్టీలకు 50 శాతం)తో బీఈ/ బీటెక్‌తోపాటు సంబంధిత విభాగంలో గేట్-2016 క్వాలిఫై స్కోర్ కార్డ్.
**వయసు :** 2017, డిసెంబర్ 31 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
**ఎంపిక :** గేట్-2016 స్కోర్, ఇంటర్వ్యూ.
**దరఖాస్తు ఫీజు :** రూ.700, ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగ, వికలాంగులకు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు ఫీజు లేదు.
**దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్.
**దరఖాస్తు చివరి తేదీ :** జనవరి 18, 2018.
**పూర్తి వివరాలు :** వెబ్‌సైట్‌లో చూడొచ్చు
**వెబ్‌సైట్ :** www.nationalfertilizers.com

## 'విజ్ఞాన్ మహోత్సవ్' ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నూరు (గుంటూరు జిల్లా)

విద్యార్థులకు క్రీడా సంస్కృతిని నేర్పాలని అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఎపి వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అరికపూడి రమణారావు చెప్పారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలో విజ్ఞాన్ యూనివర్సిటీలో 'విజ్ఞాన్ మహోత్సవం-2018' సంబరాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆరికపూడి రామారావు మాట్లాడుతూ రిక్రియేషన్, టైమ్ పాస్, పోటీలు, ఇంటర్ స్కూల్ గేమ్స్‌గా క్రీడలను భావించాలని సూచించారు. మరో అతిథి ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రో బాల్, టెన్నికాయిట్, కబడ్డీతో పాటు ఇన్‌డోర్ గేమ్స్ చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నారు.



రాష్ట్ర స్థాయి బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ ఫేర్

### జాతీయ స్థాయికి 50 ప్రదర్శనలు ఎంపిక

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ చూపాలని మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ సూచించారు. రెండ్రోజులుగా జరుగుతోన్న రాష్ట్ర స్థాయి బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. రాష్ట్రస్థాయిలో ప్రదర్శించిన 184 నమూనాలలో 50 ప్రదర్శనలను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఈ ముగింపు సభకు మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ప్రాముఖ్యతను తెలుసుకుని మానవాళి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. 1977 తరువాత రెండో సారి రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ జిల్లాలో జరిగిందని తెలిపారు. తొలుత జ్యూరీ మెంబర్స్ విజేతలను నిర్ణయించేందుకు ప్రదర్శనలను పరిశీలించారు. ఎస్‌సిఇ ఆర్‌టి ప్రొఫెసర్లు వనజాక్షి, లక్ష్మి, ఐఎఎస్‌ఇ నెల్లూరు ప్రిన్సిపల్ మువ్వా రామలింగం సౌత్ ఇండియా సైన్స్ అబ్జర్వర్ దుర్గయ్య ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు. భోజన విరామానంతరం వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. మాజీ ఎంఎల్‌ఎ ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, జ్యూరీ మెంబర్ సివిఎస్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు తగిన సమయం ఇచ్చి ప్రతేడాదీ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో ఏడో తేదీన జరిగే ప్రదర్శనలకు హాజరు కావాలని సూచించారు.

## నాణ్యమైన మిర్చికి విదేశాల్లో గిరాకి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పురుగు మందుల అవశేషాల్లేని, నాణ్యమైన మిర్చికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆ దిశగా తమ ఉత్పత్తులను ఎగుమతి చేయాలని స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ పి.ఎస్.శ్రీకాంత్ తంపి కోరారు. గుంటూరులోని మిర్చి యార్డులో శుక్రవారం ఆయన మిర్చి ఎగుమతిదార్లతో సమావేశమయ్యారు. దేశంలో ఉత్పత్తవుతున్న మిర్చిలో 20 శాతం రాష్ట్రం నుంచి వస్తోందని చెప్పారు. మిర్చి ఎగుమతులు ప్రతి ఏడాది పెరుగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వానికి విదేశీ మారక ద్రవ్యం 20 శాతం మిర్చి ద్వారానే లభిస్తోందని తెలిపారు. మెక్సికో, అమెరికా, జర్మనీ తదితర దేశాలకూ గుంటూరు మిర్చి ఎగుమతికి అవకాశం ఉందన్నారు. జాతీయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇతర దేశాల్లో సేంద్రీయ పద్ధతిలోనే మిర్చి సాగవుతోందన్నారు. గుంటూరు మిర్చికి అన్ని దేశాల్లో డిమాండ్ ఉన్నా పురుగు మందుల వినియోగం ఉండకూడదని ఆయా దేశాలు కోరుకుంటున్నాయని చెప్పారు. యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ మిర్చి నాణ్యతపై రైతులకు తగిన శిక్షణిస్తామని, సాగు మెలకువలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని పేర్కొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగుల ఆందోళనలకు పూర్తి మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) ఉద్యోగుల ఆందోళనలకు సిఐటియు రాష్ట కమిటీ పూర్తి మద్దతు తెలిపింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎం ఎ గఫూర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 9న రాష్ట్రంలోని అన్ని పాత తాలూకా కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో పాల్గొనాలని జిల్లా కమిటీలకు పిలుపునిచ్చారు. 2004 నుంచి సర్వీసులో చేరిన ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ సౌకర్యాన్ని ఎత్తివేశాయన్నారు. ఈ స్థానంలో వచ్చిన సిపిఎస్‌లో కనీస పెన్షన్‌కు గ్యారంటీ లేదని, పెన్షన్ లేని పథకంగా దీన్ని పిలుస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో సిపిఎస్ ఉద్యోగులు సగానికి చేరారని, సిపిఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఆందోళనలకు సంఘటిత రూపం ఇస్తూ పెన్షన్ సాధన సమితి ఏర్పడటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 1999లో అప్పటి చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ఉద్యోగులపై పెట్టే పెన్షన్ ఖర్చులు తగ్గిస్తామని ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. అదే ఏడాది కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వం పెన్షన్ బాధ్యత నుంచి తప్పుకొనే ప్రపంచ బ్యాంకు సిఫార్సులకు తల ఊపిందని తెలిపారు. సిపిఎస్‌కు ఆధారమైన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ ఆథారిటీ(సిఫ్‌ఆర్‌డిఎ) బిల్లుకు వామపక్ష పార్టీలు మినహా మిగతా పార్టీలన్నీ ఓటేశాయని పేర్కొన్నారు. వామపక్ష పాలిత పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో మాత్రమే ఉద్యోగులకు నష్టం చేసే సిపిఎస్ అమలు చేయలేదని వివరించారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడేందుకు ఏర్పడిన పెన్షన్ సాధన సమితిని మరింత విస్తృత పర్చాలని, బ్యాంకు, ఇన్సూరెన్స్, యూనివర్సిటీలు తదితర రంగాల ఉద్యోగులను కూడా కలుపుకోవాలని కోరారు.

# జన్మభూమిలో నిరసనలు నిలదీతలు

### మహిళా నేతపై మరోసారి పోలీసుల దాష్టీకం

ప్రజాశక్తి-యంత్రాంగం

నిరసనలు నిలదీతల మధ్య శుక్రవారం నాలుగో రోజు జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాల్లో చేర్చరాదని, గత జన్మభూమి సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల ప్రజలు అధికారుల ముందు నిరసన తెలిపారు. కొన్ని చోట్ల అధికారులు సమాధానం చెప్పలేక అర్థాంతరంగా ముగించుకుని వెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ఆక్వా ఫుడ్‌పార్కు బాధిత గ్రామాల మహిళా నేతపై పోలీసులు మరోసారి దాష్టీకం ప్రదర్శించారు. మొగల్తూరులో జరిగిన జన్మభూమి సభకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌కు సమస్యలను వివరించేందుకు వెళ్లి నరసాపురం మండలం తుందుర్రుకు చెందిన ఆక్వా ఫుడ్‌పార్కు వ్యతిరేక పోరాట కమిటీ నేత ఆరేటి సత్యవతి పోలీసులు ఒక్కసారిగా ఆమెను అక్కడ నుంచి లాక్కెళ్లి పోలీసు వ్యాన్‌లో నరసాపురం తరలించారు. సత్యవతిని పోలీసులు ఈడ్చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి.

గిరిజనేతురులైన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ పంచాయతీలో జన్మభూమి సభలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు డిమాండ్ చేశారు. సాలూరు మండలం నార్లవలసలో స్థానిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిలదీసి సభను అడ్డుకున్నారు. పూసపాటిరేగ మండలం కొవ్వాడలో గ్రామసభ రసాభాసగా మారింది. పచ్చచొక్కాలకే పథకాల పంపిణీ చేస్తున్నారని



పోలీసుల నిర్బంధంలో ఉన్న పలు సంఘాల నాయకులు

సర్పంచితో పాటు వైసిపి నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు హాజరైన అధికారులు అర్థాంతరంగా ముగించి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు వస్తేనే జన్మభూమి సభను జరగనిస్తామని కొవ్వాడ దళితులు సభ వద్ద బైఠాయించారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో సమస్యలపై జెడ్పి ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మిని గురువుగారివీధి వాసులు నిలదీశారు. వీరఘట్టం మండలం చిట్టపూడివలసలో ఉపాధి హామీ, ఇంకుడు గుంతల బిల్లులు చెల్లించకపోవడంపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు.గత జన్మభూమి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి కారణాలేంటో చెప్పాలని విశాఖ జిల్లా డుంబ్రిగుడ మండలం తూటంగి, కొర్రా పంచాయతీల్లోనూ, జి.మాడుగుల మండలం కోరాపల్లి, పెదలువ్వాసింగి, బొయితిలి, నుర్మతి పంచాయతీల్లోనూ, పాడేరు, సలుగు, వంట్లమామిడి, కాడెలి పంచాయతీల్లోనూ జన్మభూమిలో అధికారులను గిరిజనులు నిలదీశారు. పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల ప్రజలు, రైతుల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లా విఆర్.పురం మండలం జీడిగుప్పలో సిపిఎం ఆధ్వర్యంలో కొండరెడ్లు వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా చేపట్టిన జన్మభూమి నిరసనల మధ్య సాగింది. జిల్లాలోని బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సమస్యలపై గ్రామస్తులు అధికారులతో వాగ్వావాదానికి దిగారు. కణేకల్లు మండలంలో సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు, రాప్తాడు మండలంలో మంత్రి పరిటాల సునీతలు పాల్గొన్నారు.

## 'సంక్రాంతి'కి 2,135 అదనపు బస్సులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

సంక్రాంతి పండుగ రద్దీ గణనీయంగా ఉంటుందని ఆర్టీసీ అంచనా. రద్దీకి తగ్గట్లు అదనపు బస్సులను ఈనెల 5వ తేదీ నుంచి 13 వతేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌కు 2,135 అదనపు బస్సులు నడపనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నుండి విజయవాడకు వచ్చే బస్సుల్లో సీట్ల రిజర్వేషన్ పూర్తయింది. గతేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు1,714 బస్సులను నడిపారు. ఈ ఏడాది అదనంగా 421 బస్సులను నడుపనుంది.. ప్రత్యేక బస్సుల ద్వారా వచ్చే ఆదాయంలో 40శాతం విజయవాడ- హైదరాబాద్, ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు, అదే జిల్లాలోని కనిగిరి ఆర్టీసీ డిపోల ద్వారా వస్తుందని ఆర్టీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్టీసీ బస్సులన్నీ హైదరాబాద్‌నుండి విజయవాడకు వచ్చే విదంగా ప్రణాళికను సిద్ధం చేశారు. అత్యధికంగా అదనపు బస్సులను 6న 39 బస్సులు, 7న 31 బస్సులు, 8న 87 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ నెల 9 నుండి అదనపు బస్సులను భారీగా పెంచారు. 9న 259 బస్సులు, 10న 353 బస్సులు, 11న 463 బస్సులు, 12న 700 బస్సులు, 13న 136 బస్సులు ఆర్టీసీ నడపనున్నారు.

## సుబాబుల్ కర్ర కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - నందిగామ

సుబాబుల్ కర్ర కొనుగోలు చేయాలనీ, పెండింగ్ బకాయిలు ఎస్‌పిఎం కంపెనీ నుంచి వచ్చేలా ఏర్పాటుచేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శుక్రవారం సుబాబుల్ రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబాబుల్ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ జోయ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన డంపింగ్ యార్డుల వద్ద సుబాబుల్ కర్ర కొనుగోలు చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పేపరు పరిశ్రమలు స్థానికంగా కర్ర కొనుగోలు చేయకుండా, ఆర్‌సి ద్వారా కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా మోసం చేస్తున్నాయన్నారు. నందిగామ ప్రాంతానికి చెందిన రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సుబాబుల్ రైతాంగం సమస్యలను పరిష్కరించటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సిపిఎం పశ్చిమకృష్ణా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు, నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు సయ్యద్‌ఖాసిం, రైతు సంఘాల నాయకులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం యార్డు కార్యదర్శి కె.గోవింద్‌కు వినతి పత్రం అందజేశారు. సుబాబుల్ కర్ర కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బుగ్గినేని భాస్కరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 5,6 తేదీల్లో 'తరుణీ తరంగాలు'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారి మానసిక వికాసానికి, ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ' తరుణి తరంగాలు మహిళ ఫెస్ట్ ' వేదిక కానుంది. వచ్చే నెల 5,6 తేదీల్లో విజయవాడ పి.బి. సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఈ ఫెస్ట్ నిర్వహిస్తామని ఆ కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. విజయవాడ ఎమ్.బి. విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆ కార్యక్రమ నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ మహిళాభివృద్ధికి తోడ్పాటునందించే వారందరితో కార్యక్రమ నిర్వహణ కమిటీ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, విద్యార్థులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలు పాల్గొంటారని చెప్పారు. రెండు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలు ఉంటాయన్నారు. సమాజంలో మహిళలపై పెరుగుతున్న వివక్షను రూపుమాపేందుకు, అన్ని రంగాల్లోనూ మహిళలు



దూసుకుపోగలరని చాటి చెప్పేందుకు ఈ ఫెస్ట్ వేదికగా నిలుస్తుందన్నారు. కమిటీ సభ్యులు ప్రముఖ విద్యావేత్త రెజీనా మాట్లాడుతూ ఆటలు, పాటలు, కళలు వివిధ రంగాల్లో మహిళల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం అవకాశంగా ఉంటుందన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై డిక్లరేషన్ రూపంలో సూచిస్తామన్నారు. కళాశాల విద్యార్థినులకు చిత్రలేఖనం, డ్రాయింగ్, వ్యాసరచన, కవితలు తదితర పోటీలు ఉంటాయన్నారు. మహిళలకు ఏకపాత్రాభినయం, జానపదగీతాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల మహిళలు విజయవాడ శ్రామిక విద్యాపీఠ్ కార్యాలయాన్ని సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షులు రావి శారద, ఉపాధ్యక్షులు చుక్కపల్లి మాధవి, కోశాధికారి జి. జ్యోత్స్న, కార్యదర్శులు కెఎల్. అనీషా, దారా కరుణశ్రీ, ఎన్. విద్యాఖన్నా, కమిటీ సభ్యులు నీరజ, గాదె ఆదిలక్ష్మి, శాంతిశ్రీ, మంజుల, కె. స్వరూపరాణి, పి. విజయ, శ్రీదేవి పాల్గొన్నారు.

## పునరావాసం కల్పించాకే పోలవరం

### జిల్లా మహాసభలో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న గిరిజనులు, గిరిజనేతరులకు పూర్తి పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం తూర్పుగోదావరి రాజమహేంద్రవరం జిల్లా మహాసభ తీర్మానించింది. రాజమహేంద్రవరం రివర్‌బేలో రెండ్రోజులపాటు జరిగిన సిపిఎం జిల్లా మహాసభలు శుక్రవారం రాత్రి ముగిశాయి. సభలో పలు తీర్మానాలను ఆమోదించారు. 2013 చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించాలని, ముంపునకు గురయ్యే వారికి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని తీర్మానించారు. 2013 చట్టాన్ని సవరించే చర్యలను ఆపాలని, గతంలో ఎకరానికి రూ.లక్షా 15వేలు చెల్లించిన రైతులకు 2013 చట్టం ప్రకారం తిరిగి పరిహారం చెల్లించాలని తీర్మానించారు. అసైన్డ్, పోరంబోకు భూములకు పరిహారం ఇవ్వాలని, గ్రామం ఖాళీ చేసే నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ప్యాకేజీ ఇవ్వాలని మహాసభ తీర్మానించింది. మన్యంలో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలని, గిరిజన యూనివర్శిటీని ఏర్పాటుచేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మన్యంలోనూ, మైదాన ప్రాంతాల్లోనూ పేదలకు ఇళ్లునిర్మించాలని తీర్మానించింది. మద్యాన్ని నియంత్రించాలని, మహిళల సమస్యలను పరిష్కరించాలని, మైనార్టీలపై, దళితులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ అనేక తీర్మానాలను ఆమోదించింది.

**మన్యంలో మతోన్మాదులకు చోటివ్వొద్దు : దడాల**

మన్యంలో ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను ధ్వంసం చేసి మతోన్మాదాన్ని పెంచేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రయత్నాలను గిరిజనులు, సిపిఎం శ్రేణులు తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు.

**ప్రజా సమస్యలే సిపిఎం ఎజెండా : రాజయ్య**

ప్రజా సమస్యలే సిపిఎం ఎజెండా అని, భవిష్యత్తు సిపిఎందేనని భద్రాచలం ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య చెప్పారు. ప్రతినిధుల సభనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడేది సిపిఎం ఒక్కటేనని, టిడిపి, వైసిపి ప్రజల పక్షంగా ఉండవని స్పష్టం చేశారు.

సిపిఎం మహాసభల సందర్భంగా శుక్రవారం రాత్రి 23 మంది సభ్యులతో సిపిఎం జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్, కార్యదర్శివర్గ సభ్యులుగా ఎస్ఎస్ మూర్తి, టిఎస్ ప్రకాష్, కుంజా సీతారామయ్య, మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రాంబాబు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా 17 మంది

## ఎంవి చట్టం రద్దు చేయాలని ధర్నాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మోటారు వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం పలుచోట్ల ధర్నాలు జరిగాయి. విజయవాడలోని ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రధాన కార్యాలయం వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ కృష్ణా రీజియన్ కార్యదర్శి బిడిఆర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె జిలానిబాషా, సిహెచ్.సుందరయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లు వల్ల దేశంలోని ఆయా రాష్ట్రాల ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. బిల్లు ఆమోదం పొందితే కాంట్రాక్ట్ పర్మిట్, స్టేజి పర్మిట్లు అనే తేడా లేకుండా ఒకే పర్మిట్ ఇస్తారన్నారు. దీంతో ఎవరైనా ఎక్కడైనా నడుపుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు రూట్లు వేలం వేస్తారని, దీనిలో ఆర్టీసి, ప్రయివేటు ఆపరేటర్లతో పోటీ పడి టెండర్లలో పాల్గొనాల్సి వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్ పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఏలూరు లాకుల సెంటర్ వద్ద జరిగిన ధర్నాలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మోటారు యాక్ట్ బిల్లును పార్లమెంటులో ఆమోదించి, రాజ్య సభ ఆమోదానికి పంపిందని, అక్కడ ఆమోదం పొందితే రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, విజయవాడ సెంట్రల్ సిటీ సిఐటియు కార్యదర్శి ఎంవి సుధాకర్ మాట్లాడుతూ ఎంవి యాక్ట్ బిల్లులో కార్మికులకు నష్టం కలిగించే సవరణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒంగోలులో కలెక్టర్ కార్యాలయం వద్ద రవాణా రంగ కార్మికులు ధర్నా నిర్వహించారు.

## నేటి నుంచి పిఎస్‌ఎన్ సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రొఫెషనల్ స్టూడెంట్ నెట్‌వర్క్ (పిఎస్‌ఎన్) సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె రమేష్, వై రాము పిలుపునిచ్చారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శని, ఆది వారాల్లో రెండు రోజుల పాటు ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఈ సమావేశాలుంటాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ విద్య సిలబస్‌లో మార్పులు తీసుకురావడంలో ఎఐసిటిఇ విఫలమయిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 300 ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాబ్యాలెట్

# దేశభక్తి ముసుగులో బిజెపి దేశద్రోహ చర్య

- డిసిఐ రక్షణకు పోరాటాలు ఉధృతం
- విశాఖలో 'ప్రజాబ్యాలెట్'కు అశేష స్పందన

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

దేశభక్తి ముసుగులో బిజెపి దేశద్రోహానికి పాల్పడుతుందని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు డాక్టర్ హేమలత విమర్శించారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్ల ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 10 గంటలకు విశాఖ నగరంలోని జగదాంబ జంక్షన్ వద్ద జరిగిన 'ప్రజా బ్యాలెట్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి విధానమే ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించడం, ప్రజా సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు ధారాదత్తం చేయడమంటూ విమర్శించారు. ఈ నేపథ్యంలోనే అధికారం లోకి రాగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే ప్లానింగ్ కమిషన్‌ను రద్దుచేసి నీతి అయోగ్‌ను తీసుకొచ్చిందని విమర్శించారు. డిసిఐను దేశ, విదేశీ కార్పొరేట్ల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవ్వడాన్ని కార్మికవర్గం సహించబోదని ఉద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్, రైల్వే, రక్షణరంగం



ప్రజాబ్యాలెట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత

ఇలా అన్ని రంగాలపైనా బిజెపి దాడి చేస్తుందన్నారు. ఎక్కడైతే కార్మికవర్గం, ప్రజలు పోరాడతారో అక్కడ ప్రభుత్వం ప్రయివేటీకరణ నుంచీ వెనక్కి వెళ్తుందని అన్నారు. రక్షణ రంగంలోని విఇఎంఎల్ విభాగాన్ని ప్రయివేటీకరణ చేయాలన్న నిర్ణయం నుంచి అక్కడ కార్మికులు పోరాడడంతో ప్రభుత్వం వెనక్కి రావాల్సి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత కోలా గురువులు, ఎఐసిటియు విశాఖ జిల్లా నాయకులు శంకరరావు, హెచ్‌ఎంఎస్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. విశాఖ నగరంలోని ద్వారకా బస్టాండ్ వద్ద డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా బ్యాలెట్‌ను నిర్వహించారు. నగర ప్రముఖులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రయి వేటీకరణపై ప్రజా బ్యాలెట్‌ను ప్రారంభించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పాల్గొన్నారు.

**యూనియన్ ద్వారా కార్మిక సమస్యల పరిష్కారం**

యూనియన్ ద్వారా కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత అన్నారు. స్థానిక పురుషోత్తపురం దేవి ఫిషర్ కంపెనీలో మహిళా కార్మికులతో శుక్రవారం సమావేశమయ్యారు. తొలుత మహిళా కార్మికుల సమస్యలు, కంపెనీ అందిస్తున్న వేతనాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## మతోన్మాదుల ఆటలు సాగవు

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో మతోన్మాదులు కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య మత కలహాలు సృష్టించి, చీలికలు తేవాలనే ప్రయత్నాలను భారత దేశ ప్రజలు అంగీకరించరని ముస్లిం సంఘాల నాయకులు పేర్కొన్నారు. భారతదేశం లౌకిక దేశమని, భిన్నత్వంలో ఏకత్వంతో ప్రపంచానికి ఆదర్శంగా ఉందని, అటువంటి దేశంలో మైనార్టీలపై దాడులు హేయమైన చర్య అని పేర్కొన్నారు. మతోన్మాదల చర్యలకు వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం సమాఖ్య గుంటూరు నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బిఆర్ స్టేడియం నుంచి హిందూ కాలేజి సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాడికొండ పోలీసుస్టేషన్ వద్ద వైసిపి ధర్నా

ప్రజాశక్తి - తాడికొండ (గుంటూరు జిల్లా)

ఓ వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడనే ఫిర్యాదుతో వైసిపి కార్యకర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై వైసిపి నేతలు ధర్నాకు దిగారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలంలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటన వివరాల ప్రకారం.. మండలంలోని బండారుపల్లికి చెందిన గుంటుపల్లి రాంబాబు గతేడాది దీపావళి రోజున (అక్టోబర్ 19) దిష్టిబొమ్మపై 'సిఎం చంద్రబాబు నరకాసురుడు' అని రాసి టపాసులు కాల్చాడు. ఆ వీడియోను తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ దండమూడి సాంబశివరావు తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు రాంబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. దీనిపై ఆగ్రహానికి గురైన వైసిపి నాయకులు శుక్రవారం రాత్రి తాడికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. తమ కార్యకర్తను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
A.P. Gazette No. 84/KST/2017, Dated 23-12-2017
ఫారం నెం.-7
చట్టం నెం.30/2013 లోని సెక్షన్ (1)19 మరియు రూల్ (1)25 ప్రకారం
రూఢీ ప్రకటన
REV-GSEC0LARR(JI)/12/2016-SA-(G1)-KCO

ఆర్.సి.నెం. జి2/26/2016 తేది : 23-12-2017

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన కృష్ణా జిల్లా కైకలూరు మండలం, సోమేస్వరం గ్రామంలో గల య. 0.08 సెంట్లు భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా విజయవాడ - గుడివాడ - భీమవరం - నిడదవోలు రైల్వేస్టేషన్ల మధ్య విద్యుత్‌తో కూడిన రెండు రైల్వే లైన్ల నిర్మాణమునకు గాను" అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కృష్ణాజిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున, చట్టం 2013/30లోని సెక్షన్15 ప్రకారము సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తుల నుండి ఏ విధమైన అభ్యంతరములు రానందున చట్టం 2013/30 కేంద్ర చట్టం (2013/30లోని సెక్షన్ (19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

దిగువ షెడ్యూలులో పేర్కొనిన య. 0.08 సెంట్లు భూమి, చట్టం 2013/30 కేంద్ర చట్టం 2013/30 లోని సెక్షన్ 19 (1) ప్రకారము డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), యస్.సి.రైల్వే, విజయవాడ వారిచే ప్రజాహిత కార్యక్రమాలకు అనగా "విజయవాడ-గుడివాడ - భీమవరం - నిడదవోలు రైల్వేస్టేషన్ల మధ్య విద్యుత్‌తో కూడిన రెండు రైల్వేలైన్ల నిర్మాణమునకు గాను అంతే మొత్తము కొద్ది ఎక్కువ లేక తక్కువ భూమి అవసరమని కృష్ణాజిల్లా కలెక్టరుగారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

గ్రామం: సోమేశ్వరం | మండలం: కైకలూరు | జిల్లా: కృష్ణా

| వరుస నెం | సర్వే నెం. సబ్ డివిజన్ | మొత్తం విస్తీర్ణం య. లలో | సేకరించ వలసిన విస్తీర్ణం య.లలో | ఆసక్తి గల వ్యక్తుల పేర్లు మరియు చిరునామా | హద్దులు ఉత్తరం | హద్దులు దక్షిణం | హద్దులు తూర్పు | హద్దులు పడమర | చెట్లు కట్టడములు ఏవైనా |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | 71/1బా | 5.45 | 0.01 | శ్రీమతి వేగేశ్న బంగారమ్మ | 98 | 71/3 | 99 | 72 | మామిడిచెట్టు |
| | 71/2బా | | 0.07 | భర్త వెంకటకృష్ణంరాజు | 98 | 71/3 | 99 | 72 | కొబ్బరిచెట్లు9 |
| | | మొత్తం | 0.08 | | | | | | |

రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు భూసేకరణ అధికారి, గుడివాడ నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పని దినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుటగాని చేయవలెను.

సం/- బి.లక్ష్మీకాంతం, ఐ.ఎ.ఎస్.,
జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, కృష్ణా.

## చట్టాల దుర్వినియోగం

### ఎడ్వర్డ్ స్నోడెన్

**చండీగఢ్ :** చట్టాలను పట్టించుకోనందునే ఫలితాలు దుర్వినియోగమవుతున్నాయని,ప్రజల ప్రైవేటు జీవితాల వివరాలను కోరుకోవడమే ప్రభుత్వ వైఖరి అని అమె రికా మాజీ రక్షణ శాఖ ఉద్యోగి ఎడ్వర్డ్ స్నోడెన్ వ్యాఖ్యా నించారు. ఆధార్ డేటా ఉల్లంఘనకు గురవుతుం దంటూ ఒక జర్నలిస్ట్ చేసిన ట్వీట్‌పై ఆయన స్పందిం చారు. "ప్రైవేటు జీవితాల ఖచ్చితమైన రికార్డులను కోరు కోవడం ప్రభుత్వాల సహజ సిద్ధమైన వైఖరి." అని స్నోడెన్ ట్వీట్ చేశారు. చట్టాలు పట్టించుకోని కారణంగా ఫలితాలు దుర్వినియోగ మవ్వడం చరిత్ర తెలిపిన విషయమేన న్నారు. లక్షలాది మంది ప్రజలు ఆధార్ డేటాను ఏజెంట్ల ద్వారా కేవలం రూ. 500కు విక్రయిస్తున్నారంటూ గురువారం వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే.



చర్చలు

మూడుదేశాల పర్యటనలో భాగంగా ఉభయదేశాల మధ్య సంబంధాల మెరుగుదల కోసం ఇండోనేషియాలో ఆ దేశ ఉపాధ్యక్షునితో చర్చలు జరుపుతున్న విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్

## త్రిపుర సర్కారును కూల్చే కుట్ర

### బిజెపివి 'మురికి కుయుక్తులు' : బృందాకరత్

**న్యూఢిల్లీ :** త్రిపురలో లెఫ్ట్ పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నదనీ, 'మురికి కుయుక్తుల'కు పాల్పడుతున్నదని సీపీఐ(ఎం) ఆరోపించింది. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న త్రిపురలో రాష్ట్రం వెలుపలి వ్యక్తులను పరిశీలకులుగా నియమించాలనీ, గరిష్ట సంఖ్యలో పారా మిలిటరీ దళాలను మోహరించాలని బిజెపి ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేయడాన్ని సీపీఐ(ఎం) తప్పుపట్టింది. ఈశాన్య రాష్ట్రాల్లో భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ పీటీఐ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విమర్శించారు. త్రిపుర శాంతికి, సామరస్యానికి చిహ్నమని అన్నారు. సామాజిక, అభివృద్ధి సూచీలో బిజెపి పాలిత రాష్ట్రాల కంటే త్రిపురలోని సీపీఐ(ఎం) ప్రభుత్వం మెరుగైన ఫలితాలను సాధించిందని ఆమె స్పష్టం చేశారు. 'బిజెపి నేతలు చేస్తున్న తప్పుడు ఆరోపణలు, సృష్టిస్తున్న అసత్యాలు, దూషించే ప్రకటనలతో రానున్న ఎన్నికలతో ఆ పార్టీ (త్రిపురలో) భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వామపక్ష కూటమి మరింత బలపడుతుందని ఆమె చెప్పారు. త్రిపురలో 1993 నుంచి సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. 60 మంది శాసనసభ్యులుగల త్రిపుర అసెంబ్లీ పదవీ కాలం మార్చి 6న ముగియనున్నది.

## బిజెపిది పిల్ల చేష్ట : జిగ్నేష్ మెవాని

- కుల ఘర్షణలో ప్రమేయం లేదు
- ఈ నెల 9న ఢిల్లీలో యువ గర్జన
- ఏ కులానికి వ్యతిరేకం కాదు

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలోని భీమ కొరెగావ్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న హింస, కుల ఘర్షణల్లో తన ప్రమేయం లేదని దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవాని తెలిపారు. బిజెపి తనపై కేసు నమోదు చేయడం పిల్ల చేష్ట అని పేర్కొన్నారు. ఈ విషయమై మహారాష్ట్ర ప్రభుత్వం తనపై నిరర్ధక కేసును నమోదు చేసిందన్నారు. తనకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఆరెస్సెస్, బిజెపిలు భయపడుతున్నాయన్నారు. అందువల్లే తనపై పనికిమాలిన కేసును నమోదచేశాయన్నారు. తాను భీమ కొరెగావ్ గ్రామాన్ని సందర్శించలేదన్నారు. ఇక్కడ చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల తరువాత జరిగిన మహారాష్ట్ర బంద్‌లో తాను పాల్గొనలేదన్నారు. రెచ్చగొట్టే ప్రకటనలు ఏవీ తాను చేయలేదన్నారు. తనను లక్ష్యంగా చేసుకున్నా, దళితులను చిత్ర హింసలకు గురిచేసిన 2019 ఎన్నికల్లో వారు గుణపాఠం చెబుతారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని హెచ్చరించారు. ఆరెస్సెస్, బిజెపిలకు దేశంలోని దళితులు, ముస్లింలు, రైతులు, యువత వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో గెలిచామన్న అహంకారంతో బిజెపి తనపై కేసు నమోదు చేసిందని ఆరోపించారు. చట్టాల పట్ల, న్యాయ వ్యవస్థ పట్ల తనకెంతో నమ్మకముందన్నారు. కొరెగావ్ సంఘటనపై కూడా చర్యలు తీసుకోవా లన్నారు. కులతత్వంపై తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఒక ప్రత్యేకమైన కులానికి తానేమి వ్యతిరేకిని కాదన్నారు. సామాజిక న్యాయాన్ని కాంక్షిస్తూ ఢిల్లీలో ఈ నెల 9న యువ గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను ఒక చేత్తో మనుస్మృతిని, మరో చేత్తో రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రధాని ఎదుట నిలబడి ఏదో ఒకదానిని ఎంచుకోవలసిందిగా కోరతానన్నారు.

## ప్రకాశ్‌రాజ్ కాలమ్ నిలిపివేత

### కన్నడ పత్రిక నిర్ణయం

### రాజకీయ ఒత్తిడే కారణమని అనుమానాలు



**బెంగళూరు :** హిందూత్వ రాజకీయాలపై నిరసన గళం వినిపిస్తున్న ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ రాస్తున్న కాలమ్‌ను నిలిపివేయాలని ఒక కన్నడ పత్రిక తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. రాజకీయ ఒత్తిడే ఈ నిర్ణయానికి కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకాశ్‌రాజ్ దీనిని తన రచనలపై చేసిన సర్జికల్ స్ట్రైక్‌గా ట్విట్టర్‌లో అభివర్ణించారు. ' ఓ అదృశ్యశక్తి ... నిన్ను మేం గుర్తించలేమనుకున్నావా?' అని ఆయన ప్రశ్నించారు. ప్రముఖ కన్నడ పత్రిక ఉదయవాణిలో ఆయన కొంత కాలంగా 'ఇరుదెల్యుబిట్టు' శీర్షికతో ఆయన కాలమ్ నిర్వహస్తున్నారు. సమకాలీన రాజకీయాలపై తన అభిప్రాయాలను ఆయన దీనిలో వివరించేవారు. పాఠకుల నుండి మంచి ఆదరణ పొందుతున్న ఈ శీర్షికను నిలిపివేయాలని ఆకస్మాత్తుగా ఆ పత్రిక నిర్ణయం తీసుకుంది. శనివారం ఆ కాలమ్ ప్రచురణ కావాల్సిఉండగా, నిలిపివేస్తున్నటు తెలియచేసింది. దీనిపై ప్రకాశ్ రాజ్ చేసిన ట్వీట్ వైరల్ కావడంతో పత్రిక యాజమాన్యం స్పందించింది. తమ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలు ఏమీ లేవని, కొత్త రచయితలను ప్రోత్సహించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అయితే, పరిశీలకులు మాత్రం ప్రకాశ్‌రాజ్ అభిప్రాయానే బలపరుస్తున్నారు.

## విదేశాలకు మొబైల్ ఫోన్ డేటా లీకేజి వాస్తవమే

### రాజ్యసభలో కేంద్ర మంత్రి మనోజ్ సిన్హా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

విదేశాలకు మొబైల్ ఫోన్ డేటా లీకేజీ వాస్తవమేనని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా వెల్లడించారు. శుక్రవారం రాజ్యసభలో వైసిపి సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోజ్ సిన్హా సమాధానమిచ్చారు. అయితే లీకవుతున్న సమాచారం ఎలాంటిదో కనిపెట్టడం కష్టమని మనోజ్ సిన్హా అన్నారు. మొబైల్ ఫోన్ల ద్వారా విదేశాలకు సమాచారం లీక్ అవుతున్నట్లుగా కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలు ప్రభుత్వ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ వార్తలపై వెంటనే స్పందించి ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ రంగంలోకి దిగిందన్నారు. మొబైల్ ఫోన్ల భద్రత, రక్షణ కోసం ఫోన్ల తయారీ సంస్థలు ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయి..ఆయా ఫోన్ల ఆర్కిటెక్చర్, ఫ్రేమ్ వర్కు తదితర వివరాలను సమర్పించాలని మొబైల్ ఫోన్ల తయారీ సంస్థలను కోరినట్లు మంత్రి తెలిపారు. మొబైల్ డేటా విదేశాలకు లీకవుతున్నట్లు వార్తలు వెలు వడిన తర్వాత తమ మంత్రిత్వ శాఖకు చెందిన స్టాండర్డైజేషన్ టెస్టింగ్, క్వాలిటీ సర్టిఫికేషన్ విభాగం దీనిపై లోతుగా పరిశీలన జరిపిందని చెప్పారు. మొబైల్ ఫోన్ల నుంచి షేర్ అవుతున్న డేటా సంకేత సంక్షిప్త సందేశం (ఎన్క్రిప్ట్) రూపంలో ఉంటుందని, కనుక అది ఎలాంటి సమాచారమో కనిపె ట్టడం కష్టమవుతోందని మంత్రి చెప్పారు. ఈ డేటా కేవలం తమ ప్రతిభా సామర్థ్యాలను మరింతగా పెంపొందించుకోవడం కోసం మాత్రమే వినియో గిస్తున్నట్లుగా ఆయా కంపెనీలు చెబుతున్నాయని మంత్రి వివరించారు.

## హజ్ యాత్రకు వికలాంగులను అనుమతించాలి

- సిపిఎం ఎంపి టి.కె. రంగరాజన్ నేతృత్వంలో వినతి పత్రం
- ఆంక్షల తొలగింపునకు మంత్రి హామీ

**న్యూఢిల్లీ (ఇండియా న్యూస్ నెట్‌వర్క్) :** అంగ వైకల్యం కారణంగా హజ్ యాత్రకు అనుమతి నిరాకరిస్తూ హజ్ కమిటీ జారీ చేసిన నిబంధనలను తొలగించాలని కోరుతూ 'నేషన్ ప్లాట్‌ఫామ్ ఫర్ ది రైట్స్ ఆఫ్ ది డిజేబుల్డ్ (ఎన్‌పిఆర్‌డి)" మైనార్టీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీకి శు క్రవారం ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. దీనికి నఖ్వీ స్పందిస్తూ మార్గదర్శకాలను సమీక్షించాలని హజ్ కమిటీకి సూచిస్తానని హామీ ఇచ్చారు. 2016 నాటి అంగవైకల్యం చట్టంలోని నిబంధనలను అనుసరించి హజ్ యాత్రకు పంపే ఏర్పాటు చేస్తామన్నారు. సిపిఎం ఎంపి టి.కె. రంగరాజన్ ఈ విషయమై గురువారం మంత్రికి రాసిన లేఖకు ఆయన సానుకూలంగా స్పందించారు. " కాళ్లకు వున్న వైకల్యం కారణంగా కృత్రిమ పరికరాలను వినియోగించే వారితోపాటు వికలాంగులు, మానసిక స్థిమితం లేని వారు హజ్ యాత్రకు అనర్హులు" అనే నిబంధనను హజ్ కమిటీ వెబ్‌సైట్‌లో పేర్కొన్న మార్గదర్శకాల నుంచి తొలగించే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయమై డిసెంబరు 27, 2017న ఎన్‌పిఆర్‌డి మంత్రికి ఒక లేఖ రాసింది. దానికి స్పందనగా మంత్రి పైహామీ ఇచ్చారు. మంత్రి హామీ ఇచ్చిన విధంగా ఇతర అభ్యంతరకర నిబంధనలు కూడా తొలగించి తగిన చర్య తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఎన్‌పిఆర్‌డి తెలిపింది.



## హక్కుల సాధన కోసం ప్రజలు ముందుకు రావాలి

### బిమన్‌బసు

**కొల్‌కతా :** ప్రజలు తమ హక్కుల సాధన కోసం ధైర్యంతో ముందుకురావాలని బర్ద్వాన్‌లో లక్షలాది మందితో జరిగిన బహిరంగసభలో లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్మన్ బిమన్‌బసు పిలుపునిచ్చారు. భయంతో బతికే పరిస్థితి అంతం కావాలని, తలెత్తుకొని తిరగాలని ఆయన ఆద్బోధించారు. అప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యంత్రాంగం కూలిపోతుందని ఆయన చెప్పారు. మమతాబెనర్జి రాష్ట్రాన్ని వినాశకరమైన భవిష్యత్ వైపుకు తీసుకుపోతున్నదని చెప్పారు. రాష్ట్రం ఉపాధి హామి పథకం అమలులో అగ్రస్థానంలో ఉన్నదని మమతాబెనర్జి, టియంసిలు అబద్ధాలు చెబుతున్నాయి. పథకం అమలులో బెంగాల్ 29వ స్థానంలో ఉండగా త్రిపుర అగ్రస్థానంలో ఉన్నదని ఆయన చెప్పారు. బిజెపి ఆవులకు రక్షణ కల్పిస్తానని చెబుతున్నదని, ఆవుల స్థానంలో సామాన్యప్రజలకు రక్షణ కల్పించాలని ఆయన బిజెపిని ఉద్దేశించి చెప్పారు. ఆ పార్టి బర్ద్వాన్ జిల్లా మహాసభ సందర్భంగా జరిగిన ఈ బహిరంగసభలో అమల్‌హల్దార్, అబ్దర్ రజాక్ మండల్ తదితరులు ప్రసంగించారు.

## తమిళనాట ఆర్‌టిసి బంద్

- బకాయిల చెల్లింపు, వేతనాల సవరణపై కుదరని అంగీకారం



**చెన్నై :** తమిళనాడులో రోడ్డు రవాణా స్తంభించింది. తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వజూపిన వేతన ఒప్పందాన్ని నిరసిస్తూ వివిధ ఆర్‌టిసి ఉద్యోగుల సంఘాలకు చెందిన సభ్యులు గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ఎం. ఆర్. విజయ్ భాస్కర్‌తో బకాయిల చెల్లింపు, వేతన సవరణకు సంబంధించిన ఒప్పందంపై ఉద్యోగుల సంఘాలు జరిపిన చర్చలు విఫలమవ్వడంతో ఆర్‌టిసి సిబ్బంది సమ్మెకు దిగారు. రాజధాని నగరమైన చెన్నైలోనూ, మధురై, కోయంబత్తూర్, తిరుచిరాపల్లిలోనూ బస్సు సర్వీసులు నిలిచిపోయాయి.

తమిళనాడు ఆర్టీసి సమ్మెను సుమోటో నోటీసుగా తీసుకునేందుకు మద్రాస్ హై కోర్టు నిరాకరించింది. సమ్మెపై పిటిషన్ దాఖలు చేసినట్లయితే మధ్యాహ్నం 2.15 కల్లా విచారిస్తానని తెలిపింది. ఆర్టీసి సమ్మె నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎడప్పడి కె. పళనిస్వామి అధ్యక్షతన సీనియర్ మంత్రులు, అధికారులు సమావేశమై పరిస్థితిని చర్చించారు.

**చెన్నైలో కాలినడకనే బడికెళ్ళిన విద్యార్థులు**

ఆర్టీసి సమ్మె కారణంగా చాలా మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు నడుచుకుంటూనే వెళ్ళారు. నగరంలోని తాంబరం, క్రోమెపెట్, అలందూర్, చెంగల్పట్ డిపోలకు చెందిన 25 శాతం బస్సులు మాత్రమే నడిచాయి. ఇవి కూడా ప్రధాన మార్గాలలో మాత్రమే నడిచాయి. మణిమంగళమ్, సేతుపేట్, మలైపట్టు, కురువన్మేడు, అమరమ్‌పేడు, నందబక్కమ్ తదితర ప్రాంతాల ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పలేదు.

**కాంచీపురంలో ప్రధాన మార్గాలలో నడిచిన బస్సులు**

కాంచీపురం నుంచి కొన్ని ప్రధాన మార్గాలలో మాత్రం అతి తక్కువ సంఖ్యలో బస్సులు నడిచాయి. దీంతో ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు కొంత ఊరట కలిగింది. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి బస్సులు నిలిచి పోయాయి.

**కోయంబత్తూరులో పూర్తిగా స్తంభించిన రవాణ**

కొయబంత్తూరులో తొలుత ఉదయం 11 గంటల వరకు 22 శాతం బస్సులు నడిచినప్పటికీ, ఆ తరువాత పరిస్థితి దారుణంగా మారింది. అధికార పార్టీ అనుబంధ ఉద్యోగ సంఘం ఎటిఎస్ మధ్యాహ్నం వరకు బస్సులు నడిపి ఆ తరువాత ఆపివేసింది. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**గాంధీపురం బస్టాండ్‌లో పలుచబడ్డ జనం**

గాంధీపురం బస్టాండ్‌లో జనం పలచగా కనిపించారు. ఇక్కడి బస్టాండ్ ఎడారి వాతావరణాన్ని తలపించింది. సింగనల్లూర్, ఉక్కడమ్, మెట్టుపాళ్యం తదితర ప్రాంతాలలో కూడా బస్సులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఈరోడ్, రామనాథపురం, సేలం, తిరుచిరాపల్లి, వెల్లూరు తదితర ప్రాంతాలలో కూడా బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు.

## ఇంజనీర్లు, పిజి చేసినవారు అన్‌ఫిట్

- 10వ తరగతి చదివిన యంయల్‌ఎ కొడుకు ఫిట్
- రాజస్థాన్‌లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు

**జైపూర్ :** రాజస్థాన్ ప్రభుత్వం సచివాలయంలో ప్యూన్ ఉద్యోగాల ఖాళీలను భర్తీచేయటం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగాల కోసం క్యూ కట్టినవారిలో ఇంజనీర్లు, లాయర్లు, సిఎలు, పోస్టుగ్రాడ్యుయేట్లుతో సహ వందల సంఖ్యలో వచ్చినా కేవలం పదవ తరగతి వరకే చదివిన బిజెపి ఎంఎల్‌ఎ కొడుకుకే ఉద్యోగం వచ్చింది. రాజస్థాన్ అసెంబ్లీ సెక్రటేరియట్‌లో క్లాస్-4 ఉద్యోగాల్లో 18 ఖాళీలు వున్నాయి. వాటికోసం అక్షరాలా 12,543 మందిని ఇంటర్వ్యూ చేశారు. వారిలో 129 మంది ఇంజనీర్లు, 23 మంది లాయర్లు, ఒక సిఎ, 393 మంది పోస్టుగ్రాడ్యుయేట్లుతో సహ 3600 మంది విద్యాధికులు వున్నారు. అర్హత కలిగిన వారు వందల సంఖ్యలో వుండగా ఎంఎల్‌ఎ కొడుకు రామకృష్ణ మీనా 12 స్థానంలో వుండడం పలువురిని విస్మయపరిచింది.

## 12న ఉపగ్రహ ప్రయోగం

**బెంగళూరు:** కొత్త ఏడాదిలో తొలి ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సన్నాహాలు పూర్తి చేస్తోంది. గత ఆగస్టు నెలలో దేశంలో ప్రైవేటు రం గంలో తయారయిన తొలి ఉపగ్రహ ప్రయోగంలో విఫలమైన ఇస్రో, నాలుగు నెలల విరామానంతరం ఆత్మవిశ్వా సాన్ని కూడగట్టుకుని మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమ యింది. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ నెల 12న ఈ ఉపగ్రహం రోదసిలోకి ప్రయాణమవుతుంది. ఉపగ్రహ ప్రయో గాల్లో ఇస్రో నమ్మిన బంటుగా వున్న పిఎస్‌ఎల్‌వి గత ఆగస్టు 31 నాటి ఉపగ్రహ ప్రయోగంలో విఫలం కావటంతో అందులో దొర్లిన పొరపాట్లపై శాస్త్రవేత్తలు ఆత్మవిమర్శ చేసుకున్నారు. ఈ సారి ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఇస్రో వర్గాలు చెప్పాయి. గతంలో పిఎస్‌ఎల్‌వి రాకెట్ లో తలెత్తిన సమస్యను సరిదిద్దామని, ఇప్పుడు 31 ఉపగ్రహాలతో రాకెట్‌లను ప్రయోగించేందుకు సిద్ధంగా వున్నామని ఈ వర్గాలు వివరించాయి.

## భారత్ బయోటెక్స్ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం

**న్యూఢిల్లీ :** భారత్ బయోటెక్స్ రూపొందించిన టైఫాయిడ్ వాక్సిన్ టైప్‌బార్ టిసివికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం లభించింది. ప్రస్తుతం ఉన్న వాటిల్లో ఎక్కువ కాలం ఇమ్యూనిటిని ఇవ్వగల ఒకే ఒక్క వాక్సిన్ ఇది. ఆరు నెలల వయస్సు గల పిల్లలకు దీనిని ఉపయోగించవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి ముందస్తుగా అనుమతి పొందడంతో యునిసెఫ్, గావి (జిఎవిఐ), పాన్ అమెరికన్ హెల్త్ ఆర్గనైజేషన్ తదితర సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా ఈ వాక్సిన్‌ను ప్రజారోగ్య వాక్సినేషన్ కార్యక్రమానికి వినియోగించేందుకు మార్గం సుగమమైంది. "ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి దీనికి ఆమోదం లభించిందంటే నాణ్యత, భద్రత, సమర్థతల విషయంలో ఆమోద యోగ్యమైన ప్రమాణాలు కలిగి ఉన్నట్లే. ఇక ఈ వాక్సిన్‌ను ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలైన యునిసెఫ్, గావి వంటి సంస్థలు సేకరించుకుని ఉపయోగించుకోవచ్చు." అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

## పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గింది

- ఏపి, తెలంగాణల్లో కూడా తగ్గింది
- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

దేశ వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గినట్లుగా వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. శుక్రవారం రాజ్యసభలో వైసిపి సభ్యుడు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి షెకావత్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. 2016-17 ఖరీఫ్ సీజన్‌లో దేశ వ్యాప్తంగా 143 లక్షల హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగు జరిగిందని, 2017-18 ఖరీఫ్ సీజన్‌లో ఆ విస్తీర్ణం 132 లక్షల హెక్టార్లకు తగ్గిపోయిందని మంత్రి చెప్పారు. గత ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 9.42 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి నమోదు కాగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 8.71 మిలియన్ టన్నులకు తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సైతం గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ ఏడాది పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణత గణనీయంగా తగ్గినట్లు మంత్రి గణాంకాలతో సహా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2016-17లో 451 హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగు చేస్తే, 2017-18 393 హెక్టార్లకు తగ్గిందని, తెలంగాణలో 2016-17లో 563 హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగు చేస్తే, 2017-18లో 364 హెక్టార్లకు పడిపోయిందని మంత్రి తెలిపారు.

ప్రత్యేకం

## హెచ్-1బి వీసా నిబంధనల్లో మార్పు వద్దు

- పలువురు కాంగ్రెస్ సభ్యులు, సంస్థలు విజ్ఞప్తి




**వాషింగ్టన్ :** హెచ్-1బి వీసా పొడిగింపును నిలుపుచేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకోదలిచిన నిర్ణయాన్ని, చర్యలను పలు గ్రూపులు, అమెరికన్ పార్లమెంట్ సభ్యులు విమర్శిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తే దాదాపు 5లక్షల నుండి ఏడున్నర లక్షల మంది ఇండియన్ అమెరికన్స్ స్వదేశానికి వెళ్ళే పరిస్థితి ఏర్పడుతుంది. అమెరికా నుండి నిపుణులందరూ వెళ్లిపోవడానికి ఈ చర్య దారి తీస్తుందని కాంగ్రెస్ సభ్యులు పేర్కొంటున్నారు. "అమెరికన్ ఉత్పత్తులే కొనుగోలు చేయాలి, అమెరికన్లకే ఉద్యోగాలు" అంటూ ట్రంప్ చేపట్టిన చొరవలో భాగమే ఈ ప్రతిపాదన. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన ఈ ప్రతిపాదనపై అమెరికా హోం ల్యాండ్ భద్రతా నాయకులు కసరత్తు చేస్తున్నారు. హెచ్-1బి ప్రోగ్రామ్ కింద నైపుణ్యం గల అమెరికన్ సిబ్బంది కొరతగా వున్న రంగాల్లో విదేశాల నుండి వృత్తి నిపుణులను తెచ్చుకోవడానికి కంపెనీలను అనుమతిస్తారు. వారికి తాత్కాలిక అమెరికా వీసాలను ఇస్తారు. కానీ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దానికి ఆటంకాలు సృష్టిస్తున్నారు. డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యురాలు తులసి గబ్బార్డ్ మాట్లాడుతూ, హెచ్-1బి వీసాదారులపై ఇలా కఠినమైన ఆంక్షలు విధించడం వల్ల వారి కుటుంబాలు చెదిరిపోతున్నాయని, మన అమెరికా సమాజం నుండి నిపుణులు, ప్రతిభావంతులు వెళ్ళిపోతారని, కీలకమైన భాగస్వామి అయిన భారత్‌తో మన సంబంధాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఇక్కడ నుండి వెళ్ళిపోయేవారిలో చిన్న తరహా వ్యాపారాలు చేసుకునే వారు, ఉపాధి సృష్టికర్తలు వుంటారని, మన ఆర్థిక వ్యవస్థ బలోపేతమయ్యేందుకు వారి సహకారం ఎంతో వుంటుందని అన్నారు. ఇటువంటి చర్యలు తీసుకుంటే 21వ శతాబ్దంలో ఇతర దేశాలతో పోటీ పడే తత్వం క్షీణిస్తుందని అన్నారు. హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్‌ఎఎఫ్) కూడా ఈ చర్య పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇండియన్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే తిరస్కరించాలని కోరారు. మరో కాంగ్రెస్ సభ్యుడు ఖన్నా స్పందిస్తూ ఈ నిర్ణయం వలసవాదులకు వ్యతిరేకంగా వుందన్నారు.

సంక్షిప్తం

## లాలూ కేసు తీర్పు మరోసారి వాయిదా

**పాట్నా :** పశువుల దాణా కుంభకోణంలో దోషిగా నిర్ధారించిన లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మందికి ప్రత్యేక సిబిఐ కోర్టు శిక్షను ఖరారు తీర్పును శనివారానికి వాయిదా వేసింది. గత రెండు రోజులుగా ఈ కేసు విచారణ వాయిదా పడిన సంగతి తెలిసిందే. శుక్రవారం లాలూతో సహా ఐదుగురు దోషుల వాదనలు సిబిఐ జడ్జి శివ్‌పాల్ సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పూర్తిచేశారు. శనివారం మిగతా వారి వాదనలు విన్న తర్వాత శిక్షకు సంబంధించిన తీర్పును ప్రకటిస్తారు. ఆయన అనారోగ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని లాలూ తరుపు న్యాయవాదులు కోరారు.

## లంచం తీసుకుందన్న ఆరోపణపై ఉపాధ్యాయురాలి అరెస్ట్

**భువనేశ్వర్ :** లంచం తీసుకున్నారనే ఆరోపణపై ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిని యాంటీ గ్రాఫ్ట్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు.పాఠశాలల పిల్లల యూనిఫారం తయారీలో 8,200 లంచం ఇవ్వాలని టైలర్‌ను డిమాండ్ చేసిందన్న ఆరోపణపై ఒడిషాలోని భద్రాక్ జిల్లాలోని చరిగరియా అప్పర్ ప్రైమరీ స్కూల్ అనితా ప్రధాన్ అనే ఉపాధ్యాయురాలిని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఒక టైలర్ నుండి దుస్తుల తయారీలో 134 జతలకు ఖర్చు అయిన మొత్తాన్ని 26,800 చెక్కు రూపంలో బిల్లు కడతానని, దానికి తనకు కొంత లంచం ఇవ్వాలని ప్రధాన్ డిమాండ్ చేయడంతో టైలర్ ఫిర్యాదు చేసిందని విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.

## గురుగ్రహం ఫొటోలు తీసిన జునో

**హ్యూస్టన్ :** అమెరికన్ స్పేస్ ఏజెన్సీ నాసా పంపిన జునో స్పేస్‌క్రాఫ్ట్.. గురు గ్రహానికి చెందిన అద్భుతమైన ఫొటోలను తీసింది. సౌర కుటుంబంలో అతి పెద్ద గ్రహమైన జూపిటర్ కక్ష్యలోకి చేరినప్పటి నుంచి అక్కడి విశేషాలను జునో అందిస్తూనే ఉన్నది. జునో కారణంగా ఏడాది కాలంగా గురు గ్రహానికి సంబం ధించి విప్లవాత్మకమైన విషయాలు తెలుస్తున్నాయి. తాజాగా గురు గ్రహ వాతా వరణానికి చెందిన ఓ కండ్లు చెదిరే ఫొటోను జునో తీసింది. దీనిని నాసా తాజాగా బయటపెట్టింది. ఈ ఫొటో తీసిన సమయంలో జూపిటర్‌కు చాలా దగ్గరగా జునో ఉంది.

## అల్ షబాబ్ నేత అంతర్జాతీయ తీవ్రవాది

### అమెరికా ప్రకటన

**మొగదిషు :** సోమాలియా కేంద్రంగా పనిచేసే అల్ షబాబ్ తీవ్రవాద గ్రూపు నాయకుడు అబుకర్ అలీ అడన్‌ను అంతర్జాతీయ తీవ్రవాదిగా అమెరికా ప్రభుత్వం గుర్తించింది. అమెరికా పరిధిలోని ఆయన ఆస్తులన్నీ స్తంభింపచేసినట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అడన్‌తో అమెరికా పౌరులెవరూ కూడా ఎలాంటి లావా దేవీలు జరపరాదని పేర్కొంది. అల్‌ఖైదాతో సంబంధాలు కలిగిన అల్ షబాబ్ ఆఫ్రికాలో అత్యంత ప్రమాదకరమైన ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపు. సోమా లియా రాజధాని మొగదిషులో అక్టోబరులో జరిగిన ట్రక్కు దాడిలో 512మంది మరణించిన విషయం విదితమే.



మంచుకప్పు

చైనాలోని తూర్పు, ఈశాన్య ప్రాంతంలో మంచు తీవ్రంగా కురుస్తుండటంతో స్తంభించిన జన జీవనం

## క్యూబాకు విశ్వసనీయమైన మిత్రపక్షం ఇయు

### త్వరలో పలు ఒప్పందాలపై సంతకాలు

**హవానా :** క్యూబాకు అత్యంత విశ్వసనీయమైన మిత్ర పక్షం యురోపియన్ యూనియన్ అని ఇయు దౌత్యవేత్త ఫెడెరికా మొగెరిని గురువారం వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో అమెరికా, క్యూబా సంబంధాలు మళ్లీ దెబ్బతింటున్న నేపథ్యంలో క్యూబాతో పలు ఒప్పందాలను కుదుర్చుకుంటున్నట్లు ప్రకటించారు. హవానాలో రెండు రోజుల అధికార పర్యటన ముగిసిన అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇయు క్యూబాకు ధృఢమైన, నిర్దిష్టమైన, విశ్వసనీయమైన భాగస్వామి అని పేర్కొన్నారు. క్యూబాతో విభేదాలు వున్నప్పటికీ విదేశాంగ విధాన సంబంధాల బలోపేతానికి అనుగుణంగానే వుందని చెప్పారు. పునర్వినియోగ ఇంధనం, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో సహకారానికి క్యూబాతో 5.204 కోట్ల డాలర్ల విలువైన పలు ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. 1300కోట్ల డాలర్లకు పైగా ఆర్థిక నష్టాలను కలిగించిన ఇర్మా తుపాను నేపథ్యంలో పునర్నిర్మాణ యత్నాలకు తోడ్పాటుగా 90లక్షల యూరోలను క్యూబాకు ఇయు విరాళంగా ఇచ్చింది. ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ మరో 19 ఇయు దేశాలు కూడా క్యూబాలో, ముఖ్యంగా పర్యాటక రంగంలో విస్తృతంగా పెట్టుబడులు పెట్టాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో క్యూబాతో దౌత్య సంబంధాలు పునరు ద్ధరించబడ్డాయి. అయితే ట్రంప్ ప్రభుత్వం ఆ చర్యల నుండి పాక్షికంగా వెనుకకు మళ్ళడంతో మళ్లీ రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. ట్రంప్ చర్యల పట్ల మొగెరిని విచారం వ్యక్తం చేస్తూ ఇయు విదేశాంగ విధానం, దృక్పథం స్వయంప్రతిపత్తితో కూడినవని చెప్పారు.



## దక్షిణాఫ్రికాలో పట్టాలు తప్పిన రైలు

### 18మంది మృతి, 254మందికి గాయాలు

**క్రూన్‌స్టాడ్ :** దక్షిణాఫ్రికాలో గురువారం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 18మంది మరణించగా, 254మంది గాయపడ్డారు. పోర్ట్ ఎలిజబెత్ నుండి జోహాన్నెస్‌బర్గ్‌కు వెళుతున్న రైలు క్రూన్‌స్టాడ్ సమీపంలో లెవల్ క్రాసింగ్ వద్ద పట్టాలు దాటుతున్న ట్రక్కును ఢీకొంది. దీంతో అనేక బోగీలు వంకర్లు తిరిగి పట్టాలు తప్పాయి. వెంటనే మంటలు ఎగిశాయి. దుర్ఘటన జరిగిన వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు బోగీల నుండి బయటకు రావడానికి ప్రయత్నించడం కనిపించింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే అక్కడకు వచ్చిన సహాయక కార్యకర్తలు బాధితులను ఆస్పత్రుల్లో చేర్చారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. ప్రస్తుతం అతడు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రైలు వస్తుండగా ట్రాక్ దాటడానికి ప్రయత్నించడమే కారణమై వుండవచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చర్చలకు ఉభయ కొరియాలుసిద్ధం

### 9న ఇరుదేశాల ప్రతినిధుల భేటీ
### ద.కొరియా సైనిక విన్యాసాల వాయిదా



**సియోల్:** ఉభయకొరియాల మధ్య సంబంధాల మెరుగుదలే లక్ష్యంగా చర్చలకు ద.కొరియా చేసిన ఆహ్వానాన్ని తాము అంగీకరిస్తున్నట్లు ఉ.కొరియా ప్రకటించింది. ద.కొరియాతో కలిసి తలపెట్టిన సంయుక్త సైనిక విన్యాసాలను వాయిదా వేసేందుకు అంగీకరిస్తున్నట్లు అమెరికా ప్రకటించిన కొద్ది గంటలలోనే ఉ.కొరియా తన అంగీకారాన్ని తెలిపినట్లు ద.కొరియా వెల్లడించింది. ఈ నెల 9వ తేదీన ఉభయ దేశాల ప్రతినిధి వర్గాలూ భేటీ అవుతాయని ద.కొరియా తన ప్రకటనలో వివరించింది. ఈ చర్చల్లో శీతాకాలపు ఒలింపిక్స్ నిర్వహణతో పాటు పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ఇతర అంశాలకు కూడా వుంటాయని ద.కొరియా ప్రభుత్వ ప్రతినిధి బేర్ టేహ్యూన్ మీడియాకు చెప్పారు. శీతాకాలం ఒలింపిక్ క్రీడలు పూర్తయ్యే వరకూ సైనిక విన్యాసాలను వాయిదా వేసేందుకు అమెరికా అంగీకరించిందని ఆయన వివరించారు. అమెరికా తమపై దురాక్రమణకు చేసే ప్రయత్నాలలో భాగంగానే ఈ సైనిక విన్యాసాలు తలపెట్టినట్లు ఉ.కొరియా భావిస్తుండటంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొరియా ఏకీకరణపై చర్చలకు ద.కొరియా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను తాము అంగీకరిస్తున్నామని ఉ.కొరియా ప్రభుత్వం శుక్రవారం సందేశం పంపింది.

ఉభయదేశాల సరిహద్దుల్లోని పాన్‌మున్‌జోన్ గ్రామంలో వచ్చే మంగళవారం జరుగనున్న ఈ చర్చల్లో ఒలింపిక్ క్రీడల సహకారంతోపాటు ఇరుదేశాల మధ్య సంబంధాల మెరుగుదలకు అవసరమైన అంశాలపై కూడా చర్చిస్తామని ద.కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## విద్యుత్ ఉత్పాదక రంగంలో అగ్రగామి చైనా

**బీజింగ్:** గత ఏడాది చివరినాటికి 177 కోట్ల కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సాధించటం ద్వారా ప్రపంచంలోనే విద్యుత్ ఉత్పాదక రంగంలో చైనా అగ్రగామిగా నిలిచిందని ఎకనామిక్ డైలీ పత్రిక తన వార్తా కథనంలో వివరించింది. విద్యుత్ ఉత్పాదక వ్యయం తగ్గించటంతో పాటు పారిశ్రామిక స్థాయి ఉత్పాదకతను మెరుగుపర్చటం ద్వారా దేశ ప్రగతికి జవసత్వాలు చేకూర్చిందని ఈ పత్రిక తన కథనంలో వివరించింది. గత ఏడాది చివరినాటికి సమకూర్చుకున్న 177 కోట్ల కిలోవాట్ల ఉత్పత్తి సామర్థ్యంలో శిలాజ ఇంధనేతర విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 2012 నాటి 9.6 శాతం నుండి ఇప్పుడు 38.1 శాతానికి చేరిందని చైనా జాతీయ విద్యుత్ వ్యవస్థ (ఎన్‌ఇఎ) గణాంకాలను ఉటంకిస్తూ ఈ పత్రిక వివరించింది. దీనితో పాటు పునరావృత విద్యుత్ ఉత్పాదకత కూడా గణనీయంగా పెరిగిందని (ఎన్‌ఇఎ) వెల్లడించింది. చైనా విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 65.4 శాతం వార్షిక పెరుగుదలతో గత సెప్టెంబర్ చివరి నాటికి 12కోట్ల కిలోవాట్ల స్థాయికి చేరిందని, దీనితో పాటు విద్యుత్ వినియోగ స్థాయి కూడా పెరిగిందని వివరించింది. పునరావృత ఇంధన వనరుల ద్వారా గత ఏడాది మొదటి తొమ్మిది నెలల కాలంలో ఉత్పత్తి అయిన విద్యుత్ మొత్తం 1.17 లక్షల కోట్ల కిలోవాట్లు. ఇందులో పవన, సౌర, జీవ వనరుల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ వరుసగా 26,70, 25 శాతం మేర వుందని ఎన్‌ఇఎ తన గణాంకాలలో వివరించింది. ఇప్పుడు సౌర విద్యుత్ ఉత్పాదనకు సంబంధించిన ఫోటో వోల్టాయిక్ సెల్స్ ఉత్పత్తిని చైనా సొంతంగా తయారు చేసుకునే సామర్థ్యం సంతరించుకోవటంతో విద్యుత్ ఉత్పాదక వ్యయం కూడా గణనీయంగా తగ్గిందని చైనా ఫోటోవోల్టాయిక్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాంగ్ బహువా వివరించారు.

## మాస్కో, కైరోల మధ్య విమాన రాకపోకలు పునరుద్ధరణ

**మాస్కో :** మాస్కో నుండి కైరోకు నేరుగా విమాన సంబంధాలను తిరిగి నెలకొల్పుతూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం డిక్రీపై సంతకాలు చేశారు. కొగలిమావియా ఎయిర్‌లైన్స్‌కి చెందిన కమర్షియల్ విమానంపై తీవ్రవాదులు దాడి చేసిన నేపథ్యంలో కైరోకు విమానాల రాకపోకలను మాస్కో నిలిపివేసింది. 2015 నవంబరులో జరిగిన ఈ విమాన దుర్ఘటనలో 224మంది మరణించారు. పౌర విమానాల భద్రతకు పాటించాల్సిన ప్రొటోకాల్‌పై డిసెంబరు 15న ఇరుదేశాల రవాణా మంత్రులు సంతకాలు చేశారు. వైమానిక సంబంధాలు పునరుద్ధరించుకోవడానికి గల షరతుల్లో ఇదొకటి. గత రెండేళ్ళుగా కైరోలో భద్రతా పరిస్థితులను రష్యా అధికారులు అంచనా వేస్తున్నారు. రష్యా విమానాలకు కైరోలోని రెండు విమానాశ్రయాలు భద్రత కల్పించే స్థితిలో వున్నాయా లేవా అని సమీక్షించిన అనంతరం సంబంధాలను పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుండి విమానాల రాకపోకలను పునరుద్ధరించనున్నారు.

## క్లింటన్ ఫౌండేషన్ కార్యకలాపాలపై దర్యాప్తు ప్రారంభం

**వాషింగ్టన్ :** క్లింటన్ ఫౌండేషన్ కార్యకలాపాలపై అమెరికా న్యాయ శాఖ దర్యాప్తు ప్రారంభించింది. హిల్లరీ క్లింటన్ విదేశాంగ మంత్రిగా వున్న సమయంలో రాజకీయాలు నెరిపేందుకు ఈ ఫౌండేషన్ ముడుపులు తీసుకుందా లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడిందా లేదా అనే విషయాలపై ఈ దర్యాప్తు జరుగుతోందని ది హిల్ వార్తాపత్రిక పేర్కొంది. తమ ఛారిటీ సంస్థలకు విరాళాలు ఇస్తే విధానాల పరంగా ప్రయోజనాలు చేకూర్చేందుకు క్లింటన్ ద్వయం హామీలేమైనా ఇచ్చారా అనే అంశంపై దర్యాప్తు సాగుతోంది. క్లింటన్ ఫౌండేషన్ ప్రారంభమైన ఆర్కాన్సాస్‌లో ఎఫ్‌బిఐ ఏజెంట్లు దర్యాప్తు చేపట్టారని, గత నెల రోజుల కాలంలో కొంతమందిని ఇంటర్వ్యూ కూడా చేశారని న్యాయ శాఖాధికారులు హిల్ పత్రికకు తెలిపారు. కాగా ఈ దర్యాప్తు సమాచారంపై వ్యాఖ్యానించమని క్లింటన్ ఫౌండేషన్ అధికారులను కోరగా వారి నుండి ఎలాంటి ప్రతిస్పందన లేదు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఎన్నడూ ఎలాంటి లావాదేవీలు జరపలేదని గతంలో ఫౌండేషన్ తెలిపింది. దీనిపై డెమోక్రాట్లు స్పందిస్తూ ఇదంతా బూటకమైన దర్యాప్తు అని ఆరోపించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లర్ దర్యాప్తు నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకే ఇదంతా చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

## చలితో వణుకుతున్న అమెరికా

- రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పతనం
- 12మంది మృతి



**బోస్టన్/న్యూయార్క్ :** ఈ శీతాకాలం సీజనులో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పతనం కావడంతో అమెరికా నిలువెల్లా చలితో వణుకుతోంది. రోడ్లపై 10 నుండి 12 అంగుళాల మందాన పేరుకుపోయిన మంచును తొలగించడానికి సిబ్బంది రాత్రింబవళ్ళూ పనిచేస్తున్నారు. రాత్రి వేళల్లో మైనస్ 40ఫారెన్‌హీట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మంచుకు తోడు ఉధృతంగా శీతల పవనాలు వీస్తుండడంతో ఇప్పటివరకు 12మంది మరణించారు. శుక్రవారం తెల్లవారు జామున విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో దాదాపు 21వేల మంది అంధకారంలో మగ్గుతున్నారు. తూర్పు ప్రాంతంలోని విద్యుత్‌లైన్ల మరమ్మత్తులకు సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా వుండవచ్చునని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. బోస్టన్, న్యూజెర్సీలోని పలు ప్రాంతాలు, మైయిన్‌ల్లో అడుగు మందాన మంచు పేరుకుపోతోంది. దీంతో శుక్రవారం పలు ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేశారు.

మొదటి పేజీ తరువాయి

## తేలని 'తలాక్'

55 ప్రకటనలు చేశారు. సభ కార్యకలాపాలకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రెండు ప్రకటనలు చేశారు. 2,255 పత్రాలను కేంద్ర మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. వివిధ పార్టీలకు సంబంధించిన ఎంపిలు వివిధ అంశాలపై 98 ప్రైవేట్ మెంబర్ బిల్లులను ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 8 గంటల 10 నిమిషాల పాటు సభా సమయం వృధా అయ్యింది. సభలో 14 బిల్లులు ప్రవేశపెట్టారు. ఇందులో 13 బిల్లులు ఆమోదం పొందగా, రాజ్యసభలో 9 బిల్లులు ఆమోదం పొందాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో మొత్తం 13 బిల్లులు ఆమోదం పొందాయి. ఒక బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. లోక్‌సభలో రూల్ 193 ప్రకారం ఓఖీ తుఫాన్‌పై స్వల్పకాలిక చర్చ జరిగింది. రాజ్యసభలో రూల్ 176 ప్రకారం ఢిల్లీ కాలుష్యం, దేశంలో ఉపాధి కల్పన-ఆర్థిక, పెట్టుబడి వాతావరణం రెండు అంశాలపై స్వల్ప కాలిక చర్చ జరిగింది.

**ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రెండు దశల్లో జరిగే ఈ సమావేశాలు తొలి విడత ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరగనున్నాయి. రెండో విడత మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు నిర్వహించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వర్గ సంఘం(సిసిపిఎ) నిర్ణయం తీసుకుందని ఆశాఖ మంత్రి అనంత్ కుమార్, సహాయ మంత్రులు విజయ్ గోయల్, అర్జున్ రామ్ మేఘ్వాల్‌లతో కలసి శీతాకాల సమావేశాల ముగింపు అనంతరం విలేకరులకు తెలిపారు. మరోవైపు శీతాకాల సమావేశాల్లో రాజ్యసభలో ఆమోదం పొందలేకపోయిన ట్రిపుల్ తలాక్ బిల్లుపై బడ్జెట్ సమావేశాల్లో మరోసారి చర్చకు అవకాశం ఉంది.

## తాంత్రిక పూజలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్ర సలహా దారుడు శ్రీరాంశర్మ తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు బద్రీనాథ్ బాబు, ఆయన మేనల్లుడు పార్థసారధి అలియాస్ రాజ, సృజన్‌తో పాటు పరిచారకులు, ఆలయ సిబ్బంది, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, విష్ణు ప్రసాద్ శర్మ విచారణకు హాజరై వివరణలు ఇచ్చారు.

**నేడు నివేదిక సమర్పించే అవకాశం**

దుర్గ గుడిలో తాంత్రిక పూజల ఘటనపై ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ శనివారం తమ నివేదికను సమర్పించనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారమే నివేదికను అందించాలని తొలుత అనుకున్నా ఆలయ కమిటీ సభ్యులు రాకపోవడం ఈ నిర్ణయం తీసుకున్నట్లు విచారణ కమిటీ సభ్యులు తెలిపారు.ఆలయంలో ఎటువంటి తాంత్రిక పూజలు జరగలేదన్న అంశాన్నే విచారణ కమిటీ నివేదికలో వెల్లడించనున్నట్లు సమాచారం. అయితే దుర్గ గుడి వ్యవహారంలో ప్రభుత్వం మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. నేరం రుజువు కానిదే ఈవోను బదిలే చేసేందుకు వీలులేదన్న వాదనను ప్రభుత్వం ముందుకు తీసుకొస్తోంది.

## పాక్‌కు భద్రతా సాయం బంద్

అధికారులు వివరించారు. అమెరికా ప్రభుత్వ తాజా నిర్ణయానికి, ముంబయి దాడుల విడుదలకు ఎటువంటి సంబంధమూ లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయం మేరకు 2017 సంవత్సరానికి సంబంధించి మొత్తం 90 వేల కోట్లడాలర్ల నిర్ణయం నిలిచిపోనుంది. తాము హక్కానీ నెట్‌వర్క్‌పై నిర్దిష్ట చర్యలు తీసుకున్నట్లు పాక్ ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించిన తరువాత మాత్రమే ఇందులో 40 వేల కోట్ల డాలర్ల సాయం అందుతుంది. అమెరికా అందిస్తున్న సాయానికి ప్రతిగా ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై తాము తీసుకున్న చర్యలతో ఏటా సమర్పించే నివేదికను పాక్ ప్రభుత్వం 2015 నుండి అందించకపోవటంతో ఈ సాయం పెండింగ్‌లో పడింది. పాకిస్తాన్ తన వ్యవహార శైలిని మార్చుకుంటే ఈ నిర్ణయంపై పునరాలోచన చేస్తామని అమెరికా రక్షణ, విదేశాంగశాఖలు స్పష్టం చేశాయి.

**అమెరికా సాయం లేకపోయినా బతగ్గలం : పాకిస్తాన్**

తమకు భద్రతా పరమైన సాయాన్ని సస్పెండ్ చేస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని పాకిస్తాన్ కొట్టిపారేసింది. పాక్ విదేశాంగ మంత్రి క్వాజా ఆసిఫ్ గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ అమెరికా సాయం నిలిచిపోయినంత మాత్రాన ఏ కార్యక్రమాలూ నిలిచిపోవని, తాము యధాతథంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తామని చెప్పారు. గతంలో కూడా ఇటువటి పరిస్థితే ఎదురైందని, కష్టకాలంలో వారెప్పుడూ తమను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆసిఫ్‌ను ఉటంకిస్తూ జియో న్యూస్ ఛానల్ వెల్లడించింది. తమ నుండి వందల కోట్ల డాలర్ల సాయం అందుకుంటున్న పాకిస్తాన్ ఉగ్రవాదంపై పోరులో తమను మోసం చేస్తూ అబద్ధాలు చెబుతోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

# పిల్లలను కనండి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. బొబ్బిలి సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలతో పోల్చి చూస్తే మన రాష్ట్రంలో వాటి సంఖ్య తక్కువేనని అన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థల ఒత్తిడి వల్లే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో 2019 నాటికి శతశాతం అక్షరాస్యత సాధించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. పాఠశాలల్లో రూ.ఐదు వేల కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. త్వరలో సిలబస్ కూడా మార్పు చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఎపిని నాలెడ్జ్ హబ్‌గాతీర్చిదిద్దేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్త విద్యాసంస్థల ఏర్పాటుతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లు మార్పు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ ఐదు వేల స్కూళ్లలో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశామని తెలిపారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన వారికి ఇంటర్, ఆపై చదువులు ఉచితంగా కల్పిస్తామన్నారు. ఆత్మస్థైర్యం, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత కల్పించేందుకు ఈ ఏడాది 7,77,000 మంది విద్యార్థినులకు కరాటేతోపాటు యోగా, కూచిపూడిలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఐఎఎస్, ఐపిఎస్ కోచింగ్ ఉచితంగా కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, కలెక్టర్ వివేక్‌యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ధర్మసాగరం సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడాదిన్నర కాలంలో రూ.50వేల కోట్లు ఖర్చు చేసి 19 లక్షల ఇళ్లను నిర్మించనున్నట్లు ప్రకటించారు.ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్గితే, వ్యవసాయ పంటల సాగుపై రైతులు మెలకువలు తెలుసుకొనే అవకాశముందన్నారు. వచ్చే మార్చి నాటికి పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు నిర్మించిన ఏకైక రాష్ట్రంగా మన రాష్ట్రం నిలిచిపోనుందని చెప్పారు. ఆదాయం పెంచేమార్గాలతో పాటు ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించి అవకతవకలు జరగకుండా పరిపాలన అందిస్తున్నామన్నారు. ఉపాధి నిధులతో అనేక మౌలికసదుపాయాలు సమకూర్చుతున్నామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో నూరుశాతం సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని, ఎల్‌ఇడి బల్బులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వంశధార నుంచి పెన్నానది వరకు నదులు అనుసంధానం చేసి గోదావరి, కృష్ణా నదులను కలుపుతామని తెలిపారు. భూగర్భ జలాలు పెంచి భూమిని జలాశయంగా తయారు చేసి నీటి కొరత లేకుండా చేస్తామన్నారు. ఎవరికీ ఒక్క రూపాయ ఇచ్చే పనిలేకుండా ఇంటి దగ్గర కూర్చొంటే పని పూర్తయ్యేలా శ్రీకారం చుట్టామని వెల్లడించారు. తొలుత ధర్మసాగరం గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రైన నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ఏం చేసుకుంటారో చేసుకోండి! మత్స్యకారులపై చంద్రబాబు ఆగ్రహం**

మత్స్యకారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చడంపై లిఖిత పూర్వకమైన హామీ ఇవ్వాలని కోరడంపై ఆసహనం వ్యక్తం చేశారు. ఏం చేస్తారో చేసుకోండని అన్నారు. ఎక్కువ మాట్లాడితే మీ సంగతి చూస్తానంటూ బెదిరించారు. దీంతో మత్స్యకార సంఘాల నేతలు సిఎం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ పార్టీ మంత్రి, ఎమ్మెల్యే రమ్మంటేనే వచ్చామంటూ సమాధానమివ్వడంతో సిఎం అక్కడ నుంచి వెళ్లిపోయారు. నర్సీపట్నంలో జన్మభూమిలో పాల్గొనేందుకు గురువారం రాత్రి విశాఖ నగరంలోని పోర్టు గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు బస చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం మత్స్యకార సంఘాల నేతలు, మాజీ మేయర్ పులుసు జనార్థన్ తదితరులు విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ పది రోజులుగా నగరంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. దీక్ష విరమిస్తే ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్తానని ఇటీవల దీక్షా శిబిరాన్ని సందర్శించిన మంత్రి గంటా శ్రీనివాసరావు మత్స్యకారులకు సూచించారు. అయితే సంఘాల నేతలు అందుకు అంగీకరించలేదు. సిఎం లిఖిత పూర్వక హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తామన్నారు. అయితే వాసుపల్లి.. శుక్రవారం సిఎం వద్దకు తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎమ్మెల్యే వాసుపల్లి, మంత్రి గంటాపైనా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆందోళనలు, దీక్షలు చేస్తే భయపడేది లేదని మత్స్యకార సంఘాల నేతలపై రుసరుసలాడారు. ఏం చేసుకుంటారో చేసుకోండని దుర్భాషలాడటంతో మత్స్యకారులు నిశ్చేష్టులయ్యారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అడిగితే బెదిరిస్తున్నారంటూ మత్స్యకారులు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

## దళితులపై టిడిపి కార్యకర్తల దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆ వీధిలో టిడిపికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ.. జన్మభూమి సభకు రావద్దంటూ దళితులను హెచ్చరించారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఇంతలో టిడిపికి చెందిన మరికొంతమంది అక్కడికి చేరుకొని దళితులపై రాళ్లతో దాడి చేశారు. దీంతో, దళితులు గండ్రేటి గణేష్, గండ్రేటి బంగార్రాజు, గండ్రేటి గౌరి, మిరప కుమార్, వసంత సంతోష్ భూషణ్‌రావు, పోలిపల్లి కాంతం గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనంలో విజయనగరంలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బాధితులను చూసేందుకు వారి కుటుంబ సభ్యులు ఆటోల్లో విజయనగరం వెళ్తుండగా మార్గం మధ్యలో అల్లుపేట పెట్రోల్ బంకు వద్ద సుమారు 25 మంది టిడిపి కార్యకర్తలు అడ్డుకొని కర్రలు, రాళ్లతో దళితులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గండ్రేటి సురేష్, ఊడికల బంగార్రాజు, మిరప సత్యం, ఊడికల సంతోష్ కుమార్‌కు గాయాలయ్యాయి. టిడిపికి చెందిన ఎర్నింటి శ్రీను, ఎర్నింటి రాము కూడా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలతో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నమ్మకంగా పిలిచి నిర్బంధించారు..**

విజయనగరం జిల్లా బొబ్బిలి జన్మభూమి సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం వచ్చిన నేపథ్యంలో పలు సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. పోలీసుల అక్రమ నిర్బంధానికి గురైన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎ.సురేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు కోట అప్పన్న, సిఐటియు బొబ్బిలి డివిజన్ అధ్యక్షులు పి.శంకరరావు, వి.శేషగిరి, ఐఎఫ్‌టియు నాయకులు అప్పికొండ సింహాచలం, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు మీసాల లక్ష్మి, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు రవిచంద్ర ఉన్నారు. సిఎం అపాయింట్‌మెంట్ కోరకముందే పోలీసులు ఫోన్ చేసి మరీ వీరిని రప్పించుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసే ఉద్దేశముంటే ముందే చెప్పాలని, బొబ్బిలి రాజా కాలేజీకి రావాలని ప్రజాసంఘాల నాయకులను డిఎస్‌పి సౌమ్యలత ఆహ్వానించారు. తీరా వారంతా వచ్చాక సిఎం వచ్చే సమయానికి వారిని నిర్బంధించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సిఎం సభ ముగిసే వరకూ నిర్బంధంలోనే ఉంచారు. అనంతరం విడిచిపెట్టారు. సభ అనంతరం వాహనంలో వెళ్లిపోతున్న సిఎంకు వారు వినతులు ఇవ్వబోతుండగా సిఎం స్పెషల్ సెక్యూరిటీ సిబ్బంది వాటిని లాగేసుకున్నారు. దీంతో, వారంతా నిరాశతో వెనుదిరిగారు. దీనికి ముందు సిపిఐ నాయకులు ఒమ్మి రమణను పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.

## ట్రాన్స్‌ట్రాయ్ వాహనాల సీజ్‌కు యత్నం

(మొదటి పేజీ తరువాయి)

చేరిందని తెలిపారు. మూడేళ్లుగా నోటీసులు పంపుతున్నా, సమాధానం లేకపోవడంతో ట్రాన్స్‌ట్రాయ్ ప్రధాన కార్యాలయానికి బ్యాంకు అధికారులు వెళ్లారని చెప్పారు. స్పందించక పోవంతో కోర్టు ఆదేశాల మేరకు కంపెనీ వాహనాలను జప్తు చేయడానికి వచ్చామన్నారు. గత ఏడాది నవంబర్ 29న కేసు నమోదైందని తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ మోహన కుమార్ మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టు పనులు జరుగుతుండగా జిల్లా అధికారి ప్రమేయం లేకుండా వాహనాలను సీజ్ చేయడం చట్ట విరుద్ధమని చెప్పారు. ఆర్‌డిఒగా తన అనుమతి, స్థానిక పోలీసుల అనుమతి లేకుండా ప్రాజెక్ట్ ప్రాంతంలో ఎటువంటి కార్యకలాపాలు చేయరాదని అన్నారు. బ్యాంకు అధికారులు ఆ ప్రాంతం నుండే ఉన్నతాధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ అనుమతి పొందడానికి వెళ్లనున్నట్లు తెలిపారు. బ్యాంకు అధికారుల బందంలో అడ్వకేట్ కమిషనర్ రాజారత్నం, హైదరాబాద్, కాకినాడ దేనా బ్యాంకు మేనేజర్లు గోపాల్, వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం అడ్వకేట్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

## కనీస నిల్వ తగ్గించనున్న ఎస్‌బిఐ

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు, ఖాతాదారుల నుంచి వస్తున్న వ్యతిరేకతతో కనీస నిల్వల మొత్తాన్ని 75 శాతం తగ్గించాలని ఎస్‌బిఐ యోచిస్తోంది. 2017 ఏప్రిల్ 1 నుంచి ఎస్‌బిఐ ఈ నెలవారీ సగటు నిల్వల ఛార్జీలను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మెట్రో ప్రాంతాల్లో రూ.2999 నుంచి రూ.1500 మధ్యలోకి బ్యాలెన్స్ పడిపోతే రూ.30 జరిమాన విధిస్తుంది. అదే రూ.1499 నుంచి రూ.750 నిల్వ ఉన్న వారు రూ.40, రూ.750 కంటే తక్కువుంటే రూ.50 చొప్పున పెనాల్టీ వేస్తోంది. చిన్న పట్టణాల్లో ఖాతాదారులు కనీస నిల్వ రూ.2000 కలిగి ఉండాలి. అంతకంటే తగ్గితే రూ.20 - రూ.40 వరకు జరిమాన విధిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కనీస నిల్వ రూ.1000గా ఉంది. అంతకంటే తగ్గితే ఖాతా నిల్వను బట్టి రూ.20-40 వరకు పెనాల్టీ వేస్తోంది.

## శ్రీకాళహస్తిలోనూ ..

(మొదటి పేజీ తరువాయి)

వహించారన్న కోణంలో ఈఓ భ్రమరాంబ ఆయన్ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. తాంత్రిక పూజలపై వివరణ ఇవ్వాలని నోటీసులు పంపారు. కాలభైరవుని ఆలయంలో క్షుద్రపూజలు చేసేందుకు ఆలయ సూపరింటెండెంట్ ధనపాల్ నెలరోజుల ముందే పథకం పన్నినట్లు చర్చించుకుంటున్నారు. ఆయన విధుల్లో ఉండగానే తరచూ భైరవ కోనకు వెళ్లొచ్చేవారని, ఈ విషయం తెలిసి పలుమార్లు ఈఓ భ్రమరాంబ మందలించినట్లు సమాచారం. అయినా గత నెల డిసెంబర్ 18వ తేదీ అమావాస్య అర్ధరాత్రి ధనపాల్ 50 మంది తమిళ భక్తులతో క్షుద్ర పూజలు చేస్తున్నట్లు వీడియో రికార్డింగ్ బయటపడింది. ఆలయంలోని కొందరు అర్చకులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నట్లు చర్చించుకుంటున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంబందం గురుకుల్ పర్యవేక్షణాలోపంపై కూడా విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ పూజలు ఎవరి మేలు కోరి చేశారో తెలియరాలేదు. దీనిపై ఈవో భ్రమరాంబను వివరణ కోరగా ఆ రోజు జరిగినవి సాత్విక పూజలు కావని నిర్ధారించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ధనపాల్ సుమార్ 50 మంది భక్తులతో కలిసి పూజలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. ఆ మేరకు వివరణ ఇవ్వాలని నోటీసులు పంపినా ఆయన నుంచి ఇంత వరకూ స్పందన లేదన్నారు.

## జర్నలిస్టుల తొలగింపుపై ఎన్ఎజె ఆందోళన

**హైదరాబాదు:** ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో పెద్ద ఎత్తున జర్నలిస్టులను తొలగించటం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె) అధ్యక్షుడు ఎస్.పాండే, ప్రధాన కార్యదర్శి ఎం కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యాల చర్యలను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. యాజమాన్య చర్యలను నిరోధించేందుకు, ఉద్యోగ భద్రత కొరకు మీడియాలోని అన్ని తరగతుల జర్నలిస్టులు ఆందోళనకు సిద్ధంకావాలని పిలుపు నిచ్చారు. మజీతియా వేతన సంఘ సిఫార్సులను అమలు జరపాలని సుప్రీం కోర్టు యాజమాన్యాలను స్పష్టంగా ఆదేశించిన తరువాత దానిని వమ్ము చేసేందుకు, వుద్యోగులలో భయాన్ని కలిగించేందుకు యాజమాన్యాలు పెద్ద ఎత్తున తొలగింపులకు పూనుకున్నాయని, డిజిటల్ విభాగాల పేరుతో వేతన సిఫార్సులను నీరు గార్చేందుకు పూనుకున్నాయని పేర్కొన్నారు. తాజాగా ఎన్‌డిటివీలో కొంత మంది సిబ్బందిని తొలగించారని, సంస్థలో పనిచేసే వారిలో 25శాతం మందిని తొలగించేందుకు యాజమాన్యం ఆలోచిస్తున్న వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. వేతన సంఘసిఫార్సులను సవాలు చేస్తూ కోర్టుకు వెళ్లిన ఏబిపి సంస్థ,హిందూస్తాన్ టైమ్స్ వంటి సంస్థలు వందల మందిని తొలగించటం, కొన్ని విభాగాల మూసివేత, ఎడిషన్ల రద్దు వంటి చర్యలకు పూనుకున్నాయని తెలిపారు. మీడియా సంస్థలకు ప్రకటనల రూపంలో ఆదాయం పెరుగుతున్నప్పటికీ వుద్యోగులను తొలగించేందుకు పూనుకోవటం గర్హనీయమని పేర్కొన్నారు.

# రవితేజ 'నేల టికెట్' గాడు


రవితేజ, కల్యాణ్ కృష్ణతో చిత్రబృందం

కల్యాణ్ కృష్ణ...'సోగ్గాడే చిన్ని నాయనా', 'రారండోయ్ వేడుక చూద్దాం' సినిమాలతో విజయాలు అందుకున్న దర్శకుడు. తన తదుపరి సినిమా రవితేజతో చేస్తున్నాడు. ఈ సినిమాకు 'నేల టికెట్' అనే టైటిల్ పరిశీలనలో వున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ శుక్రవారం హైదరాబాద్ కాజాగూడాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రారంభమైంది. రవితేజతోపాటు పలువురు హాస్య నటులపై కొన్ని సన్నివేశాలు చిత్రించారు. మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. 'ఫిదా' సినిమాకు సంగీతం అందించిన శక్తికాంత్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నాడు. చోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. రవితేజ తాజా సినిమా 'టచ్ చేసి చూడు' ఈనెలలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎస్ ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్నారు. ముకేశ్ కెమెరామెన్.

# ఈ 'తెలివైనోడు' ఫిబ్రవరిలో వస్తాడు


సాయి ధరమ్ తేజ్

సాయి ధరమ్ తేజ్ కథానాయకుడిగా రూపొందుతోన్న సినిమా 'ఇంటెలిజెంట్'. లావణ్య త్రిపాఠి కథానాయిక. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లిమిటెడ్ పతాకంపై తెరకెక్కుతోంది. వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే మస్కట్‌లో ఓ షెడ్యూల్ పూర్తయింది. హైదరాబాద్‌లో కోటి రూపాయలతో వేసిన సెట్‌లో క్లయిమాక్స్ సన్నివేశాలు చిత్రీకరణ జరుగుతోంది. ఇంకా రెండు పాటలు బ్యాలెన్స్ ఉన్నాయి. ఈనెల 17కు షూటింగ్ పూర్తవుతుంది. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 'చిరంజీవికి 'ఖైదీ' ఓ మెమరబుల్ మూవీగా నిలిచింది. అలాగే 'ఇంటెలిజెంట్' సాయిధరమ్‌కి ఓ ల్యాండ్ మార్క్ మూవీ అవుతుంది" అని నిర్మాత తెలిపారు. నాజర్, బ్రహ్మానందం, పోసాని, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: శివ ఆకుల, సినిమాటోగ్రఫీ: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం: థమన్.

# 'కేసరి' పోరాటం


అక్షయ్ కుమార్

'సరాగార్హి' యుద్ధ నేపథ్యంపై ఓ సినిమా రాబోతుంది. సరాగార్హి (పాకిస్తాన్‌లో ఉంది) ప్రాంతంలో 1897లో సెప్టెంబర్ 12వ తేదీన పదివేల మంది ఆఫ్ఘనిస్థానీలు ఒకేసారి దాడి చేశారు. బ్రిటీష్ ఇండియా ఆర్మీకి చెందిన 21 మంది సిక్కు సైనికులు దీన్ని వీరోచితంగా ఎదుర్కొన్నారు. ఈ యుద్ధాన్ని ఇప్పుడు వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు దర్శకుడు అనురాఘ సింగ్. సల్మాన్ ఖాన్, అక్షయ్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 21 మంది సిక్కు ఆర్మీ బృందానికి హవిల్దార్ ఇషార్ సింగ్ నాయకత్వం వహించారు. ఆయన పాత్రలో అక్షయ్ కనిపించనున్నాడు. ఈ సినిమాకు 'కేసరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం నుంచే చిత్రీకరణ ప్రారంభమైంది. కరణ్ జోహార్ నిర్మిస్తున్నాడు. ఈ విషయాన్ని అక్షయ్ తన ట్విట్టర్ ఖాతాలో ద్వారా వెల్లడించాడు.


# అనుష్క అంటే ఇష్టం


రషీకా దత్

తెలుగు చిత్రసీమకు మరో కన్నడ నటి పరిచయం కాబోతుంది. మిస్ రాజస్థాన్ కాంపిటీషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఆమె రషీకా దత్. తెలుగులో 'నీవేనా నను పిలిచినది' అనే రొమాంటిక్ హారర్ సినిమాలో కథానాయికగా చేస్తోంది. శనివారం పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మీడియాతో ఆమె మాట్లాడింది. "నేను పుట్టి పెరిగింది బెంగళూరులో. అక్కడే చదువుకున్నాను. రాజస్థాన్‌లో గ్రాడ్యుయేషన్ చేశాను. అప్పుడే మిస్ రాజస్థాన్ పోటీలో పాల్గొని రన్నరప్ గా నిలిచాను. ఆ తర్వాత ముంబైకి వెళ్లాను. రంగ్ రసియా థియేటర్ ఆర్ట్స్‌లో యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఆ సమయంలో చేసిన యాడ్స్ గుర్తింపునిచ్చాయి. 'ట్విస్ట్ వాలా లవ్' అనే హిందీ సీరియల్ కూడా చేశా. ఎప్పటి నుంచో తెలుగులో నటించాలన్న నా కోరిక కూడా నెరవేరుతుందని ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పాను. బెంగళూరు నుంచి వచ్చిన అమ్మాయిగానే కాదు కానీ.. నాకు అనుష్క అంటే చాలా ఇష్టం. ఆమెలా మంచి నటి అన్న ఇమేజ్ తెచ్చుకోవాలనుకుంటున్నాను. కథ డిమాండ్ చేస్తే గ్లామరస్ పాత్రలూ ఓకే. నేను తెలుగు పరిశ్రమలోనే సెటిల్ కావాలనుకుంటున్నాను. ప్రస్తుతం నా దృష్టంతా ఇక్కడే ఉంది. అందుకే ఓ ట్యూటర్ సాయంతో తెలుగు నేర్చుకుంటున్నాను" అని చెప్పింది.

# రిలీజ్ డేట్ ఫిక్స్

కొత్త సంవత్సరం ప్రారంభమైందంటే చాలు నూతన ప్రణాళిక మొత్తం డైరీలో ఉంటుంది. అది కొందరు డిసెంబర్ 31వ తేదీనే తయారు చేసేస్తారు. మరి జనాలను ఎంతగానో ప్రభావితం చేసే సినిమా వాళ్లు మాత్రం ఊరుకుంటారు? సంక్రాంతి పండుగ నుంచే వారి ఆట మొదలు పెట్టేస్తారు. సంక్రాంతి, తర్వాత వేసవి, దసరా, దీపావళి ఇలా అన్ని సందర్భాల్లో సినిమాలు విడుదల సంఖ్య చాంతాడంత ఉంటుంది. ఏడాది మొదట్లో ఫలానా తేదీకి తమ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ముందే ప్రణాళిక వేసేస్తారు. అలా వేసిన వాటిలో కొన్ని అనుకున్నట్టే విడుదల అవొచ్చు. కొన్ని రిలీజ్ కాకపోవచ్చు. ఈ ఏడాది బాలీవుడ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు చాలా సినిమాలే క్యూ కట్టాయి. అందులో కొన్ని ప్రముఖ చిత్రాలు ఇప్పటికే రిలీజ్ డేట్ ఫిక్స్ చేసేశాయి.


'పద్మావతి' చిత్రంలో దీపికా పదుకొనే

**రాజ్‌పుత్‌ల చరిత్ర**

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందిన చిత్రం 'పద్మావతి'. చిత్తోర్ మహారాణి పద్మావతి కథ ఆధారంగా ఈ సినిమా రూపొందింది. దీపికా పదుకొనే టైటిల్ రోల్ పోషించింది. అల్లావుద్దీన్ ఖిల్జీగా రణవీర్ సింగ్, రావల్ రతన్ సింగ్‌గా సాహిద్ కపూర్ చేశాడు. ఈ సినిమా గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ సినిమాకు రాజకీయ రంగు పులిమి విడుదలను ఆపేశారు. బీజేపీ లక్ష్యం నెరవేరిన అనంతరం మాత్రం కొన్ని మ్యూట్‌లతో యూ/ఎ సర్టిఫికేట్ ఇచ్చారు. ఈనెలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఎన్నో అంచనాలతో తీసిన ఈ సినిమా ఎప్పుడొస్తోందా? అని ప్రేక్షకులు కూడా ఎదురు చూస్తున్నారు.

**ఓ సామాన్యుడి విజయం**

రియల్ లైఫ్ కథలను సినిమాలుగా తీయడం బాలీవుడ్‌లో కొత్తకాదు. అందులోనూ అక్షయ్‌కు మరీ ఇష్టం. రెండు ఏళ్లుగా ఈయన వరుసగా రియల్ లైఫ్ స్టోరీసే చేస్తున్నాడు. వాటిల్లో ఎయిర్‌లిఫ్ట్, రుస్తోమ్ చిత్రాలు ఉన్నాయి. ఇప్పుడు తాజాగా ప్యాడ్‌మేన్, కేసరి చిత్రాలు చేస్తున్నాడు. తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనాథమ్ జీవిత చరిత్రను వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. గ్రామీణుడైన తన భార్య రుతుక్రమం సమయంలో పడ్డ ఇబ్బందులను చూసి ఆయన తక్కువ ధరల్లో శానిటరీ నేప్‌కిన్స్ తయారు చేసి విజయం సాధిస్తాడు. 1998లో జరిగిన ఈ స్టోరీ ఇప్పుడు వెండితెరపై చూడబోతున్నాం. అరుణాచలం పాత్రలో అక్షయ్ కుమార్ చేస్తున్నాడు. ఆర్కే బాల్కీ దీనికి దర్శకత్వం వహిస్తున్నాడు. సోనమ్ కపూర్, రాధికా ఆప్టే, బిజూ మీనన్ కీలక పాత్రల్లో నటించారు. ఈనెల 26వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.


'ప్యాడ్‌మేన్' చిత్రంలో సోనమ్ కపూర్, అక్షయ్ కుమార్

**సోనూ కీ టైటు కీ స్వీటీ**

లువ్ రంజన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'సోనూ కీ టైటు కీ స్వీటీ' ఈ సినిమా టీజర్‌కే 90లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. అంటే ఆ దర్శకుడు సినిమా అంటే ఎంత ఆసక్తి ఉందో దీని బట్టి అర్థమవుతుంది. కార్తీక్ ఆర్యన్, నుష్రాత్ భరుచ్, అలోక్ నాథ్ నటిస్తున్నారు. ఓ అమ్మాయి ప్రేమను దక్కించుకోవడం కోసం ఇద్దరు పడే తపనను ఈ సినిమాలో చూపించబోతున్నాడు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 9వ తేదీన విడుదల కానుంది.


'సోనూ కీ టైటు కీ స్వీటీ'లో కార్తీక్ ఆర్యన్, నుష్రాత్ భరుచ్, అలోక్ నాథ్

**ఓ టీచర్ కథ**

ఎస్‌రాజ్ ఫిల్మ్ అంటేనే బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంటుంది. అందులోనూ రాణీ ముఖర్జీ లీడ్ పోషిస్తుంది. ఆ చిత్రమే 'హైచ్కీ'. ఎస్ రాజ్ ఫిల్మ్ బ్యానర్‌లో వస్తున్న చిత్రమిది. నరాల బలహీనతతో బాధపడే ఓ టీచర్ కథను సినిమాగా తీశారు. అమెరికన్ చిత్రం 'ఫ్రెంట్ ఆఫ్ ది క్లాస్'ను రీమేక్ చేశారు. ఇందులో టీచర్‌గా రాణి ముఖర్జీ చేసింది. ఈ సినిమా టీజర్‌కు లక్షో రెండు లక్షలో కాదు ఏకంగా కోటీ 30 లక్షల డిజిటల్ వ్యూస్ లభించాయంటే అర్థం చేసుకోవచ్చు ఈ సినిమాపై ఎటువంటి అంచనాలు పెంచాయో. సిద్ధార్థ్ మల్హోత్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 23వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.


'హైచ్కీ'లో రాణి ముఖర్జీ

**వెండితెర హీరో**

జీవితం అన్నాక తప్పులు చేయడం సహజం. దాన్ని ఎలా సరిదిద్దుకున్నామన్నదే ముఖ్యం. అలా తన జీవితంలో చేసి తప్పిదాల వల్ల పడ్డ ఇబ్బందులు సినిమాగా రాబోతుంది. అదే సంజయ్ దత్ బయోపిక్. ఈయన జీవిత చరిత్ర ఆధారంగా 'సంజయ్' పేరుతో సినిమా రూపొందుతోంది. రణవీర్ కపూర్ టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. రాజ్ కుమార్ ఇరానీ దర్శకత్వం వహించారు. పరేశ్ రావల్, మనీషా కొయిరాల కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం మార్చి 30వ తేదీన విడుదల కానుంది. సంజయ్ జీవితంలో జరిగిన వాస్తవాలను వెండితెరపై ఆవిష్కంచారో? లేదో? చూడాలన్న ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంది.

**అక్టోబర్**

'అక్టోబర్' అంటే నెల అనుకునేరు కాదు..కాదు. అది సినిమా పేరు. పేరు అక్టోబర్.. రిలీజ్ మాత్రం ఏప్రిల్ అని చెబుతూనే ట్రైలర్ రిలీజ్ చేసిందీ చిత్రబృందం. 2017లో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా నిలిచిన సూజిత్ సర్కార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రేమకథను ఈ టైటిల్‌తో తీశారు. వరుణ్ ధావన్ నటించిన ఈ చిత్రం ఏప్రిల్ 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.

**వీరే డి వెడ్డింగ్**

కరీనా కపూర్, సోనమ్ కపూర్, స్వర భాస్కర్, షిఖా తలసాని కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'వీరే డి వెడ్డింగ్'. షషాంక్ ఘోస్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. బాలీవుడ్‌లో ముఖ్య తారలు ఇందులో నటించడంతో పంపిణీదారులు కూడా ఈ సినిమాను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. మే 18వ తేదీన విడుదల కానుంది.


'వీరే డి వెడ్డింగ్'లో కరీనా, సోనమ్, స్వర భాస్కర్, షిషా తలసాని

**ఫన్నే ఖాన్**

సంగీత హాస్య చిత్రంగా రూపొందుతోన్న సినిమా 'ఫన్నే ఖాన్'. టైటిల్ రోల్‌లో ఐశ్వర్యరాయ్ నటిస్తుంది. అనిల్ కపూర్, రాజ్ కుమార్ రావు ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. 2000లో ఆస్కార్‌కు నామినేట్ అయిన 'ఎవరీబడీస్ ఫేమస్' చిత్రానికి రీమేక్ ఇది. ఈ చిత్రం జూన్ 15వ తేదీన విడుదల కానుంది.

**అక్షయ్ 'గోల్డ్'**

అక్షయ్ చేస్తున్న స్పోర్ట్స్ తరహా చిత్రం 'గోల్డ్'. 1948లో జరిగిన ఒలంపిక్స్‌లో హ్యాకీ జట్టు బంగారు పతాకాన్ని గెలుకుంది. ఈ టీమ్‌కు బల్బీర్ సింగ్ నాయకత్వం వహించాడు. ఆయన పాత్రలో అక్షయ్ చేస్తున్నాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

**సూపర్ 30**

తెలివైన పిల్లలై పేదరికం వల్ల ఉన్నత విద్యను అభ్యసించలేకపోతుంటారు. అటువంటివారికి అండగానే నిలిచే వ్యక్తి మేథ్స్ జీనియస్ ఆనంద్ కుమార్. ఏటా 30 మంది పేద విద్యార్థులకు ఐఐటీ జేఈఈ ఎంట్రాన్స్‌కు అన్ని సదుపాయాలు కల్పించి ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తున్నాడు. బీహార్‌కు చెందిన ఈ వ్యక్తి జీవితాన్ని వెండితెరపై చూపబోతున్నారు దర్శకుడు వికాస్ భహ్లా. హృతిక్ రోషన్ ఆనంద్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం నవంబర్ 23న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**షారుఖ్ 'జీరో' సైజ్**


'జీరో'లో షారుఖ్

బాలీవుడ్‌లో విభిన్నత అన్నది ఎప్పుడూ ఉంటుంది. ప్రతి హీరో అలా ఉండే కథలను ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకుల మన్ననలు పొందుతుంటారు. ఇప్పుడు షారుఖ్ ఖాన్ చేస్తున్న కొత్త చిత్రం 'జీరో'. టైటిల్‌కు తగ్గట్టే అతని సైజ్ జీరోనే. మరుగుజ్జు పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం టీజర్‌ను ఇటీవలే షారుఖ్ విడుదల చేశాడు. మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం డిసెంబర్ 21న విడుదల కానుంది.

– కొప్పుశెట్టి దేవరాజు

# అమీర్ పేట్ టు అమెరికా

రాధా మీడియా బ్యానర్‌పై 'ఎ టు ఎ (అమీర్ పేట్ టు అమెరికా) చిత్రానికి సంబంధించిన తొలి పోస్టర్ హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటి మేయర్ శ్రీ బాబా ఫసివుద్దీన్ శుక్రవారం విడుదల చేశారు. రామ్ మోహన్ కొమండూరి చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ని డిజైన్ చేశారు. 'తెలంగాణాకి రారాజు సి.ఎం. కెసిఆర్ ఐతే అమెరికాకి రారాజు డోనాల్డ్ ట్రంప్. ఇటు తెలంగాణా నుండి అమెరికాకి ఎగురుతున్న విమానంతో కాన్సెప్ట్‌ని సూటిగా చెప్తున్న కొత్త తరహా పోస్టర్' అని పలువురు ప్రశంసించారు. ఇటీవలే చిత్రంలోని పాటను ఫ్లాష్ మాబ్ ద్వారా వినూత్నంగా విడుదల చేశారు. అమెరికాలో చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు : చల్లా భానుకిరణ్. కెమెరా : అరుణ్, జిఎల్ బాబు. ఎడిటర్ : ప్రవీణ్ పూడి, సంగీతం : కార్తీక్ కొడకండ్ల.





అక్కడి సరస్సులు 'లాహిరి లాహిరి' అంటూ ప్రేమజంటలు పాటలు పాడుకునేంతగా ఆహ్లాదం కలిగిస్తాయి. కొత్తగా పెళ్లయిన వారు హనీమూన్‌కి వెళ్లాలంటే ఇదే సరైన ప్రాంతం. ఎటు చూసినా కొత్త జంటల మనసును కొల్ల గొట్టేంత హాయిని గొలిపే పచ్చదనాలే. ఆహ్లాదంతో పాటూ మరోవైపు ఇది వ్యాపారానికి ప్రసిద్ధి. అలాగే సంస్కృతికి పేరెన్నికగల ప్రాంతమూ కొల్లాం. ప్రాచీనకాలం నుంచి ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలు నిర్వహిస్తోంది. భారతదేశంలోనూ వివిధ ప్రాంతాలతోనూ వ్యాపార భాగస్వామ్యం పంచుకుంటోంది తీరాన్ని ఆనుకుని ఉన్న కొల్లాం. ఇంతకూ ఇది 'కాజుకా కొల్లాం..!' ఎలా అయింది? అక్కడి ఆహ్లాదభరిత ప్రదేశాలు కట్టడాలేంటో ఈ వారం 'జర్నీ'లో చూసొద్దాం పదండి..

# కాజుకా కొల్లాం..!

కొల్లాం కేరళ రాష్ట్రంలోని పేరొందిన తీరప్రాంతం. ఇక్కడ జీడిపప్పు (కాజు)ను అధికంగా పండిస్తారు. దేశంలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో జీడిపప్పు ఉత్పత్తి కొల్లంలోనే. దీనివల్లే 'కాజుకా కొల్లాం' (జీడిపప్పు నగరం) అనే పేరు పడిపోయింది. జీడిపప్పును పండించడమే కాదు.. ఎగుమతికీ ఈ ప్రాంతం ప్రసిద్ధి. ఇంకా ఇది నార పరిశ్రమకూ పెట్టింది పేరు. నారను ఉత్పత్తిచేసి, దీనిద్వారా తయారుచేసే వస్తు తయారీలో వందల ఏళ్ల నుంచి కొల్లాం అగ్రస్థానంలో ఉంది.

### అష్టముడి సరస్సులో హౌస్‌బోట్

బీచ్‌లు.. పార్క్‌లు.. ద్వీపాలు.. సరస్సులు.. ఆలయాలు.. రిసార్టులు.. ఇలా చెప్పుకుంటూ పోతే కొల్లాంలో కోకొల్లలు. వీటితోపాటు రుచికరమైన సముద్ర ఆహారాలు యాత్రికులను నోరూరిస్తాయి. విభిన్నమైన పర్యాటకం కావాలంటే కొల్లాం వెళ్లాల్సిందే. ఇది ఎంతో చక్కటి టూరింగ్ స్పాట్ మరి. కొల్లాంను సందర్శించే పర్యాటకులు తప్పకుండా అష్టముడి సరస్సును చూసి తీరాల్సిందే! సరస్సులోని విహారం, ఏపుగా ఎదిగిన పచ్చని కొబ్బరిచెట్లు, తాటిచెట్ల మధ్య ఆహ్లాదకరంగా మనసు ఊగుతూ తూగుతూ సాగుతుంది కొల్లాం పర్యాటకం. అష్టముడి సరస్సులో పడవ ప్రయాణం ఓ మధురానుభవం. అక్కడికి వెళ్లిన ఎవరైనా ఆ పడవ ప్రయాణం చేయకుండా తిరిగిరారు. అయితే మన బడ్జెట్‌ను.. సానుకూలత బట్టి హౌస్‌బోట్‌లను ఎంపిక చేసుకోవాలి. బోట్ ఏదైనా అష్టముడిలో విహరిస్తే వచ్చే మజానే వేరు.

### తేవల్లి ప్యాలెస్- మన్రో ద్వీపం

కొల్లాం పట్టణానికి సరిగ్గా 25 కిలోమీటర్ల దూరంలో ఉంది తేవల్లి ప్యాలెస్. ఇది ఒక వారసత్వ భవనం. దీని నిర్మాణం బ్రిటీష్, పోర్చుగీస్, డచ్ నిర్మాణశైలిని పోలి ఉంటుంది. పర్యాటకుల్ని విపరీతంగా ఆకట్టుకుంటుంది. అష్టముడి సరస్సు నుంచి హౌస్‌బోట్ పడవల్లో ప్రయాణించి, ఇక్కడకు చేరుకోవచ్చు. ఇక మన్రోదీపం గురించి చెప్పాలంటే.. ఇది కొల్లాం పట్టణానికి 27 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఒక ద్వీపం. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే ఎనిమిది చిన్న ద్వీపాల సమూహం. వివిధ రకాల పక్షులకు ఇది ఆలవాలం ఇక్కడ చేపలు పట్టడం పర్యాటకుల్ని బాగా ఆకట్టుకునే విషయం. ద్వీపంలో లెక్కకు మించి చారిత్రక ఆలయాలు, చర్చిలు ఉంటాయి.

### కొల్లాం బీచ్-సస్తంకొట్ట సరస్సు

కొల్లాంకు రెండు కిలోమీటర్ల దూరంలో అందాలొలికే అలలతో మెత్తటి ఇసుకతో కనిపించే బీచ్ ఉంది. దీన్ని కొల్లాం బీచ్ అనే కాకుండా 'మహాత్మాగాంధీ బీచ్' అని కూడా పిలుస్తారు. ఈ బీచ్‌లో ఇసుకతీరాలు చూసి మయమరచి పోవాల్సిందే. సందర్శకులు సాయంత్రం వేళల్లో ఇక్కడకు వచ్చి సేద తీరుతారు. ఇక్కడ వాతావరణం ప్రశాంతంగా, నిర్మలంగా ఉండటంతో స్థానికులు పరిసరాల్లో నిత్యం తిరుగుతూ కనిపిస్తారు. బీచ్ ఒడ్డునే ఉండే హోటళ్లు.. రిసార్ట్‌లు.. పర్యాటకులను ఆకట్టుకోవడమే కాకుండా, మంచి టేస్టీ ఫుడ్‌తో ఊరిస్తాయి. ఇక ఇక్కడ పేరుగాంచిన మరో సరస్సు సస్తంకొట్ట సరస్సు. కొల్లాంకి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. పడవ ప్రయాణ సౌకర్యాలలో పర్యాటకుల్ని ఆకర్షించడం ఈ సరస్సు ప్రత్యేకత కలది.

### అడ్వెంచర్ పార్క్- అచెంకాయిల్ ఫాల్స్

కొల్లాం పట్టణానికి సరిగ్గా మూడు కిలోమీటర్ల దూరంలో అష్టముడి సరస్సు ఒడ్డున ఉన్న అడ్వెంచర్ పార్క్




పిల్లలకే కాదు పెద్దలకూ వివిధ రకాల క్రీడలతో అలరిస్తోంది. ఇక్కడ బోట్‌లు అద్దెకు ఇస్తారు. వాటిని తీసుకొని 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్‌లో తిరుగాడుతూంటే మనస్సు తుళ్లిపడాల్సిందే. ఇక్కడ పెయింటింగ్‌లతో కూడిన మ్యూజియం ముచ్చటగొలుపుతూ భలే ఆకట్టుకుంటుంది. దట్టమైన అడవులు, ఆలయాలు, జలపాతాలు ఉండే అచెంకాయిల్ కొల్లాంకు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అయ్యప్పస్వామి ఆలయం ప్రధానాకర్షణ. ఆలయానికి దగ్గర్లోని కుంభవురుట్టి జలపాతం, మనలార్ జలపాతం రెండూ సందర్శకులను కనువిందు చేస్తాయి.

### అమృతపురి-మయ్యనాడ్

వలికావు ప్రాంతంలోని అమృతపురి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం. ఈ ప్రాంతంలో ఆశ్రమాలు, విద్యాసంస్థలు, రీసెర్చ్ సెంటర్లు వంటి సౌకర్యాలున్నాయి. కొల్లాం నుంచి పడవల్లో అమృతపురి చేరుకోవచ్చు. మయ్యనాడ్ గ్రామం కొల్లాంకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. సుబ్రహ్మణ్యస్వామి గుడి ఇక్కడ ప్రధాన ఆకర్షణ. అరేబియా సముద్రంలో చేపలు పట్టే తీరు ఇక్కడి పర్యాటకులను 'వావ్' అనిపించక మానదు. వీటితోపాటు చారిత్రక స్థూపాలున్న ఓచిర, రామేశ్వరగుడి, కురునాగప్పల్లి వంటి ప్రముఖ ప్రాంతాలు ఉన్నాయి.

**సేకరణ: ఓ. నవ్యశ్రీ**



## ఎలా చేరుకోవాలి?

విజయవాడ, హైదరాబాద్ నుంచి కేరళ చేరుకొని వెళ్లొచ్చు. అలా కుదరకపోతే కొల్లాం గుండా మూడు జాతీయ రహదారులు ఉన్నాయి. చెన్నెయి, తిరువనంతపురం, కొచ్చిన్, కన్యాకుమారి, కోయంబత్తూర్, పుదుచ్చేరి, కొట్టాయం, ఎర్నాకులం నుంచి నిత్యం బస్సులు కొల్లాంకు నడుస్తుంటాయి. అదే రైలుమార్గం నుంచి అయితే చెన్నెయి, బెంగళూరు, తిరువనంతపురం, కొచ్చిన్ నుంచి రైళ్ల ఉన్నాయి.

## ట్రెక్కింగ్‌కు సిద్ధమయ్యారా?!

కొండలను ముద్దాడే మేఘాలు, పొగమంచు కప్పుకున్న పచ్చదనం, నీటి తుంపర్లు.. ఇలా ప్రకృతిని అందాలను తనివితీరా ఆస్వాదించేందుకు చాలామంది పర్యాటకులు ట్రెక్కింగ్‌కి సిద్ధమవుతుంటారు. అలా అడుగులో అడుగువేస్తూ పక్షులను, జంతువులను పలకరించుకుంటూ ముందుకు సాగిపోయేందుకు ట్రెక్కింగ్ ఎంతో అనువుగా ఉంటుంది. అయితే, ట్రెక్కింగ్ స్పాట్‌లో ప్రయాణించేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే ట్రెక్కింగ్ చిరస్మరణీయమైన అనుభవంగా మిగిలిపోతుంది. ట్రెక్కింగ్ చేసేటపుడు కాళ్లకు తేలికపాటి బూట్లు ఎంచుకోవటం మంచిది. కొండల అంచులపై జారిపోకుండా సౌకర్యవంతంగానూ, నాణ్యమైనవిగా ఉండేవి ధరించాలి. ఎందుకంటే, ట్రెక్కింగ్ చేసే సమయంలో కాళ్ల ఉబ్బుతాయి. ఈ సందర్భాలలో అడుగుల ఒత్తిడిని భరించే మన్నికైన బూట్లు కొనుగోలు చేయాలి. దానిద్వారా పాదాలపై పడే ఒత్తిడిని నివారించుకోవచ్చు. చిన్న బెణుకులు సంభవించినా ట్రెక్కింగ్ చేయటం పెద్ద సవాల్‌గా మారుతుంది. అలాంటి సమయాల్లో వీలైనంత వరకూ యాత్రను విరమించుకుంటేనే మంచిది. లైట్‌వెయిట్ ఉన్న వాటర్‌ప్రూఫ్ బ్యాక్‌ప్యాక్ ట్రెక్కింగ్‌కు చక్కగా ఉపకరిస్తుంది. అలాగే తడి, పొడి బట్టలను వేరుచేసుకునేందుకు వీలుగా సంచులు ఏర్పాటు చేసుకోవాలి. సన్‌గ్లాసెస్‌ను వెంట తీసుకువెళ్లడం మంచిది. ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లేటప్పుడు సూర్య కాంతి దగ్గరైనట్లుగా కళ్లమీద తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో తలనొప్పి, ఒణుకు వంటి సమస్యలు వస్తాయి. అవి రాకుండా సన్‌గ్లాసెస్ కాపాడతాయి. బ్యాగ్‌లో జత తేలికపాటి చెప్పులను కూడా వెంట తీసుకువెళ్లాలి. ట్రెక్కింగ్ సమయంలో శిబిరాల్లో ఉండాల్సి వస్తుంది. ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లినపుడు పాదాలకు గాలి తగలాలి. అందుకు తేలికపాటి చెప్పులు ధరిస్తే హాయిగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ చెప్పులను తీసుకువెళితే మంచిది. తడి ప్రదేశాలలో ఫంగస్ విపరీతంగా వ్యాపిస్తుంది. దాంతో తక్కువ సమయంలోనే ఇన్‌ఫెక్షన్ల బారినపడొచ్చు. తేమ వాతావరణం కాబట్టి బాక్టీరియా కూడా త్వరగా విజృంభిస్తుంది. కాబట్టి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా క్రీములు తీసుకువెళితే మంచిది. ★



---




## కనిపెట్టండి



పిల్లలూ..! పక్కన ఉన్న చిత్రంలోని పిల్లి బొమ్మ నీడ ఏదో కనిపెట్టండి!

### పొడుపు కథ

భూమికి ఉపగ్రహాన్ని
నేను భూమి చుట్టూ
తిరుగుతాను. చల్లని
వెన్నెలనిస్తాను.
నేనందరికీ మామను..?

### జోక్ :

చింటు : ఒరేయ్ బంటూ! మీ తరగతిలో ఎవరు ఫస్ట్?
బంటు : నేనే..
చింటు : మార్కుల్లోనా?
బంటు : కాదు.. రోల్ నంబరులో



## అంతరిస్తున్న పిచ్చుకలు

పిల్లలూ...! మీరు ఎప్పుడైనా పిచ్చుకలను చూశారా! పిచ్చుకలు పంటచేలల్లో, పల్లెల్లో ఎక్కువగా కనిపిస్తాయి కదూ. ఇవి గుంపులుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగరడం చూస్తుంటే సరదాగా ఉంటుంది. అలాంటి పిచ్చుకల గురించి తెలుసుకుందామా?!

పిచ్చుక ఒక చిన్నపక్షి. పిచ్చుకలు పేసరీఫార్మిస్ క్రమంలో పేసరిడే కుటుంబానికి చెందిన పక్షులు. ఇవి సాధారణంగా చిన్నగా, బొద్దుగా గోధుమ రంగులో ఉండి చిన్నతోకతో పొట్టిగా ఉండే బలమైన ముక్కు కలిగివుంటాయి. పిచ్చుకలు చిన్న చిన్న క్రిమి కీటకాలను తింటాయి. పిచ్చుకలో ఇంచుమించు 35 జాతులున్నాయి. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పళ్ళు, ఆహార ధాన్యాల ఉత్పత్తి. పిచ్చుకలు అంతరించిపోవడానికి కారణాలు. గతంలో ఊర పిచ్చుకలు పల్లెటూర్లల్లో విరివిగా ఉండేవి. రైతులు పిచ్చుకల ఆహారం కొరకు వరి కంకులను గుత్తులుగా కట్టి ఇంటి చూరుకు వేలాడదీసేవారు. ప్రస్తుతం పంటలు లేక పిచ్చుకలకు ఆహారం కరువై అవి పల్లెల్లో కనబడడం లేదు. ఇవి కిలకిలమని సందడి చేస్తుంటే చూడముచ్చటగా ఉంటుంది. ఇవి దిగుడు బావులలో వేలాడుతున్న చెట్లపై కట్టుకున్న గూళ్ళు చాలా అద్భుతంగా ఉంటాయి. ఇవి ఒకప్పుడు పూరిళ్ళ చూరులలో గూళ్ళు కట్టుకొని జనావాసాలతో మమేకమై ఉండేవి. ఇవి మెత్తని పీచుతో చిన్న చిన్న పుల్లలతో గూడు కట్టడం, గుడ్లను పొదగడం, నోటితో ఆహారాన్ని తెచ్చి పిల్లలకు అందించటం, ఆ పిల్లలు రెక్కలొచ్చి ఎగిరెంత వరకు జాగ్రత్తగా కాపాడటం మనకు తరచూ కనిపించే దృశ్యాలు. ఇవి తల్లి ప్రేమకు నిదర్శనంగా చెప్పొచ్చు. ★





## మన్యం వీరునికి జేజేలు !!

నా పేరు చందన. నేను గుంటూరులోని ఎన్.ఆర్.ఐ స్కూల్లో యు.కె.జి చదువుతున్నా. ఈ మధ్య మాస్కూలులో క్రిస్టమస్ సెలవులిచ్చారు. ఆ సెలవుల్లో అమ్మావాళ్ల నన్ను వైజాగ్ తీసుకెళ్లారు. బంధువులింట్లో రెండు రోజులు ఉన్న తర్వాత అక్కడకు దగ్గరలోనున్న అరకు వెళ్లాం. అరకు పార్కులో చాలాసేపు గడిపాం. ఆ పార్కులో ఒక పెద్ద విగ్రహం ఉంది. ఆ విగ్రహంలోనున్న అతనిని ఎక్కడో చూసినట్లు అనిపించింది. కొంతసేపు అలానే ఆ విగ్రహాన్ని చూశా. తర్వాత అమ్మను అడిగా అమ్మా.. ఈ బొమ్మ అల్లూరి సీతారామరాజుదే కదా! అని. అమ్మ అవును తల్లి! భలే గుర్తుపట్టావని నన్ను ఎంతగానో మెచ్చుకుంది. ఆయనను ఎలా మరిచిపోతా. రోజూ నిద్రపోయేముందు బామ్మ ఆయన గురించి ఎన్నో కథలు చెబుతుంది. కొన్ని సంవత్సరాల క్రితం మన దేశంలోకి తెల్లవాళ్లు వచ్చారంట. వాళ్లు ఆయనను చూసి చాలా భయపడేవారట. ఆయన చాలా ధైర్యంగా వారితో పోరాడేవాడట. ఆయనను చూసి మనం ధైర్యంగా ఎలా ఉండాలో నేర్చుకోవాలని బామ్మ చెబుతుంది. అందుకే నేను ఆయనను చూడగానే గుర్తుపట్టేశా. ఆయన గొప్ప వీరుడు. ఆయన విగ్రహం పక్కన నిలుచుని పోటో దిగాను. ఆ పోటోను మా స్కూలులోని స్నేహితులందరికి చూపా. అందరూ పోటో చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఆయనకు అందరం జేజేలు పలుకుదాం.



**ఎన్. చందన,**
**యు.కె.జి,**
**ఎన్.ఆర్.ఐ స్కూల్,**
**గుంటూరు.**

## పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ...
'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...
పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

**చిరునామా**

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



# భువీ మెరుపులు




## తొలిరోజే పోటాపోటీ

## దక్షిణాఫ్రికా 286 ఆలౌట్ -భారత్ 28/3

**కేప్‌టౌన్ :** భువనేశ్వర్ కుమార్ స్వింగ్ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా ఆటగాళ్ళకు చుక్కలు చూపించాడు. దీంతో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 73.1 ఓవర్లలో 286 పరుగుల కు ముగించింది. అనం తరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 28 పరుగులకే కీలకమైన మూడు వికెట్ల ను కోల్పోయింది. తొలి రోజునుండే మ్యాచ్ పోటాపోటీగా జరగ నుంది. మురళి విజయ్ 1, ధావన్ 16, కోహ్లీ 5 పరుగులు చేసి నిరాశ పరిచారు. ఆట ముగిసే సమయానికి పుజారా 5, రోహిత్ శర్మ 0 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. గాయాల కారణంగా తొలి టెస్ట్ జట్టుకు దూరమవుతారనుకున్న డుప్లెసిస్, డికాక్‌లకు తుదిజట్టులో స్థానం లభించింది. శిఖర్ ధావన్‌కు కూడా టీమిండియా జట్టులో స్థానం లభించింది. శుక్రవారం కేప్‌టౌన్ వేదికగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. భువనేశ్వర్ తొలి ఓవర్ మూడో బంతికే డీన్ ఎల్గర్‌ను పెవిలియన్ కు పంపాడు. అనంతరం మూడో ఓవర్‌లో మ(క్రమ్ (5), ఐదో ఓవర్‌లో హసీమ్ ఆమ్లాను ఔట్ చేసి సఫారీ జట్టును కష్టాల్లో పడేశాడు. దీంతో ఆ జట్టు 12 పరుగులకే కీలకమైన మూడు వికెట్లను కోల్పోయి ఒత్తిడికి గురైంది. భువీ వేసిన ఔట్ స్వింగర్ బంతులకు ప్రత్యర్థి జట్టు బ్యాట్స్‌మన్ల నుంచి సమాధానమే లేకపోయింది. ఎల్గర్, ఆమ్లా వికెట్ కీపర్ సాహాకి క్యాచ్ లు ఇవ్వగా.. మ(క్రమ్ వికెట్ల ముందు దొరికి పోయాడు. కేవలం 12 పరుగులకే కీలకమైన వికెట్లు కోల్పోయిన సఫారీ జట్టును సీనియర్ బ్యాట్స్‌మన్ డివిలియర్స్ ఆదుకున్నాడు. డివిలియర్స్‌కు తోడు దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ కూడా జాగ్రత్తగా ఆడుతూ వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అమూల్యమైన 114 భాగస్వామ్యాన్ని నిర్మించారు. డివిలియర్స్ (65) పరుగులు చేసి బుమ్రా బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ఈ మ్యాచ్ ద్వారా టెస్టులకు అరంగేట్రం చేసిన బుమ్రాకు డివిలియర్స్ రూపంలో తొలి వికెట్ లభించినట్లైంది. సుదీర్ఘ చరిత్ర ఉన్న భారత్ జట్టు ఒక్క టెస్టు సిరీస్‌ను కూడా ఇప్పటి వరకు దక్షిణాఫ్రికా గడ్డపై సాధించలేదు. మరోవైపు రెండేళ్ల క్రితం.. భారత్‌లో టెస్టు సిరీస్ చేజార్చుకున్న సఫారీలు.. ప్రతీకారం తీర్చుకోవాలని ఆశిస్తున్నారు. గాయం కారణంగా దాదాపు ఏడాది తర్వాత.. దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ మళ్లీ జట్టులోకి పునరాగమనం చేశాడు.

భువనేశ్వర్ కుమార్ 4 వికెట్లు

### పాతికేళ్లనాడు కపిల్...

టీమిండియా ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ టెస్టుల్లో పాతికేళ్ల రికార్డును సమం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ మొదటి ఓవర్ బౌలింగ్ చేసిన భువీ.. మూడో బంతికే ఓపెనర్ డీన్ ఎల్గర్‌ను డకౌట్‌గా పెవిలియన్‌కు పంపాడు. టెస్టుల్లో విదేశీ గడ్డపై ఓ భారత బౌలర్ తొలి ఓవర్‌లోనే వికెట్ తీయడం 1992 తర్వాత ఇదే ప్రథమం. గతంలో 1992-93లో దక్షిణాఫ్రికాతోనే జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ ఇన్నింగ్స్ తొలి బంతికే జిమ్మీ కుక్ వికెట్ తీశాడు. ఆ తర్వాత.. ఎవరూ ఈ రికార్డుకి చేరువకాలేకపోయారు.

### బుమ్రా అరంగేట్రం



దక్షిణాఫ్రికాతో తలపడిన భారత జట్టులో టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు చోటు లభించింది. దీంతో ఇప్పటివరకు వన్డేలు, టి20లకే పరిమితమైన బుమ్రా టెస్టులలో అరంగేట్రం చేశాడు. ఈ సందర్భంగా టీమిండియా సారథి కోహ్లీ బుమ్రాకు మెన్ ఇన్ బ్లూ టోపీ ఇచ్చాడు.

# మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

## రాష్ట్ర వ్యాప్తంగా 900 మంది వెటరన్ క్రీడాకారులు హాజరు



పరుగు పందేనికి సిద్ధంగా ఉన్న వెటరన్ క్రీడాకారులు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

కేంద్ర మాజీ మంత్రి, కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు స్మారక 37వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్-2018 పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులు ఎండి ఖాశీం ఖాన్, ఎండి రజియా క్రీడా జ్యోతితో మైదానంలో మారథాన్ నిర్వహించారు. శాప్ ఆధ్వర్యాన జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ, జిల్లా, రాష్ట్ర మాస్టర్ అసోసియేషన్‌తోపాటు వే ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు 13 జిల్లాల నుంచి సుమారు 900 మంది వెటరన్ క్రీడాకారులు హాజరయ్యారు. 35 నుంచి 90 ఏళ్ల మధ్య వయసుగల మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. 100, 200, 400, 800, 1500, ఐదు వేలు, పది వేల మీటర్ల పరుగుపందెం, 5కె, 10కె నడక పోటీలు, లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో, 110, 400 మీటర్ల హర్డిల్స్, పోల్‌వాల్ట్ తదితర అంశాల్లో పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 20 నుంచి 25 వరకు బెంగళూరులో జరగనున్నాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

## 'ట్రంప్'లతో గెలిచిన నార్త్

**చెన్నై :** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబిఎల్)లో నార్త్ ఈస్ట్ వారియర్స్ జట్టుకు మరో విజయం చేకూరింది. శుక్రవారం బెంగళూరు బ్లాస్టర్స్‌తో జరిగిన రెండు ట్రంప్ మ్యాచ్‌లలో గెలిచిన నార్త్ మిగిలిన మూడు సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడి 3-2 పాయింట్ల తేడాతో గెలిచింది. పురుషుల డబుల్స్ మ్యాచ్‌ను 15-12, 7-15, 15-12తో గెలిచిన బెంగళూరు ఆ తర్వాత ఆడిన ట్రంప్ మ్యాచ్‌లో ఓడింది. ఈ మ్యాచ్‌లో అజయ్ జయరామ్ (నార్త్) 15-8, 15-13తో గెలిచి 1-0 ఆధిక్యత నిలిపాడు. మహిళల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో (నార్త్) 15-7, 14-15, 15-13తో గెలిచి 3-0 ఆధిక్యత సంపాదించింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ వన్ అక్సెల్‌సన్ (బెంగళూరు) గెలవడంతో 1-3 ఆధిక్యతను పెంచాడు.

## సచివాలయంలో స్మార్ట్ సైకిల్స్...!

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వెలగపూడి సచివాలయంలో ఇకపై సందర్శకులకు స్మార్ట్ సైకిల్స్ అందుబాటులోకి రానున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సైకిళ్లను వినియోగించాలని నిర్ణయించిన అధికారులు జర్మనీ నుంచి మొదటి విడత 24 స్మార్ట్ సైకిళ్లను దిగుమతి చేసుకున్నారు. వీటిని వచ్చే సోమవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. సిఎం చంద్రబాబు ఈనెల 8వ తేదీన స్మార్ట్ సైకిళ్లను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్మార్ట్ కార్డ్ సహాయంతో నడిచే జిపిఆర్ఎస్ అనుసంధానిత సైకిళ్లతో పర్యావరణానికి నష్టం వాటిల్లదని అధికారులు చెబుతున్నారు.

## త్రిపుల్ తలాక్ బిల్లును అన్ని పార్టీలు ఆమోదించాలి : మాలతీరాణి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పార్టీలకు అతీతంగా త్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో అన్ని పార్టీలు ఆమోదించాలని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.మాలతీరాణి కోరారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తలాక్ చెప్పి విడాకులిచ్చే దుస్సాంప్రదాయం నుంచి ముస్లిం మహిళలకు న్యాయం చేసేలా త్రిపుల్ తలాక్ నిషేధ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ బిల్లును లోక్‌సభలో అన్ని పార్టీలు ఆమోదించాయని, రాజ్యసభలో వ్యతిరేకించడంపై ఆయా పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు.

## పౌరసత్వం కేసులో చెన్నమనేనికి ఊరట

### కేంద్ర హోంశాఖ ఉత్తర్వులపై స్టే

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలోని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబుకు పౌరసత్వం విషయంలో కొంత ఊరట లభించింది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను ఆరు వారాల పాటు వాయిదా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇటీవల కేంద్ర హోంశాఖ ప్రకట నలో రమేష్‌బాబు భారతీయుడు కాదని, అతని పౌరసత్వం చెల్లదని ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. శుక్రవారం చెన్నమనేని తరుపు న్యాయవాదులు హైకోర్టు లో తమ వాదనలు వినిపించారు. 1955వ పౌరసత్వం చట్టంలో 365 రోజుల పాటు నిరంతరం భారతదేశంలో ఉండాలన్న నిబంధన లేదని, 2009లో మార్పులు చేసిన చట్టంలో మాత్రమే ఉందనే వాదనలు హైకోర్టు ముందుంచారు. తదుపరి విచారణ ఈనెల 24కి వాయిదా పడింది. కేంద్రహోంశాఖ ఇచ్చిన పౌరసత్వం రద్దు ఉత్తర్వులను ఆరు వారాలపాటు అమల్లోకి తీసుకోవద్దని, రెండు వారాల్లోగా కేంద్ర హోంశాఖ అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది.

## 29న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ : ఫ్యాప్టో

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి ఈ నెల 29న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్, కో-చైర్మన్ పి బాబురెడ్డి, పి పాండురంగ వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు. 10 నెలల పిఆర్సీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం వెంటనే మంజూరు చేయాలని, 11వ పిఆర్సీ కమిటీని నియ మించాలని వారు డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి, పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. అంతర్ మున్సిపాలిటీ, అంతర్ జిల్లా మున్సిపల్ బదిలీలు తక్షణమే చేపట్టాలని, విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, సైకిళ్లను పంపిణీ చేయాలని, ప్రతి 250 మంది విద్యార్థులకు ఒక పిఇటిని నియమించాలని వారు కోరారు.

## తప్పు చేశా..!

### కౌన్సెలింగ్‌కు హాజరవుతా : యాంకర్ ప్రదీప్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన స్టార్ యాంకర్ ప్రదీప్ మాచిరాజు ఐదు రోజుల తర్వాత స్పందించారు. తప్పు చేశా నని అంగీకరించారు. ఇంకెవరూ అటువంటి తప్పు చేయవద్ద ని కోరారు. త్వరలోనే తాను కౌన్సెలింగ్‌కు హాజరవుతానని, పోలీసులతో కూడా మాట్లాడానని తెలిపారు. ప్రదీప్ పరారైనట్లు వార్తలు వస్తుండటంతో శుక్రవారం ఆయన సోషల్ మీడియా ద్వారా మాట్లాడుతూ తాను ఎక్కడికీ పారిపోలేదని తెలిపారు.

**రాకుంటే ఛార్జిషీటు కోర్టుకు సమర్పిస్తాం : అదనపు డిసిపి అమర్‌కాంత్ రెడ్డి**

షూటింగ్‌లో తీరిక లేకుండా ఉన్నందున మరో రెండు రోజుల సమయం కావా లని ప్రదీప్ అభ్యర్థించినట్లు ట్రాఫిక్ అదనపు డిసిపి అమర్ కాంత్‌రెడ్డి తెలిపారు. ప్రదీప్‌పై ఇప్పటికే కేసు నమోదు చేశామన్నారు. ప్రదీప్ కుటుంబ సభ్యులతో కలిసి తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. లేదంటే ఛార్జి షీట్ నమోదు చేసి కోర్టుకు సమర్పిస్తామన్నారు. ఇకనుంచి సెలబ్రిటీలను ట్రాఫిక్ అవగాహన ప్రచారానికి వినియోగించే సమయంలో వారి ఆహారపు అలవాట్లను కూడా పరిగణలోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## అమ్మ వారికీ భద్రత కరువైంది : వైసిపి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తెలుగుదేశం పార్టీ పాలనలో అమ్మవారికీ భద్రత కరువైందని వైసిపి అధికార ప్రతినిధి టిజెఆర్ సుధాకరబాబు పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బెజవాడ కనకదుర్గ దేవాలయమంటే తెలుగుదేశం పార్టీ కార్యాలయమో లేక ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసమో కాదన్నారు. ఈ ఆలయాన్ని ఇష్టమొచ్చినట్లు తెరవడానికి ఎవరికీ అధికారం లేదని, తాంత్రిక పూజలు చేసిన టిడిపి నేతల చర్యతో కోట్లాది హైందవ భక్తుల విశ్వాసం దెబ్బతిన్నదని విమర్శించారు. గుళ్లో ఏం జరిగిందో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. లోకేష్‌కు రాజయోగం కోసమే ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఈ పూజలు చేయించాడని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

## జన్మభూమి కాదు... జాదూ భూమి

### నిమ్మకూరుకు లోకేశ్ ఏం చేశారు? : ఎమ్మెల్యే ఆళ్ల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం...జాదూ భూమిలా కొనసాగుతోందని వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. గత జన్మభూమిలో వచ్చిన అర్జీలను చెత్తబుట్టలో పారేసి, ఇప్పుడు కొత్తగా సాధించేదేమిటని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రేషన్ కార్డులు, పింఛన్లు అంటూ మభ్యపెడుతున్నారన్నారు. 19 లక్షల ఇళ్లు, 2 లక్షల రేషన్ కార్డులు, 4 లక్షల పెన్షన్లు ఇస్తామని చెబుతున్నారంటే, ఇంతకుముందు నాలుగు విడతల జన్మభూమిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఒప్పుకున్నట్లేనా అని ప్రశ్నించారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలే స్వయంగా వచ్చి చంద్రబాబు నాయుడి మోసాలను వివరిస్తున్నారని చెప్పారు. జన్మభూమి సభలకు ప్రజలు రావడం లేదని, టీచర్లను, విద్యార్థులను బెదిరించి సభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. లోకేశ్ తండ్రి మించి మోసగిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరును దత్తత తీసుకుని ఏం ఉద్ధరించారని ప్రశ్నించారు. అక్కడ శిథిలావస్థలోని ప్రభుత్వ పాఠశాల, వాటర్ ట్యాంక్ ఫొటోలను ఈ సందర్భంగా విడుదల చేశారు. గుడివాడ ఎమ్మెల్యే తన నియోజకవర్గంతో పాటు నిమ్మకూరు అభివృద్ధికి ఎస్‌డిఎఫ్ ఇవ్వాలని కోరినా పైసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు.

# అవినీతి పాలనకు అంతిమ గడియలు

## పేదవారికి ఉచిత చికిత్స : జగన్



సదుం మండలంలో ధాన్యాన్ని తూర్పార పోస్తున్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి - సదుం**

అవినీతి పాలనకు అంతిమ గడియలు దగ్గర పడ్డాయ ని వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసంకల్ప యాత్ర 53వ రోజు సదుం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతి కురవపల్లిలో ప్రారంభమై గాండ్లపల్లి, కమ్మవాండ్లపల్లి, కందూరు రోడ్డుక్రాస్ నుంచి రెడ్డివారిపల్లి మీదుగా సదుం గ్రామం బస్టాండ్‌కు యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చి న హామీలలో ఏ ఒక్కటీ అమలు చేసిన పాపాన పోలేద న్నారు. అదిచేస్తాం, ఇది చేస్తాం అని కల్లబొల్లి మాటలు చెప్పడమే తప్ప చేసిందేమీ లేదన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుందని నమ్మిన నిరుద్యోగులు నాలుగేళ్లుగా నిరీక్షిస్తూనే ఉన్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే దీర్ఘకాలిక జబ్బుల బారిన పడిన పేదవారికి ఉచిత చికిత్స అందిస్తామన్నారు. నవరత్నాల్లో పొందుపరిచిన ప్రతి కార్యక్రమాన్నీ తూచా తప్పకుండా అమలు చేయడానికి ముందుంటామన్నారు. సదుం బస్టాండ్‌ను డిపోగా ఏర్పాటు చేస్తామన్నారు. సదుం నుంచి బట్టువారిపల్లి, కొండవారిపల్లి, చీకలచేను గ్రామంలో బస చేశారు. పుంగనూరు ఎంఎల్‌ఏ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తండ్రి బాటలోనే జగన్ పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకుంటూనే, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ ఏర్పాటు చేసినా పూర్తిచేయడానికి అధికార పార్టీ చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. ఈ యాత్రలో ఎంపి మిథున్‌రెడ్డి,తంబళ్లపల్లి ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు ఎంఎల్‌ఏ చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలి

### శ్రామిక మహిళా కమిటీ, సిఐటియు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

లైంగిక వేధింపులకు పాల్పడ్డ గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ, సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేశాయి. ఈ మేరకు శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ కె ధనలక్ష్మి, కో కన్వీనర్ కె సుబ్బరావమ్మ, సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఏంఎ గఫూర్ శుక్రవారం వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. బాధిత యువతి ఇచ్చిన సాక్ష్యాధారాలను పరిశీలించి ఆమెకు న్యాయం చేయాలని, లైంగిక వేధింపులకు పాల్పడిన గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో ప్రముఖ వ్యక్తులు యువతులకు అనేక భ్రమలు కల్పిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతులను పంపించి లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లుగా జరుగుతున్నాయని తెలిపారు. బాబాలు, స్వామీజీలు, రాజకీయ నాయకులు, మంత్రులు వంటి వారు విద్యార్థులు, మహిళలపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు వారి జీవితంలో అంతర్భాగమయ్యాయని, 2013లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయటంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సుప్రీంకోర్టే నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు నోడల్ ఆఫీసర్లను నియమించలేదని తెలిపారు. అంతర్గత కమిటీలు లేవని, అరకొరగా ఉన్న అవి నామమాత్రంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. లైంగిక వేధింపులు వెలుగులోకి వచ్చేవ తక్కువని, రాజకీయ నాయకులు మద్దతునిచ్చి కేసులు లేకుండా చేసే ఘటనలున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మహిళా సంఘాలను కలుపుకొని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68